ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



25 నయాపైసలు

19-2-1958

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



బుద్ధుని కల్యాణము

[సారనాథ్ విహార్‌లోని చిత్రము]

—ఫోటో: డా॥ సి. జి. కె. రామానుజం, గుంటూరు.



"దేవదేవు పూజార్థము"

—[illegible]

సంవత్సర చందా
రు. 13-0-0
విడిపత్రిక 25న.పై

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

సంపుటము 52
సంచిక 26
19-2-58

Founder : K. NAGESWARA RAO

హేవిళంబి ఫాల్గుణ శుద్ధ పాడ్యమి బుధవారం

★ విషయానుక్రమణిక ★

★ ముఖచిత్రం : "గంగాగారి సంవాదం"లో కృష్ణకుమారి ★

వచ్చేసంచిక "వనితాలోకం" లో ప్రత్యేక వ్యాసం:

"నా ఎనభయ్యేళ్ల అనుభవాలు"

★

నేటి నాగరిక యువతులకు ఒక "ముసాలి మామ్మ" సలహాలు

ప్రసూతి చికిత్సలో ప్రసిద్ధి గాంచిన

గుంటూరు కుగ్లర్ ఆసుపత్రి

వజ్రోత్సవం

డాక్టర్ అన్నా ఎస్. కుగ్లర్ 1883 లో భారతదేశానికి వచ్చింది. ఆమె గుంటూరు ప్రాంతపు స్త్రీలకు వైద్యసహాయము చేయ నిశ్చయించుకుంది. రెండు సంవత్సరాల తర్వాత, 1885 లో గాని ఆమెకు అమెరికన్ మిషనరీ అధికారులు ఔషధశాల నేర్పరచుకొని పని ప్రారంభించడానికి అనుమతి ఇవ్వలేదు. మొదటపట్టణంలోని ఒక అద్దె ఇంటిలో తన ఔషధశాలను ప్రారంభించింది. ఆమె 1889 లో సెలవుపెట్టి స్వదేశానికి తిరిగి వెళ్ళే లోపుగా అనేక ఔషధశాలలను గుంటూరు చుట్టుపక్కల నేర్పరచి మిక్కిలి ఉత్సాహముతో సేవచేసింది. సెలవు అనంతరం తిరిగి వచ్చి గుంటూరుకు ఉత్తర భాగములో 17 ఎకరాల స్థలము సేకరించి ఆసుపత్రి భవననిర్మాణానికి పూనుకున్నది. 1892 లో దానికి శంకుస్థాపన జరిగినప్పుడు ఎక్కువమంది హాజరవుతారని భావించి తగిన ఏర్పాట్లు చేయించింది కాని, బహు కొద్దిమంది మాత్రమే వచ్చారు. ఆహ్వాన పత్రాలలో నిధి సమర్పణలను స్వీకరిస్తామని వుండడమే ఈ గైర్ హాజరుకు కారణం.

ఆసుపత్రి భవన నిర్మాణము పూర్తి అయి రోగులకు తొలిసారిగా ప్రవేశమిచ్చి (1898లో) సరిగా 60 ఏళ్ళయింది. అందుచేత కుగ్లర్ ఆస్పత్రికి ఇప్పుడు (ఫిబ్రవరి 15 న) వజ్రోత్సవం జరుగుతున్నది. ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సంజీవరెడ్డి దీనికి అధ్యక్షత వహిస్తున్నారు. మొట్టమొదటిలో ఆస్పత్రినిర్వహణ కష్టతరమే అనిపించింది. కాని డా॥ కుగ్లర్ చాలా సామర్థ్యంకల మనిషి. ఆస్పత్రి ప్రహరీ నిర్మాణానికి ధనసేకరణకై ఆమె స్వయముగా దాదాపు 50 గ్రామాలకు కాల్వలమీద పడవలలో ప్రయాణంచేసింది. కాల్వకు చాలా దూరంగా వున్న గ్రామాలకు ఆమె తన తెల్లని గుర్రముపై వెళ్లేది. తెల్ల గుర్రంమీద వస్తున్న ఆ చల్లటితల్లి తమకు రోగవిమోచనం కలిగిస్తుందని గ్రామీణులు విశ్వసించేవారు. ఆమె స్ఫురద్రూపము, శ్వేతాశ్వము గ్రామ ప్రజలను విశేషంగా ఆకర్షించినవి. అవసరమైన ధనం సేకరించి ఆమె తన ఆశయాన్ని సఫలీకృతం చేసుకోగలిగింది. గుంటూరు చుట్టుపట్ల తాలూకాలకు ఈ ఆసుపత్రి ఈ క్రిందివిధముగా (1898 నుండి, నేటివరకూ: సేవచేసినట్లు వివరాలు తెలియజేస్తున్నవి.

చికిత్స పొందిన స్థానిక రోగుల సంఖ్య, 1,09,698.

గుంటూరు పట్టణంలో వైద్య సహాయం పొందిన ఆగంతుక రోగుల సంఖ్య: 12,87,401.


తెనాలి పట్టణంలో వైద్య సహాయం పొందిన ఆగంతుక రోగుల సంఖ్య: 1,18,948.

శస్త్ర చికిత్స పొందిన వారి సంఖ్య: 14,310.

కాన్పుల సంఖ్య: 17,326.

డా॥ కుగ్లర్ వైద్యశాల ప్రధానభవన నిర్మాణానికి ముందే, ఔషధశాలా భవనం కట్టించి పని ప్రారంభింపజేసింది. అదే ఈరోజువరకూ ఆగంతుకులకు చికిత్సా భవనముగా వినియోగపడుతున్నది. ఆస్పత్రి భవన ప్రారంభోత్సవం జరిగినవెంటనే డా॥ కుగ్లర్ తన సేవాకార్యక్రమంలో మూడు ముఖ్య సూత్రాలను పాటించదలచింది. అవి ఆమె సత్శీలానికి ప్రతిబింబాలు. అవి ఏవంటే:

ఆశయం: ఏసుపేరుతో ప్రజలకు సేవ



డా॥ అన్నా ఎస్. కుగ్లర్

[ఆసుపత్రి స్థాపకురాలు]



కుగ్లర్ ఆసుపత్రి సింహద్వారం.

గుంటూరు కుగ్లర్ ఆసుపత్రివజ్రోత్సవం




డా॥ పాల్ ఎఫ్. డర్క్సెన్, ఎం. డి.
[ఆస్పత్రి సూపరింటెండెంట్]

చేయడం మావిధి.

నియమం : ఇతరులు నీకేమి చేయాలని ఆశిస్తావో దాన్నే నీవు వారికి చేయాలి (మత్తయి).

గమ్యం : దేవుని మెప్పు పొందడానికి సేవానిరతితో పనిచేయడంలో సిగ్గుపడ వలసినది లేదని నిరూపించాలి.


ఈ ఆశయాలు ప్రజలు తెలుసుకోడానికి వీలుగా వైద్యశాల గోడలపై చిత్రితము లైనవి. మొదటే ఆశయానికి అనుగుణంగా ఉపచార శిక్షణ పాఠశాల (నర్సెస్ శిక్షణాలయం) వెలిసింది. అవసరాన్నిబట్టి క్రొత్త నిర్మాణాలు సాగినవి. 1911 లో శిశు చికిత్సాశాఖకై ఒక అంతస్తుగల ప్రత్యేకభవనం నిర్మించారు. తర్వాత రెండో అంతస్తుకూడా ఏర్పడింది. శిశు చికిత్సాలయాన్ని పై అంతస్తుకు మార్చి క్రింది అంతస్తులో "ఎక్స్-రే" యంత్రస్థాపన జరిగింది. 1915లో మద్రాసు గవర్నరు పెంట్లాండ్ చే ప్రసూతి చికిత్సాలయము, శస్త్ర చికిత్సాలయము ఆవిష్కరింపబడినవి. తద్వారా వైద్యశాలకు స్వయం సంపూర్ణత చేకూరింది. తర్వాత 1954 లో మరికొన్ని క్రొత్తనిర్మాణాలు పూర్తిఅయినవి.



కుగ్లర్ ఆస్పత్రిలో ప్రసూతిభవనం.

1930 లో గుంటూరు పట్టణం లో నే దేహం చాలించే వరకూ డా॥ కుగ్లర్ తన వైద్యశాలలో నిర్విరామంగా పని చేస్తూ వుండేది. ఆమె మరణానంతరము డా॥ బీక్ కొన్ని నెలలు కార్యభారము వహించింది. అటుపైన డా॥ కౌజిల్, డా॥ మోర్గన్ అను వారు కొంతకాలము సేవచేశారు. డా॥ డి. రేమరు ఈకుగ్లర్ ఆసుపత్రిలో 1920 మొదలు 1928 వరకు ఉపచారిణిగా పనిచేసి అటుపైన వైద్యశాస్త్రం అభ్యసించడానికై ఆమె రికాకు పోయింది. అచట వైద్య శిక్షణ పూర్తిగానే భారతదేశానికి తిరిగి వచ్చి వైద్యశాలలో పనిచేసింది. డా॥ కుగ్లర్ తర్వాత ఇక్కడ ఎక్కువ కాలం సేవ చేసిందిఆమే. 1954 వరకూ సేవచేసి ఉద్యోగ విరమణపై స్వదేశం వెళ్లిపోయింది. జరిగిన మూడున్నర సంవత్సరముల నుండియు డా॥ పాల్, యఫ్. డర్క్సెన్‌గారలు వైద్యశాలాధ్యక్షత వహిస్తున్నారు. ఈ సంవత్సరాంతంలోగా డా. కె. కాంతనాథ్ (ప్రధమ భారతీయుడు) కుగ్లర్ వైద్యశాల కార్యభారము వహించబోతున్నారు.

ఈ వైద్యశాల చరిత్ర తొలి రోజులలోనే ఉపచారిణులకు (నర్సెస్‌కు) శిక్షణ ఇవ్వవలసిన అవశ్యకత గుర్తించబడింది. ఈ విషయంలో మిస్. కాదరిన్‌ఫాస్ చేసిన 25 ఏళ్ల కృషి ప్రశంసనీయమైనది. తొలి సారిగా శిక్షణ తరగతి 1899 లో ఆరంభమైంది. మొదట. రెండు సంవత్సరముల శిక్షణ, ఆ పిమ్మట మూడేళ్ళ శిక్షణ ఏర్పాటయింది. అరుమాసముల మంత్రసాని శిక్ష



నర్సుల పాఠశాల ; వారి నివాసభవనం.

లనుకూడా చేర్చారు.

1938 లో నర్సుల శిక్షణ ఉత్తమ శ్రేణికి మార్పు చెందింది. శిక్షణను ఆంగ్లభాషలోనికి మార్పు చేశారు. ఈ శిక్షణాలయము దక్షిణ భారతదేశం మొత్తంమీద సుప్రఖ్యాతమై విలసిల్లింది. యావదాంధ్రదేశం నుంచే గాక, పెక్కుమంది విద్యార్థినులు కేరళ నుంచి కూడా వచ్చి పట్టభద్రులైనారు. వారు నేడు భారతదేశమందు నలుమూలలా సేవచేస్తున్నారు. మిస్ థియోడోర, శ్రీ. వియోదోయర్ ఫెర్ అనేవారు ఈ శిక్షణాలయంలోనూ, వైద్యశాలలోనూ 21 ఏళ్ళు సేవచేశారు. 1955 నుంచి మిస్. యాలిస్ బత్రయా (కుగ్లర్ ఉపచారిణీ పాఠశాలలో పట్టభద్రురాలు) అనే ఒక భారతీయ ఉపచారిణి ఇచ్చట ఉపచారకాధ్యక్షురాలుగ పనిచేస్తున్నది. 1958 జనవరి మొదలు ఈ కార్యభారాన్ని మిస్. యస్. సౌభాగ్యం వహిస్తున్నారు.

1935 లో పురుషులకు కూడా ఒకశాఖ కేటాయించారు. గుంటూరు పట్టణంలో కుగ్లర్ వైద్యశాల అనేకవిధాల ప్రథమస్థానమలంకరిస్తున్నది. ఈ పట్టణమునకది మొదటి వైద్యశాల. అంతేకాదు విద్యుత్సహాయమును, ఎక్సరే యంత్రమును తొలిసారిగా పొందిన చికిత్సాలయం. దక్షిణ దేశమున ఉపచారిణుల పాఠశాలను తొలిసారిగ స్థాపించినది కుగ్లర్ వైద్యశాల. దక్షిణ భారతదేశమున మిషనరీలు ప్రప్రథమముగా ఏర్పాటు చేసిన వైద్యశాలలలో ఇది ఒకటి. తెనాలి మిషన్ పాఠశాలలలో మొదటి ఔషధాలయానికి 1916 లో నే ప్రారంభోత్సవం జరిగింది. ఈ వజ్రోత్సవ శుభసమయం అందరికీ అపరిమిత సంతోష హేతువు.




ఆస్పత్రిలో ఉదరకోశ శస్త్రచికిత్స జరుపుతున్న దృశ్యం.

ఈ వైద్యశాలపై ప్రజలకుగల కుతూహలానికి మరిఒక చిన్న ఉదాహరణము: ఏలూరు పుర వాస్తవ్యులగు రాజా యస్. భుజంగరావుగారు ఈ వైద్యశాలలో వైద్య సహాయంపొందే హిందువులకోసం, వారితో వచ్చిన బంధువుల ఉనికికి 1907 లో రాణీ చిన్నమ్మారావుగారి పేర ఒక సత్రం కట్టించారు. అంతేగాక, ఆ సత్రం నిర్వహణకు ప్రతి సంవత్సరమూ వారు కొంతరాబడి నేర్పాటుచేశారు.

కుగ్లర్ వైద్యశాల తెలుగు ప్రజలకు చేసిన ఉపకారాలలో అత్యుత్తమమైనది ప్రసూతిసేవ.

ప్రసూతి శాఖకు కావలసిన సదుపాయాలు పెంపొందించవలసి అవసరం ఇంకా ఎంతైనా వున్నది. ఈ ఉద్దేశ్యముతో నూతన నిర్మాణాలు చేయడానికి ఆర్థిక సహాయం చేకూర్చే ఉద్యమం ప్రారంభం కాబోతున్నది. ఈ ఆర్థిక సహాయాన్ని స్థానిక వ్యక్తులద్వారానే పొందాలని ఉద్దేశ్యం.

కుగ్లర్ వైద్యశాల 60 ఏళ్ల చరిత్ర ప్రజాసేవలో ఒక ఉజ్వల అధ్యాయం. ★



ముంధ్రా వ్యవహారంపై ఛాగ్లా విచారణ

న్యూఢిల్లీ మెల్లిగా 'కుంభకర్ణుడి నిద్ర' నుంచి మేలుకుంటున్నది. పార్లమెంట్ బడ్జెట్ సమావేశం ప్రారంభమైంది. ముందు ఛాగ్లా నివేదికమీద కోలాహలం చెలరేగుతుంది. ఛాగ్లా విచారణతో ప్రధాని నెహ్రూ గౌరవం మరొకసారి వెల్లడి అయింది. ప్రభుత్వంమీద అవినీతి నీడపడితే ఆయన ఎంత బాధపడతారో దీనివల్ల వ్యక్తమైంది. ఛాగ్లా నివేదిక మూలంగా పెద్ద పెద్ద మార్పులే జరుగుతాయి. సచివాలయంలో ఒక మార్పు అప్పుడే కనిపిస్తోంది. తమంతట తాము నిర్ణయాలు చెయ్యటానికి అధికారులు వెనకాడుతున్నారు. 'ఇట్లా చెయ్యి, అట్లా చెయ్యి' అని నోటిమాటగా చెప్పే పాతపద్ధతి పోతోంది; కల్తీలేని 'రెడ్ టేపిజం' అమల్లోకి వస్తోంది. కాస్త తప్పుచేస్తే యావజ్జీవితమూ చేసినసేవ అంతా బూడిదలో పోసిన పన్నీరైపోతుండగా, అధికారులు మాత్రం కష్టపడి ఎందుకు పనిచెయ్యాలిట?

ముంధ్రా వ్యవహారంమీద విచారణ చేయించారు, బాగానే ఉంది. ఈ వ్యవహారంలో జీవితభీమా కార్పొరేషనుకు బాగా లాభమే వచ్చిందనుకోండి. పార్లమెంటులో గాని, ఇతరులుగాని ఎవళ్లూ దాన్నిగురించి పట్టించుకునే వాళ్ళేగాదు. అందుచేత అసలు మనకి కావలసింది ముంధ్రా పుట్టుపూర్వోత్తరాలుకాదు. మనకి లాభించిందా, నష్టం వచ్చిందా అనే. ఇలాగే, హిందుస్థాన్ హౌసింగ్ ఫాక్టరీలో పెట్టుబడిపెట్టిన ఒక కోటి ఇరవై లక్షల రూ.లకీ తిలోదకాలిచ్చేశారు. ఈ ఫాక్టరీ వ్యవహారంమీదకూడా విచారణ జరిగింది. కాని ఏ వ్యక్తిమూలంగా, లేక వ్యక్తులమూలంగా డబ్బు కరాబైపోయిందీ తేల్చే విధంగా విచారణ జరగలేదు. అసలీ వ్యవహారాన్ని పైకి తీసింది కామత్ అనే ఆయన గనక కోటి రూపాయలదాకా నష్టం కలిగించిన ఈ "చిన్న" వ్యవహారాన్ని అంత శ్రద్ధగా ఎవరూ పట్టించుకోలేదు. అంటే ప్రజాధనం కొల్లపోవటం కూడా విచారణ 'జరిపించటానికి సరియైన కారణం కాజాలదన్నమాట! ఈ ముసుగులో గుద్దులాట వ్యవహారమంతా ఛాగ్లా నివేదికతో తేలిపోవాలి మరి!



భారతదేశంలో పర్యటిస్తున్న ఉత్తర వియత్నాం అధ్యక్షుడు డా॥ హోచిమిన్

స్వయంనిర్ణయాధికారసంస్థలకి ఏమాత్రం స్వయం నిర్ణయాధికారం ఉందీ అనేది కూడా ఈ దెబ్బతో తేలిపోవాలి. అసలిలాంటి సంస్థలకు ప్రభుత్వాధికారులుగాని, మంత్రులుగాని అధ్యక్షులుగా ఉండగూడదని ఒక అభిప్రాయం బలపడుతోంది. అనధికారుల్నే ఆ పదవికి నియమించాలని అంటున్నారు.

పారిశ్రామిక ఆర్థిక సహాయ సంస్థకు మొన్నటిదాకా అనధికార పారిశ్రామికుడొకాయన అధ్యక్షుడుగా ఉండేవాడు. ఈ సంస్థ చేసే పనులమీదకూడా ఒక విచారణ జరిగింది. విచారణ ఫలితాల్నిగూర్చి గట్టిగా అనుకోకపోవటమే మంచిది.

ఇంగ్లండులో బ్యాంకి రేటును పెంచుతున్న సమాచారం బయటికి పొక్కటందుకు లేగిన రగడను విచారణ చేయించటాన్నిగూర్చి, దాని తాలూకు నివేదికనుగూర్చి ఢిల్లీలోనూ, బొంబాయిలో ఛాగ్లా విచారణ సందర్భంలోను ప్రస్తావన వచ్చింది. ఆ కేసులో హాంకాంగ్ నుంచి వచ్చిన ఒక కేబిల్ ను పురస్కరించుకొని 10,25,458 పౌనుల సెక్యూరిటీలను అమ్మివేయటం జరిగింది. విచారణ సంఘం నివేదిక ఇలా ఉన్నది:

"మేము టెలిగ్రాములను, ఉత్తరాన్ని కూడా జాగ్రత్తగా పరీక్షించి చూశాము. బ్యాంకి రేటు పెరుగుదలను ఇది బయట పెడుతున్నాయనిగాని, సూచిస్తున్నాయనిగాని మాకు అనిపించలేదు. టెలిగ్రాములను వాట్సన్ ఒక రకంగా వ్యాఖ్యానం చేసినప్పటికీ, అది పరపతి సౌకర్యాలను తగ్గించటం ద్వారా ఏర్పడిన డబ్బు కొరతను గూర్చి ప్రస్తావిస్తుందే తప్ప, వడ్డీరేటు పెరగబోతోందని సూటిగాగాని, చాటుగాగాని ప్రస్తావించటం లేదని మా అభిప్రాయం. ఈ విషయంతో సంబంధం లేకపోయినా ఉత్తరాన్ని కూడా మేము పరీక్షించాము. దానిపై కూడా మేము అదే అభిప్రాయపడుతున్నాము. 'డబ్బు ప్రియంగా ఉంది' అనేమాట అప్పుడున్న పరిస్థితులపై తన అభిప్రాయమే తప్ప మరేమీకాదని కెస్విక్ చెప్పిన దాంతో

శ్రీ కృష్ణ
[ఆంధ్రపత్రిక ప్రతినిధి]

మేము ఏకీభవిస్తున్నాము.

ఒకని ప్రవర్తనను, పత్రాలను తప్పేమీ లేదని గాని, తప్పున్నదనిగాని రెండురకాలుగానూ అర్థం చెప్పటానికి వీలున్న ఇలాంటి సందర్భాలలో ఎవని ప్రవర్తనను విచారణ చేస్తున్నామో అతని గుణశీలాలను, నిజాయితీని నిష్పాక్షికంగా విలువ కడితేనే తప్ప ఏదీ నిర్ధారణ చేయటానికి వీలుండదు. డబ్ల్యు జె. కెస్విక్‌ను, అతని ప్రవర్తనలో ప్రతి పాయింటునూ నిశితంగా మేము క్రాస్ పరీక్ష చేసి చూశాము. అలా చూసిన తర్వాత అతడు సత్యమే చెబుతున్నాడని, ఇబ్బంది కలిగించే పరిస్థితుల్లో అతడు ఇరుక్కున్నప్పటికీ పూర్తి నిజాయితీతోను, ఔచిత్యంతోను అతడు ప్రవర్తించాడని మేము నిస్సందేహమైన తీర్మానానికి వచ్చాము. బారన్ కెస్విక్‌ను సలహా అడిగాడు. జార్డైన్ మాతిసన్ పట్ల విధేయత కొద్దీ అతడు సలహా ఇచ్చాడు. అది కూడా అయిష్టంగా ఇచ్చాడు. అతడు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ డైరెక్టరు కాకపోయినా, అప్పటి పరిస్థితుల్లో అతడు అదేవిధమైన సలహా ఇచ్చి ఉంటాడని మా నమ్మకం.

బ్యాంకి రేటును పెంచబోతున్నారని తెలిసేట్టుగా ఏ సమాచారాన్నీ డబ్ల్యు. జె. కెస్విక్ బుద్ధిపూర్వకంగా గాని, అప్రయత్నంగా గాని బయట పెటలేదని, అటువంటి సమాచారాన్ని అతడు స్వలాభానికి వినియోగించ లేదని మేము అభిప్రాయపడుతున్నాము."

* * *


భారతదేశంలో విదేశీయుల యాత్రలను ప్రోత్సహించటానికి విదేశీ విమానసంస్థలు తీవ్రంగా పనిచేస్తున్నాయి. ఇటీవల 'పాన్ అమెరికన్ ఎయిర్ వేస్' వారు పన్నెండుగురు ఆస్ట్రియన్ టూరిస్టు నిపుణులను న్యూఢిల్లీకి పంపించారు. ఆస్ట్రియన్ ప్రభుత్వ టూరిస్టు శాఖ డైరెక్టరొకాయన, ఇద్దరు ప్రముఖ ఆస్ట్రియన్ పత్రికా సంపాదకులు వీరిలో ఉన్నారు.

* * *

రెండవ పంచవర్ష ప్రణాళికనుగూర్చి మళ్ళీ తర్జనభర్జన సాగుతోంది. బొంబాయిలో మాట్లాడుతూ ప్రధాని ప్రణాళికనుగూర్చి చాలా ప్రస్తావించారు. పార్లమెంటు బడ్జెట్ సమావేశంలో దానిపై చర్చ ఘాటుగా నే జరుగుతుంది. "భారత పారిశ్రామికాభివృద్ధి ధోరణి" అనే విషయంపై ఇటీవల స్టీఫెన్ గార్విన్ (ఐ. సి. ఎస్. రిటైర్) అనే ఆయన ఇటీవల ఒక ఉపన్యాసం చేశారు. ఈయన ఇప్పుడు బ్రిటిష్ పరిశ్రమల ఫెడరేషనులో పని చేస్తున్నారు. ఈస్టిండియా సంఘం, ఓవర్ సీస్ లీగ్‌ల సంయుక్త సమావేశంలో ఈయన ప్రసంగించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ భారత (బ్రిటిష్) ఆర్థిక మంత్రి తమ ఉపన్యాసంలో ఇలా అన్నారు:

"ఆధునిక జీవితానికి ముఖ్యమైన ప్రాథమికావసరాలనుకూడా భారతీయులు ఇంకా సాధించుకోలేకుండా ఉన్నారు. కాని రాబోయే పంచవర్ష ప్రణాళికమూలంగా జీవన స్థాయిలో చెప్పతగిన మంచిమార్పులు కలుగుతాయని భారతీయులాశిస్తున్నారు. ఈ అద్భుత ప్రయత్నం ఫలప్రద మవుతుందని మనం ఆశించాలి. నియంతృత్వం ఉన్న దేశాల్లో తప్ప ఇతర దేశాల్లో ఇలాంటి ప్రయత్నం ఎప్పుడూ జరగలేదు. గార్విన్ చెప్పినట్లు భారతదేశం ఇప్పటిదాకా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో నే ఉంది. భారతదేశం బలప్రయోగంతో కూడిన పద్ధతులను అనుసరించడం లేదు. అయితే సిద్ధాంతరీత్యా కొంత బలాత్కారం తప్పటం లేదనుకోండి. ఎందుకంటే భారతదేశంలో ఇతర రాజకీయపక్షాలు ఏర్పరచుకునేందుకు స్వాతంత్ర్యం ఉన్నా కాంగ్రెసుపక్షం ఒకటే బలీయంగా ఉన్నందున, మనదేశంలో రెండు పక్షాలు బలంగా ఉన్నట్లు అక్కడ మరొక ప్రతిపక్షం బలమైనది లేనందున, రాజకీయాధికారం కాంగ్రెసు ఒక్కటే అనుభవిస్తోంది. నా మటుకు నాకు ఒకటి రెండు అనుమానాలున్నాయి. గార్విన్ చెప్పినట్లు మొదటి సమస్య ఆర్థికమైనది. దేశంలో గాని, దేశం వెలుపల గాని ధనం సేకరించే మార్గం కనబడటం లేదు. దేశంలోపలి పరిస్థితి చూస్తే, పన్నుల సమస్య నిజంగా బాధాకరంగా ఉంది. మన 400 కోట్ల పౌనుల బడ్జెట్‌తో పోలిస్తే భారత

(48-వ పేజీ చూడండి)



[ఉ ద్యో గ ప ర్వం నుం డి]

సీ. పాండవేయులఁ దగఁ బ్రార్థించి యందుల కెక్కుట యే నైన నరుగుదెంచి
కౌరవులకు బుద్ధిగాఁ జెప్పి రాజ్యంబు పాలుచేసిన మృత్యుపాశములకుఁ
దప్పరే వారలు దగవును నేర్పును గాదిరాఁద నిలుచుట నాకుఁ గీడ
నన్ను మన్నింతు రన్యాయంబు సొరని నా మాటకుఁ దా రొడఁబాటు లేక.

తే. యుండుదురె కేరడము లాడుచుండ్రు రేనిఁ, గవియు పాండవబాణాగ్ని గాదు సువ్వె
తమ్ముఁ దమలోభ మను చిచ్చు దరికొనంగఁ, దెగినవా రంబు పోదు రింతియ తలంప.

వ. అని పలికి వెండియు ని ట్లనియె.

ఆ. రోషమయ మహాతరువు సుయోధనుఁ డుర, స్కంధ మందులోన గర్ణుఁ డలరుఁ
గొమ్మ సౌబలుండు గుసుమఫలంబులు దు,శ్శాసనుండు మూలశక్తి తండ్రి.

ఆ. ధర్మజుండు ధర్మతరు వర్జునుఁడు ఘన, స్కంధ మనిలసుతుఁడు శాఖ కవలు
పుష్పఫలము లేను భూసురులును వేద,ములుఁ దదీయ మైన మూలచయము.

క. ఈ రెంటియందు నరసి య, సారం బిది గాఢసారసహితం బిది నా
నేర వలయు నదియును గా, కేరూపం బయ్యె నేని నీ కేమిటికిన్.

మ. ధృతరాష్ట్రుండును బుత్రులుఁ వనము కుంతీనందనుల్ సింహముల్
మతి నూహింప నసింహమైనవనమున్ మర్దింతు రెందున్ వనా
వృతవృత్తంబును గాని సింహములకున్ వేగంబ చేటొందుఁ గా
న తగం బొందుట కార్య మీయుభయము న్సంతుష్టిమై నున్కికిన్.

క. పరిచారకులై యుండుదు, రరివర్గవ్యతికరమున కగుదురు వీరిన్
సరిఁ దనకొడుకులు మెలఁగిన, తెరువున మెలఁగింపవలదె ధృతరాష్ట్రునకున్.

క. ఏ నీపనికై వచ్చితిఁ, దా నొప్పఁ దలంచె నొండెఁ దప్పం దలఁచెన్
దానన నెగడెద మే మ, మ్మానవనాథునకుఁ జెప్పు మామత మెల్లన్.

వ. అనిన విని సంజయుండు ధర్మతనయుం గనుంగొని య ట్లయినను గడు లెస్స గదా దేవా నావచ్చిన కార్యంబు సఫలంబయ్యెఁ బనివివియెద నని వాసుదేవునకు నట్ల విన్నవించి భీమార్జుననకులసహదేవ సాత్యకి ద్రుపదవిరాటుల నీక్షించి మీ యందఱచేత ననుజ్ఞాతుండన కదా పోయివచ్చెద నా యాడిన మాటలయం దేమియుం దగనియట్టివి లేవు గదా యనుటయుఁ బాండవాగ్రజుం డతని కిట్లనియె.

ఆ. పోయివత్తుగాక యీయున్న యందఱు, వినఁగ నాడి తీవు విశదభంగి
నొక్కమాటయైన నుచితంబు గానిది, గలదె యి ట్లనంగ వలయు నెట్లు.

క. ఎదు రున్న రూపు వలుకఁగఁ, దుదిఁ గటకటఁబడవు నీవు దుర్ణయమును జె
ట్టిదమును జెందును నగుపలు, కొదవదు నీ నాలుకకు నయోన్నత యెపుడున్.

క. నీ వొండె విదురుఁ డొండెను, గా వలయుం గాక యిట్టి కార్యంబులకున్
రా వేఱ కలరె తగువా, రీవినయము నేర్పు గలదె యితరుల కెందున్.

చ. అరిగినయప్డు పెద్ద లగు నందఱి విప్రులనెల్లఁ గాంచి యా
దరమున వారిసేమ ముచితంబుగ నారసి వెండి కాన్పు మీ

గురునిఁ బితామహుం గృపునిఁ గూర్తురు వారలు నాకు నా సమ
స్కారణము గాఁగ వారి కధిక ప్రియభక్తి నమస్కరింపుమీ.

సీ. మాతండ్రిఁ గని యేనుఁ బ్రీతి మ్రొక్కుటగాఁగ దండప్రణామంబు దగ నొనర్చి
దుర్వృత్తిఁ బోరయు నా దుర్యోధనుని సేమ మడిగితి నని చెప్పు మతనితమ్ముఁ
డగుటకుఁ దగియెడు నా దుస్ససేనుని కుశల మారయుము దక్కనుఁ గుమార
వర్గంబు నెల్లను వనితాజనంబుల నుచితంపుమై సుఖ మున్కి యడుగు

ఆ. విదురు శల్యుఁ గాంచి వినయంబుఁ దోఁపంగ, నాడు ద్రోణతనయు నక్కు సేర్చి
కొంటి ననుము బాహ్లికుని సోమదత్తు భూరిశ్రవసునిఁ దలఁచి ప్రియము నెఱపు.

వ. మఱియు వంశవంతులు వయోవృద్ధులు నగు భూపతులను గృతవర్మను గర్ణ శకుని సైంధవ ప్రభృతులను దక్కటి రాజలోకంబును గయ్యంబునకుఁ దోడువచ్చిన సకల దేశాధీశులనుం గని యెవ్వరితోడ నెవ్విధంబునం బలుకం దగు బ్రణామవినయబాంధవమైత్రీ వాత్సల్యంబులకు నయ్యైప్రకారంబుల మద్వచనంబులుగాఁ బలికి యుచితంబు మెఱయ నుపచరింపుము.

క. దాసీదాసజనముల కు,దాసీనముగాక యుండఁ దడయక రేం బ
త్త్రాసంగ మొంది శత్రు ని,రాసం బొనరించి తమ్ము నరసెద ననుమీ.

క. పోయిన మొగమున నచ్చటఁ, జేయుతెఱంగెల్ల నీకుఁ జెప్పితిఁ బిదపన్
మామయ్య పెద్దకొలువున, వాయోడక యిట్టనంగవలయుం జుమ్మీ.

చ. అనఘ భవద్బలంబునన యాపద యించుక లేక పాండు నం
దనులు నిజాప్తబంధుసహితంబు సుఖస్థితి నున్నవారు త
జ్జనకుని రాజ్యపీఠమున నమ్మద మొందఁగ నిల్పి శైశవం
బునన ప్రభుత్వ మిచ్చి తగఁ బ్రోచితి వారల విశ్రుతంబుగన్.

ఉ. ఇప్పు డుపేక్షసేసి కృపయేమియు లేక విహీనవృత్తి వా
రొప్పమిఁ బొందం జూచు టిది యొప్పునె యింతట నంతసింప రా
దెప్పుడు నంత కంజ నట యెక్కుడు గోరినఁ జాలకుండదే
యొప్పదె కూడి మన్కి మన కొప్పనివారలయుక్కు దక్కఁగన్.

వ. అని తదవసరంబునం బితామహుతో ని ట్లనుము.

చ. అడఁగఁగ నీక శంతనుని యన్వయముం గలిగించి తీవ యి
ప్పుడు దగ నీమతంబునన పొం దొడఁగూడఁగఁ జేర్చి పౌత్రులన్
నడికి సధర్మవృత్తికిని జావునకుం దొలఁగించి మన్చినం
బుడమిజనంబు రాజులును భూసురులున్ నినుఁ బ్రస్తుతింపరే.

వ. అని పలికి వెండియు.

క. ఇంతలు పుట్టినచోటను, శంతనునందన యహీనశాంతిపరుం డై
కౌంతేయాగ్రజుఁ డాలము, పొంతం బో నొల్లఁ డనుము బుధు లియ్యకొనన్.

సీ. ఆ సమయంబున నచ్చటివా రెల్ల వినునట్లుగా సుయోధనునితోడ
బాహుబలాఢ్యుల బలవిహీనులక్రియ వెడలంగ నడిచిన వెఱ్ఱితనము
నత్యంత చిరకాల మడవులఁ గొండల బాధలఁ బెట్టిన పరుసఁదనము
సభలోన నట్లు పాంచాల రాజాత్మజఁ దల పట్టి యీడ్చిన తులువతనము

తే. ధర్మపుత్త్రుండు సైరించెఁ దథ్యమీవు కురుకుమారుల నని మ్రింగికొనకు మొఱల
సొమ్మునకు నాసపడఁ దగ దిమ్ము వారి, పాలు వారలతోఁ గూడి బ్రదుకు మనము.

వ. ఏము కలహం బొల్లక పొందు గోరుట తనకు మేలు దన మనంబున దరికొను తృష్ణానలం బార్ప నొరు లర్థంబు పొరమించేసి యేన బుద్ధి సెప్ప వలసెఁ దన యొద్దం గల యోధవీరు లెయ్యెడల లేమి దెల్లం బయినను మాకుఁ జేదోడు ధర్మంబు గల దదియునుం గాక యఖిలలోకసేవితుం డైన కృష్ణుండు సెనుఁ బ్రాపు గావునఁ దమకు మమ్ము

గెలువం గోలఁదిగా దది యట్లుండె నేను భీమసేనాదులకుం దమకుం బెద్దవాఁడ నగుట వీరును దారును మదీయ ప్రార్థనాభంగంబు సేయక నా దగు శాంతియుఁ దాంతియుఁ జెల్లించి నన్నులజడిఁ బెట్టక పోరితంబుడిగి తమతమ ధనం బులుగుడిచి సుఖం బుండుట మన పెద్దలకుం దక్కటి బుద్ధిమంతులకును సంతోషం బగుఁ బెద్ద యీనోపఁ డయ్యెనేనిఁ గుశస్థలంబును వృకస్థలంబును వాసంతియు వారణావతంబును జాలుఁ గాదేని మఱియు నెందేని నొక్కటి యగు నట్లుగాఁ దనతోడఁబుట్టువు లేవురకు నిలువ తావు లయి దిచ్చిన సర్వశాంతియగు నట్లయిన నిందలి యందలి బంధుమిత్త్రసహాయజనంబులు గలసి నవ్వుచుం దెగడుచు నునికి మన మనంబులకుఁ బ్రియంబు సేయుఁ గురు పాంచాల యాదవ మాత్స్యులు పరస్పర ప్రీతిసంపాదకత్వసంపన్నులై బ్రదుకుట నాకుం గోర్కి యింతయు నమ్మహా పురుషునకుం దెలియం జెప్పు మనిన విని దేవా నీయానతిచ్చిన మార్గం బంతయు నడపెద మీతండ్రి నీకును దమ్ములకును వాసుదేవునకు నెట్లు ప్రియం బట్లు సేయువాఁడ తాత యనుచుం బ్రణామంబుసేసిన సంజయునకు ధనంజయుం డిట్లనియె.

క. బాలసఖుండవు నాకును, నీ లెస్సఁదనంబు నేము నీతి విడిచి దు
శ్శీలుర మగుటయు శైశవ, లీల మొదలు గాఁగ మును దెలియదే నీకున్.

మ. బలమత్తాకృతి యైన భీముఁ డను శుంభత్కుంభి సంరంభమున్
నిలిపెన్ నాఁడును నంకుశం బయి తుదిన్ నేఁడుం దదుద్రేకమున్
మలుఁగం జేయ నజాతశత్రుని కృపామార్ధ్యంబు చాలంగ వా
రల కేలా నయవిక్రమోచితవిచారక్లేశముల్ సంజయా.

వ. అని పలికి ధర్మతనయానుమతంబున సంజయునకు సపరివారంబుగా సముచితప్రకారంబున మజ్జనభోజనంబు లొనరించి మాల్యానులేపనాద్యుపచారంబులు సేయించి మణిభూషణచిత్రాంబరంబు లొసంగి వీడుకొల్పిన నతండును బాండవులను వాసుదేవుని వీడ్కొని చనియె నని చెప్పిన.

క. విని యత్యంతకుతూహల, మునఁ బొదలుచు సంజయుండు ము న్నచ్చటికిం
జనియెను నెవ్వరితో నే, మనియెను విన వలయు మునిజనాధిప చెపుమా.

వ. అని యడిగిన.

ఉ. భూరికృపానుషంగ మునిపుంగవచిత్తసరోజభృంగ సం
సారదవప్రవర్ష సురసంస్తుతదివ్యగుణప్రకర్ష దో
స్సారనిరస్తదైత్య శమశాలిమనస్స్థితినిత్య లోకని
స్తారకశీల నిర్వృతివిశాల నిరంజన పాపభంజనా.

క. శ్రుతిమౌళిరత్నమూర్తీ, శతధృతిముఖపద్మమండ సౌరభకీర్తీ
రతిపతిహితాహితాక్షా, సతతసమాచరిత భక్తజనసంరక్షా.

మాలిని. సదయవిమలదృష్టీ సంశ్రితాశీఃప్రవృష్టీ-హృదయకమలవాసా యిద్ధమాయావిలాసా
విదితనిఖిలభూతీ విశ్వరక్షాత్తహేతీ-సదనదుపచితాత్మా సంభృతానందవర్మా.

గద్యము. ఇది శ్రీమదుభయకవిమిత్త్ర కొమ్మనామాత్యపుత్త్ర బుధారాధనవిరాజి తిక్కన సోమయాజి ప్రణీతం బయిన శ్రీమహాభారతంబున యుద్యోగపర్వంబునందుఁ బ్రథమాశ్వాసము.

ఉద్యోగపర్వము, ద్వితీయాశ్వాసము

క. శ్రీ విస్తారకరణకరు-ణావేశోదార శశ్వదమలాకారా
భావవికార విదూర శు-భావహనామప్రకార హరిహరనాథా.

సంజయుఁడు ధర్మజుని సందిపల్కులను ధృతరాష్ట్రునకుఁ దెల్పుట

వ. దేవా వైశంపాయనుండు జనమేజయున కిట్లనియె నివ్విధంబున వీడ్కొని సూతనందనుండు పవనజవనంబు లగు నరదంబుతురంగంబులం దఱిమి ప్రొద్దు గ్రుంకునంతకుం గరిపురి సొచ్చి నగరి కరిగి యంతఃపురంబున నున్న ధృతరాష్ట్రునకుం దనరాక యెఱింగించి పుచ్చి యతనిం గాంచి యడుగుల కెఱఁగిన నమ్మహీవరుండును సత్కాదరంబున నెత్తి సమీపంబున నునిచినం గొలిచియుండి చేతులు మోడ్చి యిట్లనియె.

ఉ. దేవర పంపఁగాఁ జని యుధిష్ఠిరునిం గని వచ్చినాఁడ నా
భూవిభుఁ డప్రమేయగుణపూజ్యుఁడు మీకు నమస్కరించె నం

భావన సేసె నా కిచటిబంధుల నెల్లఁ దలంచె నీసుఖ
శ్రీ విభవంబులున్ సుతులసేమమున న న్నడిగెం బ్రసన్నుఁడై.

తే. అనుఁడు ధృతరాష్ట్రుఁ డిట్లను నయ్యజాత-శత్రునకు సేమమే యనుజన్ములెల్ల
సుఖులె బంధులు భృత్యులు సఖులు మంత్రి-వరులు సంప్రీతిమెయి నున్నవారె యచట.

వ. అనిన సంజయుం డి ట్లనియె.

క. వా రెల్లను భవదీయ, స్ఫారబలము గారణముగ సౌఖ్యంబున ను
న్నార మని పలుకుదురు నిజ, మారయగా నట్ల కాదె యది జననాథా.

క. ధర్మజునకు భోగంబులు, ధర్మువున ట్లింపు గావు ధర్మంబులలో
నిర్మలబుద్ధి నహింసకుఁ, గూర్మిగదుం గలఁ డతండు కురువంశనిధీ.

ఉ. మానుషశక్తి యొల్లదు సమంచితదైవము యూఁది యుండు నీ
పైన యతండు పుణ్యమునుఁ బాపముఁ బెట్టినవాఁడు నీవు నీ
సూనువశంబ కాని యొక చొప్పుఁ దలంపవు కర్ణసౌబలా
ధీనముఁ గార్యనిశ్చయము దెల్లము నీమత మొప్పఁ దేమియున్.

ఆ. అలుబిడ్డ లేనియట్టి త్రిమ్మరియగు, కొయ్య గాక కుదుటఁ గూడు పెట్టి
కుడుచువార లిట్టి క్రొవ్విదంబులు సేయఁ, జొచ్చు టిచ్చగించి చూతురయ్య.

చ. కొడుకులఁ గానరే నృపు లకుంఠితతేజుల నెందు నిమ్మెయిం
జెడు తెరు వైనచోఁ దగవు సెప్పక యొప్పరికించి చూతురే
పుడమి జనంబులెల్ల నినుఁ బ్రువ్వఁగఁ దిట్టఁగ వించు నున్కి నొ
చ్చెడు మది యెప్పుడుం జెవులు చీములుఁ గట్టెడుఁ గౌరవేశ్వరా.

చ. చలమున దుస్ససేనుఁడును సౌబలుఁడున్ మిముఁ బట్టి యార్చ బొ
మ్మలక్రియ నాడుచుండుదురు మానక నీవు సుయోధనుండుఁ దా
రలసి యొకప్డు పాండుసుతు లాగ్రహవృత్తికిఁ జొచ్చిరేని నీ
చలము బలంబునుం గులముఁ జక్కగఁ జేయరె యొక్క త్రేల్మిడిన్.

క. వినుము యుధిష్ఠిరు సైరణ, మనవారలు వెఱపుగా సమర్థింతురు డీ
కొనఁగాఁ దగరని వాసినఁ, గని యోటమి పెట్టినట్లు కౌరవనాథా.

క. అనుజులకు నడ్డపడి యే, మినిఁ జేయఁగ నీమిఁ జూచి మెచ్చితిగా కీ
వును సాదు రేఁగ నేని, న్వీను తలపోలమునన కాని నిలువదు సుమ్మీ.

చ. అనయము పుట్టె జూదమున యప్పుడ యొంతయుఁ జిచ్చు పెట్టి కా
ల్చినయది నీ యుపేక్షయ వశీకృతచిత్తుఁడు ధర్మసూతి మె
త్తనిపులి యెల్లవారలు నధర్మము నీవయిఁ బెట్టునంతకు
న్వినఁడును గానఁడుం బిదప నీకును నాకు మరల్పవచ్చునే.

చ. అనయము నొచ్చుచున్నయవి యంగము లెల్లను వేగవచ్చుట
న్మనము వశంబుగాదు జననాయక ప్రొద్దును బోయె నిప్పు డేఁ
బనివిని రేపు పుత్త్రులును బంధులు నాప్తులు నీవు నేర్పడన్
విన మనకార్య మంతయు సవిస్తరతం దగ విన్నవించెదన్.

ఆ. అనిన నట్లకాక యని సంజయుని వీడు,కొలిపి కొంతప్రొద్దు కురువిభుండు
కార్యచింత మునిఁగి కంచుకి నొక్కరుఁ, బిలిచి వేగ విదురుఁ బిలువు మనియె.

వ. వాఁడును సత్వరముగాఁ జని యతనిం దోడ్తెచ్చి కాన్పించిన సమ్మహీవరుం డత్యాదరంబున విదురుం దనయొద్ద కునిచికొని యతని కిట్లనియె.

చిటికెన వేలు ముడుచుకుంది!

వయస్సొచ్చింది. చదువూ పూర్తైంది.

బెండకాయ, బ్రహ్మచారి ముదర కూడదన్నారు పెద్దలు. "ఇహ వాడికి పెళ్ళి చెయ్యకుండా ఆగడానికి వీల్లేదంటే వీల్లే" దన్నారు పెద్దలంతా కలసి ఏకకంఠంతో నా పెళ్లి విషయమై ఒక నిర్ధారణ కొస్తూను.

"ఏది ఎలావున్నా ఈ వయస్సులో జరగాల్సిన అందచందాలు అవయస్సులో తీరటం అదో ముచ్చటరా" అంది దీర్ఘాలు తీసుకొంటూ మాఅమ్మమ్మ. ఇంతకూ అక్కడ మా నాన్నగారు వగైరా పెద్దలు వుండి పోయారుగాని లేకపోతే అవిడగారు "నా పెళ్లికొజ్జుల్లో" అంటూ ఆకాలం సంగతి ఏదో ఒకటి దృష్టాంతం చెప్ప కొచ్చేదేను.

ఇంతా విని మహబాగో అంది కాబోయే పెళ్ళికుమారుని మనస్సు. అదైన 'జరీగుడ్' అంటూ ఎగిరి గంతేసింది.

మరుక్షణంలో మరో మనస్సు కలుక్కుమంది. ఉప్పొంగిన కెరటాలు చప్పగా చల్లారిపోయి నిష్ప్రభాగా, నిర్జీవంగా కుర్చీలో కూలబడింది కళేబరం.

చిన్నతనం నుంచే అభిరుచులకు సరిపోయే ఓ అందాల ఆనందరాశిని చూచి, కన్నూ కన్నూ కలిపి, ఈడూ, జోడూ అనుకొని, వివాహం చేసుకుని హాయిగా మలయమారుతంపై తేలిపోతూ మేఘమాలికను మెళ్ళో వేసుకొని. వసంతోద్యానంలో కుహూ కుహూ మనే కోకిల కుహూకుంలో స్వేచ్ఛగా విహరించాలనికలలే కన్నాను.

యౌవనభానుడుదయించినా జరజర మింటిపైకి ఎగబ్రాకుతున్నా ఏ వీధిలోనే కొండ కడతానన్నే అమ్మాయే కంటి కగుపించ లేదు. కనీసం కాబోయే పెళ్లికుమార్తెనైనా ముందుగా చూసి జీవిత భాగస్వామినిగా చేసుకుంటానని ఊరట పొందాను. ఆందోళనాపూరితమైన మనస్సుతో కాలేజిని వదిలేస్తూ [illegible].

సూర్యోదయం అవుతోంది. పచపచలాడే పచ్చగడ్డిపై మంచుబిందువులు సూర్యరశ్మికి తళతళ వెండిలా మెరుస్తూ ఎన్నో ఊహలను కల్పిస్తాయి. ఆ మంచుబిందువులవలెనే ఈ ఊహలు కూడా కాలక్రమాన అణిగి పోతాయి.

అలానే నాకలలు కలలుగానే నిలిచాయి. పెద్దలవాళ్ళ ప్రయత్నాలు వాళ్ళు చేసుకు పోతున్నారు. అంతవరకూ మా అబ్బాయికి ఇప్పుడప్పుడే పెళ్ళిచేయ మంటూ, వచ్చిన వారి నందర్ని పంపించేస్తున్న పెద్దలు ఇక ఒక్కొక్క సంబంధాన్నీ తర్జన భర్జనలుచేసి చివరికి అంతస్తుకు సరిపోయిన సంబంధం ఒకదాన్ని ఎంచి పెళ్ళిచూపులకు వెళ్ళి వచ్చారు.

"వియ్యానికైనా, కయ్యానికైనా, సమ ఉజ్జీ ఉండాలన్నందుకు చక్కని సంబంధమే తారసపడిందిలే" అన్నాడు భుజా లెగరేస్తూ సంతోషంగా మా మేనమామ.

"పెద్దలదగ్గర్నుంచి చిన్నలదాకా వాళ్ళింట్లో చూస్తుంటేనే వారితో సంబంధం చేసి తీరాలనిపించిందనుకోండి" అన్నారు మా పినతండ్రిగారు.

కొండపల్లి భాస్కరరావు

"వీటన్నిటినీమించి ఆపిల్లతండ్రి ఓ పెద్ద వ్యవహారవేత్త. అదృష్టం కాస్త వక్రించి గాని, లేకపోతే ఆయనగారు చేసిన నిష్కళంక ప్రజాసేవకూ, ఆయనగారి తెలివి తేటలకూ ఏ అర్థికశాఖామాత్యుడో కావలసింది కాదుటండి," అన్నారు మా నాన్నగారు కాబోయే వియ్యంకుని గొప్పదనమంతా తనకే వచ్చినట్లు పొంగిపోతూ.

తక్కినవాళ్లు మేమేమాత్రం తక్కువా అనుకున్నారు కాబోలు. వాళ్ళూ చెప్పారు: "లంకంతయిల్లు; గదిగదీ తిరిగిచూసినా ఒక్క రవ్వ గాజులశబ్దం కూడా ఏమూలనుంచీ విన పడలేదంటే నమ్మండి" అనీ, "రజస్వల అయిన పిల్లలున్నారంటే తల్లిదండ్రులకే కనిపించర"ని ఇత్యాదిగా ఇంకా ఇంకా చాలా రెండురాత్రులు, రెండుపగళ్ళు ఏకధాటిగా చెప్తుంటూనే వున్నారు.

ఈ వెళ్ళినవారిలో ఒక్కరైనా నన్ను పిలిచి "కాబోయే నీ అర్ధాంగి వుంది చూడావు! రంభలాంటి పిల్ల. చంద్రబింబం లాంటి మొహం. ములక్కాయలాంటి నడుం. నిండుయౌవనాలతో, వెన్నెల వర్షించినట్లుంటే నవ్వు. ఆపైన, అపిల్ల బి. ఏ.-పోనీ క్లాసులు ఫైనల్-కనీసం తర్వాతం పాసైంది. పోనీ ఫెయిలైనాసరే, ఏదో అంతమాత్రం చదువుకున్నది. ఇక అపిల్ల గొంతెత్తిపాడిందంటే ఆ గానమాధుర్యానికి కోకిలలు సిగ్గుపడాల్సిందేననుకో."

అంటూ మూడుముక్కలు ముచ్చటతీరేలా చెబుతారేమో నని మేఘగర్జనకోసం ఎదురు చూసే నెమలిలా ఎదురుచూసి విసిగి వేసారి పోయాను.

ఇంతకూ పెళ్ళికూతురైనా, ఆవెళ్లిన పెద్దలకే చూపలేదట. అది వారికి ఆచారమే కాదుట. సంబంధం ఖాయపర్చుకొన్న తరువాతనే పిల్లను చూపిస్తారట.

"ప్రాణంబుల్ తావుల్ దప్పి" అన్నంత పనీ జరిగింది ఈవార్త వింటూనే. కాని మావాళ్ళకు చీమకుట్టినట్లయినా లేదు. పైగా సంబంధం స్థిరపరచుకోవటానికి ఘనంగా అన్ని ఏర్పాట్లు ఆరంభించారు.

వాళ్ళ దృష్టిలో పెళ్ళికొడుకు అనే వాడు ప్రధాన అప్రధాన పదార్థంగాను, తదితర లాంఛనాలు, ఏర్పాట్లు వగైరా అప్రధాన, ప్రధాన విషయాలే చాలా ముఖ్యంగాను కనుపించడమే గాక, మాట మాత్రంగానైనా, నాతో నా పెళ్ళి విషయమై సంప్రతించటం చాలా అముఖ్యమైన విషయంగా తోచివుంటుంది.

నిశ్చలమైన నీటిలో పెద్ద విసిరినట్టైంది. మనస్సంతా కలతవారి శాంతి శూన్యమైంది. ఏ పని చేస్తున్నా ఒకటే ధ్యాస. కాబోయే పెళ్ళి కుమార్తె కురూపా? రూపవతా? సజ్జనురాలా? గయ్యాళా? ఎలా తెలుసు కోవటమని మనస్సు తహతహ.

ఓనాటి సాయంకాలం చల్లగాలికి గోదావరిగట్టు చేరాను. గోదావరి నెమ్మదిగా నిండు చూలాలిలా ప్రవహిస్తోంది. ఒడ్డును తాకి కిలకిలనవ్వి తిరిగి తిర్యన వెనక్కిపోయే చిన్నచిన్న కెరటాలు ఆహ్లాదం చేకూరుస్తున్నాయి. మెల్లగా వీచే పిల్ల వాయువులు చల్లగా సేదదీర్చాయి.

రాత్రి ఎనిమిది గంటలయ్యేసరికి ఆ ప్రాంతమంతా చాలావరకు నిర్మానుష్యమైంది. ఆ చక్కని వాతావరణంలో ఏకోన్ముఖమైన భావాలు సమస్యా పరిష్కార ప్రయత్నంలో లీనమయ్యాయి.

హఠాత్తుగా బుఱ్ఱను బృహస్పతి స్పృశించాడు. మనస్సు ఆనందంలో పరవళ్ళు తొక్కింది. ఆవేశం వరదలుగా కట్టలు త్రెంచుకు ప్రవహించింది.



‘లేడికి లేచిందే పరు’గన్నట్లు, మర్నాడుదయమే అత్తవారింటికి ప్రయాణమై వెళ్ళాను. వెళ్తూనే ఆ ఊరిలో హోటల్లో ఒకగది—అద్దెకు తీసుకొని సామాను గదిలోకి చేర్చి, వెంటనే ప్లాను ప్రకారం వేషధారణ కుపక్రమించాను.

పాపిడిమార్చి తల నున్నగా దువ్వాను. పేంటు విప్పి నిక్కరు తొడిగి అలాంటిదే కమీజువేసుకొని ముక్కుకు కొడ తగిలించాను. బుగ్గదగ్గఱ పచ్చబొట్టు మాదిరిగా చుక్కపెట్టాను. (కాలేజీ నాటకాలలో ఫస్టు ప్రైజులు తెచ్చిన అనుభవం వృధా కాలేదు) పన్నుకు ఎనామిల్ రంగు పట్టించి హిట్లరు మీసాలను తిరుపతికి పంపించాను.

ఒక్కసారిగా అద్దంలో చూచుకొనేసరికి సరిగ్గా తేడాలేకుండా మా యింటో పనిచేసే నౌఖరు కుర్రాడు ‘తలుపులు’ గాతిల్లా తయారయ్యాను.

హోటల్ కుర్రాడి చేత అప్పటికే తెప్పించి సిద్ధముగా వుంచిన మామిడిపళ్ళ బుట్టను రిక్షాలో పెట్టుకొని, పెళ్ళివారింటికి వియ్యాలవారి నజరానా తీసుకువెళుతున్న నౌఖరు కుర్రాడులాగా బయలుదేరాను.

పెళ్లివారింటి ముందు రిక్షా ఆగటంతోనే సన్నగా, పొడుగ్గా నిసలయిన కాకిరంగులో మెరిసిపోతున్న పాతిక సంవత్సరాల కుర్రవాడు చటుక్కున చక్కావచ్చి “ఎవరికోసం?” అన్నాడు.

“మా నాన్నగారు ఇంట్లోనే వున్నారు. వచ్చేవరకూ ఆ బుట్ట అరుగుమీద వుంచు,” అన్నాడు విసరా లన్నీ విని.

‘ఇంతకూ యీ అవతారం పెళ్ళికుమార్తె అన్నగారా’ అనిపించి—అతగాడి దేహచ్ఛాయ మరోమారు గురుతుకువచ్చి ఒక్కసారిగా చాలా నీరసం వచ్చింది.

“బాబురావూ! ఎవరూ వచ్చింది?” అంటూ సన్నగా, పొడుగ్గా, చిలక ముక్కు రంగులో ఉన్న ఓ అరవై సంవత్సరాలు గలాయన హుందాగా అడుగులు వేసుకుంటూ వచ్చి ఠీవిగా నిల్చున్నారు, నన్ను ఆపాదమస్తకం పరీక్షచేస్తూ.

“ఇతని పేరు తలుపులటండి. రాజమండ్రి సంబంధం వారు మామిడికాయలు పంపించారుట” అని ముక్తసరిగా ఎరుకపరచాడా బాబూరావు నన్ను.

“అలాగా! అయితే ఆ పళ్ళబుట్ట ఆ అబ్బాయిచేత యింట్లో పెట్టించు” అని పురమాయించా రాయన.

మరదళ్ళ బృందం అచ్చట ముచ్చటగా అల్లరిచేసి, ఆడించి, కొసరి, కొసరి, తమ అక్క పేరు చెప్పించుకొని, విసిగించి, పాల తిచ్చి, కుడిపాదం పెట్టించి, గృహప్రవేశం చేయించాల్సిన అత్తారింట్లోకి పళ్ళ బుట్ట నెత్తిన పెట్టుకొని పాదం ఉంచాల్సి వచ్చింది. ఇందుకే కాబోలు పాలతోసహా రాయి మొయ్యాలన్నారు పెద్దలు.

ఆయన వెనకాలే వచ్చి సావిట్లో బల్లమీద కూర్చుని పందన్నర ప్రశ్నలు వేసి, తిరిగి తిరిగి జవాబులు చెప్పించుకుని అన్నిటికి “ఉహూ, ఉహూ” అంటూ కూర్చున్నాడు.

ఇంతలోకే గజేంద్రుడి పాలిటి మహావిష్ణువులా వాళ్ళ పాలేరు ఒకడు వచ్చి నన్ను రక్షించి ఉండకపోతే, ఆయన ఇంకా నన్ను ఎన్ని ప్రశ్నలు వేసివుండేవాడో తెలియదు.

వాణ్ణి చూస్తూనే ఆయన “చూడు ముత్యాలూ! ఈ తలుపుల్ని అలా తీసుకువెళ్ళి మనయిల్లూ, గొడ్లచావిడీ, ధాన్యపుచావిడీ అన్నీ చూపించి తీసుకురా” అంటూ పురమాయించి పంపించారు మమ్మల్ని.

అతను నన్ను యిల్లంతా తిప్పి గొడ్లసావిడి దగ్గరకు తీసుకువెళ్ళి జేబులోంచి పాసింగ్ షో ... దక్కన్ సిగరెటు ఒకటి తీసిచ్చి “కాల్చండి తలుపులుగారూ!” అంటూ బలవంతం చేసి ఇచ్చాడు. ఆ మాటా యీ మాటా మాట్లాడుతూ మెల్లిగా అమ్మగారిపైపు సంభాషణ మార్చాను.

లక్ష్మీదేవిలాంటి అమ్మగారుట ఆ పిల్ల బంగారపు బొమ్మనట. మొగాలకుప్పట నాలుగోక్లాసు చదువుతుందట. అంబోదర అన్నంతవరకూ హార్మోనియం నేర్చుకొని ఆపైన సాగక మానేసిందట.

ఇంతలోకే భోజనానికి పిలుపువచ్చింది. వంటగది ప్రక్కగావున్న అరుగుమీద వడ్డించారు భోజనం. అక్కడ ఆడవాళ్ళుయాకా అంతా చేరివున్నారని వేరే చెప్పటం అనవసరం. ఆ ప్రదేశం వాళ్ళ శ్రీ రాజ్యానికి రాజధానిగాబట్టి ఓమ్మనకుండా కూర్చుని

★ చిటికినవ్రేలు చురుక్కుమంది! ★

భోజనానికి ఉపక్రమించాను.

తలుపులు తెరుచుకొని ఓ పెద్దావిడ వచ్చి కమ్మనివాసన వెదజల్లే నెయ్యి అన్నం చేతినిండా వడ్డించి "సిగ్గుపడకుండా తిను నాయనా" అని హెచ్చరించింది.

వాళ్ళనాన్న మాటల ప్రకారం అత్తగారు ఆవిడే అయివుండాలి.

"మీరు వాళ్ళయింట్లో ఏం పని చేస్తుంటారు నాయనా?" అన్నారావిడ.

చాలాసేపు నోట మాటరాలేదు. చివరికి "నా రత్నాయిగారితో పాటే వుంటానండి" అన్నాను.

"జీతం ఏమిస్తారు?" మరో ప్రశ్న.

"చిన్నతనంనుంచీ వారి యింట్లోనే పెరిగానండి. తిండీ, బట్ట అంతా వారే యిచ్చి, ఖర్చుకు ఓ పాతిక రూపాయ లిస్తారండి" అన్నాను సీరియస్‌గా.

"అబ్బాయి ఎలావుంటాడు? తల్లి తండ్రి మాట వినేరకమేనా?"

'పాపం క్షమించుగాక!' అని మనస్సులో అనుకొని, పైకి "అబ్బాయిగారి కేమండి! మా వారిగా బాగానే వుంటారండి. తల్లి తండ్రి మాట వినకేమండి! కొంత తిక్క వచ్చినప్పుడుతప్ప" అన్నాను.

ఇలాగే ఆవిడ ప్రశ్నలు అడుగుతుంటే, నెమ్మదిగా జవాబులు చెప్తూనే వున్నాను. ఇంతకూ పెళ్ళి కుమార్తెను చూసే సాధన లేదేమిటా అని మనస్సులో మధనపడుతూనే వుంది. ధైర్యంచేసి, చూపమని అడిగేద్దామా అని అనుకొన్నాను. ఇంతలోకే గాజులు గలగల్లాడాయి. తలుపు ఒక్కసారిగా తెరుచుకుంది. ఒక్కసారిగా ఇల్లంతా తియ్యని సంగీత వాద్యాలు పలికాయి. వక్కపొడి వేసిన తాంబూలం పళ్ళెం తీసుకొచ్చి మా అత్తగారు నా ముందు నిలబెట్టారు.

"మా అమ్మగారిని చూడవోయ్ తలుపులూ!" అని హెచ్చరించారు కూడా.

తొణికిసలాడుతున్న యౌవనం. పచ్చని రంగు దేహచ్ఛాయ. ముగ్ధత్వం ఒలికించే విశాల నేత్రాలు. చక్కని గులాబి రంగు క్రేప్ చీర. ఒయ్యారంగా వంటిని పట్టే కంపుల్ని ఎత్తి చూపే పాలపిట్ట రంగు జాకెట్టు, మెడలో ఒకటంటే ఒకటే నెక్లెస్ మెడపైకెత్తి తన అదృష్టానికి గర్విస్తూ, కవ్విస్తూ చూస్తోంది. ఐతే ఆ పిల్ల కొత్తపాట్లేమో నన్న అనుమానం. అషాఢమాసపు వర్షపు చినుకుల్లాగా, చటుక్కున తొలకరించి క్షణంలో మాయమైంది.

"నమస్కారమండి అమ్మాయిగారు!" అన్నాను "తలుపులు"?. విశ్వంతో ఏమిటో మర్చిపోతున్న (అసలే, మర్చిపోయిన) పట్నం పిల్లల్ని చూచి విసిగిపోయిన ప్రాణికి, సిగ్గుగా, యిబ్బందిగా, యెదురుగా నిల్చున్న అమ్మాయిని చూస్తే ముచ్చటైంది.

అంతే, ఒక అంగలో ఆ పిల్ల, యింట్లోకి వెళ్ళిపోయింది.

"అమ్మాయిగారు బాగున్నారండీ. ఇంతకూ అచ్చింపేరిలా వున్నారు. మా అబ్బాయిగారు చూస్తే మరి ఒదురు తారటండి. అమ్మాయిగారి కొంత వుచ్చుకొనే తిరుగుతారు." అన్నాను. తిరిగి "తలుపులు" తన యజమానిని తల్చుకొని పరవశిస్తూ.

"ఔను! అలాగా!" అన్నారు దీర్ఘం తీసుకొంటూ ఆవిడ. ఒక్కసారిగా ఆ చుట్టు ప్రక్కలనుంచి అనేక కంఠాలు పక పక నవ్వసాగాయి.

భోజనం పూర్తైంది. అత్తగారు బట్టలు పెట్టించుకోమంటూ పదిరూపాయల నోటు యిచ్చారు. మామగారు మరో పదిరూపాయ లిచ్చారు.

తియ్యని తలపుల భారంతో, నిర్మలమైన మనస్సుతో యింటికి వచ్చాను.



ముస్తాబు

చిత్రకారుడు : బి. వి. సుబ్బయ్య, కడప.

మన సాహసక్రియకు అన్నలు, ఒదినలు అంతా ఆశ్చర్యపోయి చివరికి సంతోషంగా నవ్వేశారు. పెళ్ళికి ఏర్పాట్లన్నీ ఘనంగా జరిగిపోయాయి.

నిశ్చయించిన శుభముహూర్తానికి నిర్విఘ్నంగా వివాహమైపోయింది. వెంటనే పురోహితుడు అరుంధతీ నక్షత్రం దర్శనం చేయించి ఆపైన గృహప్రవేశం చేయమన్నాడు.

తీరా గడపదగ్గరకు చేరేసరికి చిన్నా పెద్దా రకరకాల సైజులలో మరదళ్ళ బృందమంతా హారతిపళ్ళెంతో సహా, హాజరై దారికాశారు. అదేమంటే "పేరు చెప్పందే అడుగు కదపటానికి వీల్లేదంటే వీల్లే"దన్నారు.

"ఎవరి పేరు చెప్పాలండి?" అన్నా అమాయకంగా.

"ఎవరిపేరు చెబుతే ఎవరు వూరుకుంటారు గాని, తలుపులు బావగారూ, మీ శ్రీమతి పేరు మీరే చెప్పండి" అంది ఒగదుగ్గాయి మరదలు.

"హా!" అంటూ నాటకంలో మాదిరిగా మూర్ఛపోవాలనిపించింది, ఒక్కసారి.

"బావగారికి ముక్కుకొడ ఏమైందే? చోద్యం! ఇంకా అదిపెట్టి అక్కకి అడ్డబాస చేయిద్దామనుకొంటున్నాను" అంది ఓ చిన్నారిచిట్టి మఱదలు మూతి మూడు వంకరుగా త్రిప్పుకుంటూ, గడ్డంక్రింద చెయ్యి ఆన్చి.

"తిండీ బట్ట యివ్వడమే కాకుండా పై ఖర్చుకు పాతిక రూపాయలిస్తారటే మన తలుపులు బావగారికి" అంది మరో అరిందా అమ్మాయి.

'తిక్కేసుకొచ్చినపుడు ఆయన మనిషి గాదని మొన్నవాళ్ళ తలుపులు చెప్పనే చెబితే, యింకా అల్లరెమిటే? పాండవతలకి. ఊపోతారా? పోరా!" అని చిన్నాళ్ళ వందర్నీ గదమాయించింది ఓ బుద్ధిమంతురాలు.

"వాళ్లతో ఏమిటిగాని, తొందరగా పేర్లుచెప్పేయండి. అవతల పాన్పు సిద్ధంచేసి వచ్చాను. అక్కడ ఫర్దాగా అక్కకొంగు పట్టుకొని వదలకుండా కూర్చుని బంతులాడుదురుగాని, రండి బావగారూ!" అంది ఒక మరదలు.

సమయంచూచి పాన్పు దగ్గఱ నేను కూడా ఒకటిఅందామనుకొంటూ ఆంజనేయదండకం పఠించే లోపుగా "హడావుడి పెళ్ళికొడుకు పేరంటాలతో పలాయనంచి తెగించాడన్నట్లు మీకంగారు ఎంతపని చేసిందో చూచారా?" అని మందలింపులు ఆరంభించినట్టయి చిటికెనవ్రేలు చురుక్కుమంది. అదురుబాటుగా "అబ్బా" అనే సరికి ఆడవాళ్ళ కోలాహలంతో హాలంతా దద్దరిల్లిపోయింది. ★



(గతసంచిక తరువాయి)

11

ఆ సంవత్సరం చలి మామూలు కన్నా హెచ్చుగా వుంది. వార్తాహరుడైన పీస పట్నంనుంచి చలి హెచ్చవటానికి కారణం తెలుసుక వచ్చానన్నాడు. "జపానోడు వోడిపోతూ అవుసు బాంబు యేసేసి నోడట! అది గాలిలోన కలిసిపోయి ప్రపంచక మంతా సుట్టేస్తోంది!" చాలా మంది ఈ వార్త నిజమని నమ్మారు.

ఈ బాంబు ప్రభావం గుడ్డి వెంకన్నకు గన్నెమ్మలాంటి గతిలేని ముదుసలికి బాగా చూపించింది. నీలి, కొద్దిగా చిరిగిన కోక ఇచ్చింది. "నాతల్లి ఆరోజుకి మన వడికింద యేయడానికి ఒక గుడ్డపాత యిచ్చుకొంటానే" అన్నది గన్నెమ్మ. నీలి చిన్ననవ్వు నవ్వి "మనవరాలు పుట్టే? అంది. పుల్లయ్య విని, "నోరుముయ్" అని కేక వేశాడు! "నా కొడుకు నాలాగ గరిడీలో ఘటుకుడు... దొర!" అన్నాడు దర్పంగా.

నీలి బదులు చెప్పలేదు. పుల్లయ్య ఊహలో పడ్డాడు. కొడుకుకు ఏయే విద్యలు యెలా నేర్పాలో! యేడాదికే యెగిరి మొగ్గ లెయ్యడా అనుకున్నాడు!

పీస జోస్యం చెప్పాడు. "ధరలు పెరిగిపోయి మనుషులు గంజిలేక మలమల మాడిపోతారు! పట్నంలో అప్పడే రాసనింగు వచ్చింది!. మనకీ వస్తాది. ఉన్నాడు లేదంటాడు; లేనోడు బతకలేడు. మనకు లేకపోయినా నువ్వూ నాను ఒకటని వుంటున్నాం. అప్పడా! నీకు నువ్వే-నాకు నానే! పట్నం అసలు అధ్వాన్నం! మరీ అధ్వాన్నం అయిపోతున్నాది! యెగిరేపిట్టను పంజరంలో పెట్టామంటాడు, గవర్నమెంటోడు! రేపొద్దున్న పండ్లూ గవర్నమెంటోడే తోమాలని అర్జీలు పెట్టుకుంటారట!"

అంతా చిత్రవిచిత్రంగా ఈ మాటలు విన్నారు. తలోలా అనుకున్నారు. గుడ్డి దాసుడు, తన అగ్రపీఠాధిపత్యం నిలుపుకోవాలని సాయంత్రం నీలమ్మ గుడిలో శివాలు వేశాడు. "మందుకి ముసలం వున్నాది. మనిషికి మనిషికి పులిపంది పోరడి అవుతాది! ఆకాసాన మేఘాలుండవు. దిగవని పచ్చని జాగావుండదు. దూతలు ప్రజలమీదపడి నాల్లేస్తాయి. కళకళ్లాడిన వూళ్లే దిబ్బలయిపోతాయి—"

చుటూ మూగినవారు చేతులు జోడించారు. "తల్లీ నివ్వే మొండిచెయ్యి చూపిస్తే, పిల్లల కడుపులు కూడవా? నువ్వతలుసుకుంటే ఆకాసాన మేఘాలు కరువా? నీ పిల్లలు పచ్చగావుంటేగదా నీకు సంబరో సేస్తారు!"

దాసుడు గొంతుక గగనానికి వినిపిస్తోంది. "ఓరీ నాయినలారా! నేను దూతలతో దెబ్బలాటకు దిగానురో! నా బిడ్డలకి అన్నానికి దూరంసేస్తానా? ఎవురుసెప్పిన జోస్యం మీరు నమ్మకండి తిమ్మన్నలాగ అత్తోరి కుండంటే యెత్తేటం— కన్నోరి కుండంటే మోయటం సెయ్యకండి! అంతా ఒకటే అని - గద్దుకాలానా, వున్నోలు పేదారోడకి నూసారంటే — మనిషికి మనిషి నమ్మారంటే — ఆకాసం బద్దలైనా, భూమి భుగభుగ మండిపోయినా ...... ప్రజకి డోకా లేదురా!"

దాసుడు తనపని నిర్వర్తించాడు. ఇక కోమటి పేరయ్య—యిదివరకు, పెద్దసోలతో ధాన్యంకొలిసి, చిన్నసోలతో వుప్పుయిచ్చి కొసరు వేసేవాడు. ఇప్పడు కొసరవెయ్యటం మానివేయటంతో, వూరంతా ధరలు పెరుగుతున్నాయని తెలిసింది. చిన్నపిల్లలు యేది కొనడానికి వెళ్ళినా బెల్లంపిసర లంచం దొరికేది. అది ససేమిరా యిప్పడు లేదు. తక్కెడ గుళ్ళు కొద్దిగా అరగదీస్తున్నాడు!

ఆ వూరికి మిలిటరీకి వెళ్ళిన ఒకే ఒకడు తిరిగి వచ్చాడు. రకరకాల వస్తువులు తెచ్చాడు. వూరంతా వాడిమాటలు చెప్ప

కున్నారు! జపానోడితో యిలాంటోలంతా దెబ్బలాటపెట్టి ఓడిపోనా డనుకున్నారు! పీస ప్రశ్నలు కూడా వేశాడు. టాంకు ఆకాసంమీదికి రెక్కలుంటే యెగిరి పోతాదా అని అడిగాడు. అది భూమిమీదకే అంటే — రామాయణంలో పుష్పకం— భారతంలోని అస్త్రాలు గురించి చెప్పకొచ్చాడు. మనభారతంలోని అస్త్రాలు,... వరుణాస్త్రం ... నారయణాస్త్రం, పాశుపతాస్త్రం......యివన్నిటి కిటుకు జెర్మనీ వోడు, యేనాడో అంకించుకొన్నాడు. ఆడు ఆకిటుకు మీద బాంబులు, టాంకులు, యియన్నీ సేస్తేకదా—యింగిలీషోడు, అమెరికనోడు, జపానోడు. నేర్చుకున్నారు!


పీస మాటలకు తెలివికి వూరంతా సంతోషించారు. "ఎంతపట్నాలు తిరిగి, యుద్ధం సేసివచ్చినా, గేనం ఒకరోజుకి వచ్చేస్తాదా?" అని అక్కడక్కడ చెప్పకున్నాడు పీస.

ఇంకో కొత్తవిశేషమేమిటంటె, పట్నంలో వున్నలాంటి చిన్న కాఫీ హోటలుకూడా లేచింది రోడ్డుమీద! ఇక్కడ దక్షిణాదినుంచి దిగుమతి అయిన యిడ్లీ సాంబారు తయారులోకి వచ్చింది. కోమటి పేరయ్యకొడుకు తనతండ్రిలా మూడుమణుగుల బరువుబస్తా భుజంమీద వేసుకొని, అన్ని దినుసులూ అమ్మకొనికి, వూళ్ళోనూ, పొరుగూళ్లోనూ తిరగగల సత్తువ లేక యేదైనా సూక్ష్మపద్ధతిమీద డబ్బు చేసుకోవటమెలానో ఆలోచించి, ఈ కాఫీ హోటలుపెట్టాడు. ఊళ్ళో ఎవరూ త్రాగుతారనికాదు త్రోవ పోయేవాళ్ళెవరైనా చేరుతారని. రష్యన్ వోడ్కాని, ఫ్రెంచి ద్రాక్షసారాయిని, మించిన పులిసిన చద్ది అన్నం చల్లని అంబలి, మరిగిన ఈ పల్లీయులు కాఫీహోటలుకు పరిగెత్తే పరిస్థితి మొదటరాలేదు. కొన్నాళ్ళవరకూ హోటలుకు బేరాలు లేకపోవటంచూసి అరువులు బలవంతాన ఇచ్చాడు. తీరుబడి వున్నప్పుడు రోడ్డుమీదకు వెళ్తున్న రైత్వారీప్రజ వెచ్చగా తియ్యగా వాసనగా-అందులోనూ అరువు—కొద్దిగా రుచిమాచేవాకు—రాను రాను పొద్దున్న ఈ పులిసిన చద్దిఅన్నం, ఈ కొత్తరుచ్యముల యెదురుగా ఆగలేక పోయింది! వూరిలో వయసువస్తూ యేపుగా పెరగవల్సిన పిల్లలు, ఈ అలవాటులో కొద్దో గొప్పో పడటం నేర్చారు.

రోజు లిలా కొద్దికొద్ది మార్పులతో, దొర్లుకపోతున్నయ్. యుద్ధకాలంలో పెరిగిన కాగితాలు ఇదివర కెన్నడూ, కాగితాల ముఖం చూడనివాళుకూడా చూస్తున్నారు. కాగితం రూపాయి చెల్లదని పుచ్చుకోని ముసలమ్మలుకూడా ఈ వూళ్ళో వున్నాను!

నీలి, పుల్లయ్య, ఈ మారేపరిస్థితులలో ఇరుక్కోక తప్పిందికాదు. చాలాలు యింట్లో వంటవగైరా పనులతోబాటు, భర్తకు పనిపాటలలో సహాయంచేస్తూంది.

నవిరికి పడమరగా, ఉత్తర దక్షిణాలుగా, ప్రవహిస్తున్నది వూరుదాటాక కొద్దిగా తూర్పుకు తిరిగివుంది. అక్కడ నవిరివేపు వున్న ఒడ్డుయిసుకమయమై, ఆ భూమ్మీద సరుగుడువనం, జీడితోటలు, విస్తారంగా వున్నయ్. అక్కడక్కడ యెత్తయిన తాటి చెట్లు—ఎక్కడో ఒకొక్క మఱ్రిచెట్టు కూడా వున్నవి. ఈ తోటల ప్రక్కనే లంకలున్నయ్. ఆ భూములకు నీటి సరఫరా, తూర్పువైపునుంచి కాలవగుండా రావటం చేత, శీతకాలంలో వరిపైరూ, మిగతా కాలంలో కాయగూరలు బాగా పండుతాయి. ఈ భూమికి మూడువైపులా వున్న యెత్తైన సరుగుడు తోటలు ...... తోటల నుంచి వచ్చే సన్నని సరాగాలు...ఆ ప్రక్కనే మెల్లగా ప్రవహించేనది... జీడితోటల్లోని రకరకాల పక్షులు — సరుగుడు తోటలో వున్న పచ్చని చిలకల గుంపుల కిలకిలలు...మఱ్రిచెట్లమీద పగలంతా నిద్ర పోతున్న గబ్బిలాలు—ఒంటి యీత చెట్టు మీద గూళ్ళలో వున్న బంగారు పిచ్చుకలు —ఏపుగా ఆకాశానికి అంటుకున్నట్లున్న బూజు తాటిచెట్టుమీద ముసలిగుడ్లగూబ, జడిపింపు—సాయంత్రం అయితే బిలంలో నుంచి బైటకువచ్చే నక్కలు — అదిగో దూరాన తూర్పు కనుమలపాయలు ఎంతినును పుగా వున్నాయో......హోరుమనే బం



శ్రీ కాళహస్తీశ్వరాలయ ప్రధాన గోపురం

★ దగా పడిన తమ్ముడు ★

గాలాఘాతపు ధ్వని-యిటురాకండా అడ్డుతున్నయ్ కామోసు!

ఈ జంట కలిసిమెలిసి యీ భూముల్లో పనిచేస్తూ ... అప్పుకొంత తీర్చుకోవాలని తాపత్రయ పడుతున్నారు. సంతలో ముందు పండబోయే కూరగాయలు అమ్మాలని, యిప్పుడే భూమిని గత్తంలో నింపి,... పుచ్చపాదులు తగిలిస్తున్నారు.

వేసవికాలం వచ్చింది. ఏటిలో నీరుపారటం లేదు. అక్కడక్కడ చిన్నచిన్న గుమ్మలున్నయ్. వాటిలో పశువులు, మనుషులు కూడా స్నానాలు చేస్తున్నారు. జాలరివాళ్ళు ,యెండుతున్న చెరువులు వూడ్చాక, పనిలేక వలలు అల్లుకోవడానికి నూలుసరిగాదొరక లేదని వాళ్లల్లో వాళ్ళు గుసగుసలాడుకోవటమేగాని, ఇంకా బయటకు అనటంలేదు. ఊళ్ళో సాలివాడు బట్టలమీద ఖరీదు హెచ్చించటంతో వూరంతా గుప్పుమంది నూలుదొరక లేదని... పాటినూలు ఖరీదు హెచ్చిందని రాట్నం వున్న ముసలమ్మల సంతోషం కొంతసేపైనా లేదు, నూలుతోపాటు దూదిధరకూడా పెరిగింది కాబట్టె.

నీలి ఇప్పుడు నిండుచూలాలైనా ఒకమూల కూర్చోలేదు. ఒకరిసహాయం లేకుండా ఇంటిపనిపాట్లు చేసుకుంటోంది. పుల్లయ్య కొడుకుకోసం రోజూ కలలుకంటున్నాడు. పలవరిస్తున్నాడు. నిద్రపోతున్న పెళ్ళంవైపు దీక్షగా చూసేవాడు. "కదులుతున్నాడు కడుపులో—నా కొడుకు! ఈడు పుట్టిన్నాడు, జలజల చినుకులురాలవా? వీడు మాటాడిన్నాడు, పక్షులుపలకవా? వీడ్ని నాగుండెలమీద వేసుకుని పెంచనా?... అవును నా కొడుకు! మీసాలుత్రిప్పిన మొనగాడై...వూళ్ళోనూ...పొన్నూర్లోనూ... నాయం నిజం చెప్పే పెద్దమనిషైతే... తనూ......బంగారం, ఊరూబంగారం— కొడుకో? ..అనుకున్నారు.

ఒకనాడు యిలా అనుకొని పొంగిపోయి ఒక్కగంతు వేశాడు. నీలికి తెలివివచ్చి "ఇంకా కునకలేదా?" అంది.

"ఎందుకు కునుకుతాను? నూడు నాకొడుకు. అయ్యా అని పిలుస్తాడు... అమ్మా అనిపిలడే!"

నీలి నవ్వకండా "నాకు కలొచ్చింది" అంది.

"నాకు తెలుసు. కలలో యేనుగగుపించింది కదూ! బలే కొడుకుపుడ్తాడులే!"

"కాదు!...ఆడపిల్లే పుట్టి అమ్మా అమ్మా అని పిలుస్తున్నట్టు"

నీలి మరి మాట్లాడకుండా కళ్ళు మూసుకుంది. పుల్లయ్య "నూద్దాం! మా అయ్య మల్లునాయుడు—మా పౌరుషమైన మనిషి.. సచ్చినప్పుడేమన్నాడు! మొగోడై పుటకపోతే...పికపిసికేనూ...?" అంటూ పెళ్లం ప్రక్కన రెండుచేతులు ముందుకుతోస్తూ కూర్చున్నాడు.

"ఎవరిపీక పిసుకుతావ్?" అంది.

పుల్లయ్య "ఎవరిదా?" అని జవాబులేక అగిపోయి, భార్యవైపు చూశాడు. నీలికళ్ళు విప్పింది. ఆ లేత వెలుగులో ఆ చిరునగవు నిండిన ముఖం, ప్రదీప్తంకాగా, పుల్లయ్య అలా చూస్తూ, మాటాడటం మరచిపోయాడు ఆమె తనచేతిమీద చెయ్యివేసింది. మెల్లగా నిమురుతూ, "సంతోషంవస్తే ఆపలేం! ఏడుపొస్తే ఓదార్చనేం."

"ఎవరికీ?" అన్నాడు పుల్లయ్య.

"నీకొక్కడుకే? నూడు, యిలాగ యెగిరిపోతున్నావుకదా, మనరాత సరిగాలేక ఆడపిల్లపుట్టే నువ్వు ఇంటికొస్తావా? కొడ్డయినా బిడ్డయ్యాక వదిలేస్తామా? కండే కొండవుతాది!—కొడుకుపుట్టే నాలుగు బిరుదులు తగిలించుకోగలవా? వాడు పెరగాలి, నలుగురిలో శెభాష్ అనిపించుకోవాలి?— అప్పుడు నువ్వు నాలుగు బిరుదులు తగిలించుకో! పిల్లలు పుట్టగానే సరా! పువ్వుపుయ్యాలంటె, చెట్టుకి బలమైన గత్తం రొయ్యడం సంగతి మరచిపోతే యేం నాభం?"

పుల్లయ్య మాట్లాడలేదు. ఇంతసేపూ పెళ్ళాం మాటాడుతున్నట్టు అనుకోలేదు. ఆకాశంమీదనుంచి యెవరో అంటున్నట్లనిపించింది. అలా తల నిమురుతూంటే నీలి నిద్రపోయింది.

ఆ మరుచటిరోజు, రాత్రి పెద్దవీధిలో, బుడబుడక్కల పాటకు, నిండుసూలాలు నీలికూడా వెల్లింది. మంచు పడకుండా దగ్గరగావున్న యింటి అరుగుమీద కూర్చుంది.

బుడబుడక్కల పద్మనాభం, స్త్రీవేషం వేశాడు. కొండముచ్చులాంటి ముఖం. మీసాలువున్న స్త్రీ—యెర్రటి నారచీర కట్టాడు. మాసికలున్న జాకెట్టు!

"ఒకవేపు మూతి, ఒకనరం పూత, ఒకసిర్రవేత, ఒక తీపు తీత!" బుడబుడక్ మంటోంది! నడివీధిలో పాతినకొయ్యకు రెండువేపులా కిరసనునూనె బుడ్లు—మధ్యనూనె పోసేగల్లా! వెనుకపాటకులు ఇద్దరునూనె పోసే వాడొకడు-ఈ బృందం వీధి నడుమకు వచ్చే సరికి, వూళ్లో పిల్లా పిచ్చికా, చిన్నా పెద్దా, నిండి పోయున్నారు!

ఈ నారచీరకట్టిన మీసాలుగల నారీరత్నం—ప్రార్థనకు లంఘించుకున్నది—

కమ్మని గొంతుక ఆలాపనతో—

"మము గన్నతలీ, ఓ మంజువాణీ?"

డొక్కు డబడబలాడుతోంది. వెనుక పాటకులు, యీమె అడుగుల్లో అడుగులు వేస్తూ అభినయం చేస్తున్నారు.

తన కొచ్చిన పాండితిని వెలగబోస్తున్నది యీమె :

"ఈ సభాయందున్న బూసురోత్తములునూ, రాజులునూ, వైశ్యరత్నంబులూనూ. మీరు సెలవిస్తే, పూర్తిగా పాడతాను."

పెదరైతు "నీకేయే కథలు వచ్చునురా!"

"కాకమ్మకథ, శశిరేఖా పరిణయం,—

బాణాసురుని యుద్ధం...ఇంకా...!

జనం నుంచి శశిరేఖాపరిణయం అంటూ కేకలు వినవచ్చాయి. మొదలుపెట్టి కొంత వరకు వచ్చాడు.

సుదతు లానందింప చూతేర వడిను
నడక మందంబాయె బాళిగన్నదుదుండె
నగలు భారంబయ్యె మిగుల వేవిళ్లు
చను మొనలు నలుపెక్క సతిమేను తెలు
పెక్క
నన్నుతాంగి సాల మున్న శివగౌర,
మందయానకు నవమాసములు నిండె...
శుభదినంబున........."

అర్ధరాత్రి దాటిపోయింది. నీలి వింటూ, వింటూ, కథ పూర్తి కాకుండానే యింటికి వెళ్లిపోయింది. పుల్లయ్య వెంట వెళ్లాడు!

ఇటు వీధిలో శశిరేఖ విరహం—'నన్నిడిచి పెట్టావ నా బావా...నా బావో...' అటు నీలికి చికాకుగా వుంది. గదిలో ఆదెమ్మప్ప యిరుగు పొరుగు ఆడమ్మలు దూరిపోయారు.

అంతా వాళ్లింట్లోనే జరుగుచున్నట్లు. పుల్లయ్యకి, నీలమ్మ పుట్టుకకి యే మంత్రసానో, ఇప్పుడూ అదే! పెద్ద బుట్టలాంటి పండిన జుత్తుతో వచ్చి నలుగుర్ని ప్రక్కకు తోసింది. ఆమెకు ఇది ఏ వెయ్యో పురుడు పొయ్యటమో!


పుల్లయ్య పైన అటూ యిటూ పచారు చేస్తున్నాడు. ఉండి ఉండి చిన్నమూలుగు వినిపిస్తూంటే, పుల్లయ్య కేజారెత్తుతున్నాడు. వేకువఝాము తూరుపు తెలతెల వారుతోంది! "కయ్"మన్న యేడుపు—పుల్లయ్య గతుక్కుమంటూనే ఒక్క ఎగురు ఎగిరాడు. అప్రయత్నంగా "మల్లూ!" అని నోటెంబడి వచ్చేసి ఒక్క మొగ్గవేశాడు.

లోనుంచే పూరుమంత్రసాని "మల్లమ్మ!" అంది. "అలాగయితే పెసంతకం తిరగబడ్తాది!"

లోనుంచి తలుపు తియ్యకుండానే ఆడమ్మ లంతా ఘొల్లుమన్నారు. "నాలుగు దిరుదులు తీసేసినాడు పుల్లయ్య."

ఈ మాటల వెనువెంటనే కొద్దిక్షణాల వెనకనే ఏడుపుతో ఇంటి పైకప్పు ఎగిరిపోతోంది. కొంత సేపయ్యాక ఆదెమ్మప్ప బైటికివచ్చి నవ్వుతూ "ఏడస్తందిగానీ... కూతురు ఎంత చక్కని సుక్కరా...ఎలా గుందంటే...తోటకూరలా జుత్తు..."

పుల్లయ్యలోని యేదో బలమైన కోరిక నమ్మక—"లేదండి — చూస్తాను ... మల్లు నాయుడు...మా అయ్య...సొరగానికిపోయి మోసం చేస్తాడా? కొడుకే నాను నమ్మను... లేదండి!"



శివార్చన

—చిత్రకారుడు: శీలా వీర్రాజు, రాజమండ్రి.

తీసుకొని లోపలికి బలవంతంగా వెళ్ళిపోతుంటే ఆదెమ్మప్ప చెయ్యిపట్టుకుని "మంచీచెడ్డా చూసి వెళ్తువుగాని..."

"ఏ చెడ్డాలేదు..." అంటూ లోనికి వెళ్ళిపోయాడు...ఆడమ్మలు పక్కకు తప్పుకున్నారు. ముసలమ్మ వెర్రినవ్వు నవ్వుకొంటూంది. ఇంకా బుడ్డీదీపం వెలుగుతూనే వుంది...ఆ వెలుగులో నులక మంచంమీద నీలి-ఆ ముఖం-రుషాను మధ్యనుంచి ఒద్దుకు చేరిన స్త్రీలాగ—ప్రక్కనే......నిజంగా పండులాంటి కొడుకే! పుల్లయ్య కండలు తిప్పుతూ-నవ్వుతూ...ఒక్కసారి మీసాలు త్రిప్పాడు...

కొడుకు ఇప్పుడే ఇలా వున్నాడుకదా... తనకంటె వస్తాడు...ఘటకుడు కాడా! ఆ చూపు మెల్లమెల్లగా నీలి అమాయక త్రు చూపులో కలిసింది—కళ్ళు ఖానలాడుతున్నయ్! స్త్రీ కింకేం కావాలి? ఇంతవరకు యౌవనంతో మురిసిపోతూ మొగుడ్ని ఆరాధించింది. ఇప్పుడు పండులాంటి సంతానం! ఆమె చూపుల్లో లేశమాత్రం గర్వం కలవాలి—నిజానికి కలిసింది! (ఇంకావుంది)

ఉద్యోగం దొరికింది

అప్పటికే ఆ మెట్రిక్యులేషన్ ఫీజు క్రింద అరఎకరం మాగాని హరించుకుపోయింది కర్పూరంలా. ఎలాగోలాగు ఆ సర్టిఫికేట్ హస్తగతం చేసుకున్న తరవాత భారతదేశంలో ఉన్న కాలేజీల్లో ఖాళీలు లేక తిన్నగా ట్రెయినింగ్ చదివి పేరు ప్రక్కన వేసుకోటానికి వీలులేని ఒక అర్హతను చేజిక్కించుకున్నాను.

నా విద్యా సంగ్రామంలో ఎన్నో సంవత్సరాలు కష్టపడి జయించుకున్న ఈ నా సర్టిఫికేట్లకు ఇన్నాళ్ళబట్టీ ఉద్యోగం రాలేదేమని నేను విసుక్కున్నప్పుడల్లా నాకేతోచేది వెంటనే, దేశంయింకా కొంత దిగజారి పోవాలిగావల్ను అని.

తమదని ఒక దమ్మిడీ కూడా లేని నిలయవిద్వాంసులైన కొంతమంది మిత్రులు, నా కెక్కడ ఉద్యోగమొస్తుందో, నే నేఊరు వెళ్ళిపోతానోనని నిరాశాపూరిత హృదయాలతో దిగులుపడేవారు.

ఒక రోజున, అంతకు ముందు మూడేళ్ళబట్టీ నేచేసిన ప్రయత్నం తాలూకు ఫలమొకటి మాయింటి కొచ్చింది.

'ఇంకేముంది, రానేవచ్చింది, ఏంచేస్తాం నేననుకున్నానా యింతపని జరుగుతుందని,' అని నేననుకోలేదు గాని, వచ్చిన ఉత్తరం చించి చదివేను. మాయింటి వరండాలో పెద్దగా చదివేను. వెంటనే చిన్నగా చదవవలసి వచ్చింది. మొత్తంమీద చదివేశాను.

ఆది విని మా మిత్రులంతా తలవంచుకున్నారు వేళ్ళు నొక్కుకుంటూ. సరే!

ఓగిరాల కృష్ణ

మేము వస్తామని వీధిగుమ్మంవైపు దారితీశారు. మావాళ్లకీ ఘటం అర్థంకాలేదు. మరి నాకూపూర్తిగాఅర్థం కాలేగు. ఏమిట్రా సంగతి,అని మూడు గొంతుకలొక్కుమ్మడిగా మ్రోగాయి. దాంతో నానాలిక కొంతసేపు పనిచెయ్యటం మానేసింది. "ఏమిటేమిటి?' ఆ డిక్షనరీ యిలా పట్టుకురండి తేల్చేస్తాను," అన్నాను. నీవేతప్ప యితఃపరం బెరుగ ననుకుంటూ మనస్సులో.

మావాళ్ళు నేనేం చెబుతానో అని నావంక చూస్తూ నిలబడ్డారు మెడనరం పట్టేదాకా.

రైటో! అనే గావుకేకతో ఆ వచ్చిన కాగితంలోని పరిభాష లేటతెల్లమైన తెలుగులో వివరించాను. "నాకు ఉద్యోగం వచ్చినది. పిఠాపురంలో ఉన్న స్కూలులో మేష్టరీపని చేయవలసినదిగా ఆర్డరు వేసినారు. రేపు ఉదయము పది గంటలకే తప్పక చేరితీరవలయునని గట్టిగా బ్రతిమలాడుచున్నారు."ఇది నా అనువాదం.

ఈ మాటలు వినేసరికి మావాళ్ళకి, ఇంతింతై అంతంతై, ఆ వచ్చిన సంతోషము మరెంతెంతో అయింది.

"అయ్యో వీడి మొఖం యీడ్చ, యిప్పటికే రెండురోజు లాలస్యం చేశాడే ఈ పోష్టువాడు" అని నేమొత్తుకున్నాను. ఇంక ఎక్కువ టైంలేదు. రేపటికల్లా చేరాలి.

'వెళ్ళిరారా నాయనా' అన్నది మా బామ్మ. నా ముఖంలో ఉద్యోగకళ ఉన్న సంగతి మా నాన్నకు అప్పటిదాకా కనపడలేదు.

'దేశంగానిదేశం వేశారేరా, నాయనా,' అని మా అమ్మ యిదౌతుంటే, మానాన్న చెప్పేశారు, ఆ, ఉద్యోగం పురుషలక్షణం, ఎక్కడికైనా వెళ్ళి చేయవలసిందేనని.

మరుక్షణంనుంచి ప్రయాణ సంసిద్ధుడనయ్యాను. అన్నిగదుల్లో ఉన్న అన్ని పటాలకి దుమ్ము దులిపి దణ్ణంపెట్టి రకొమని



శ్రీకాళహస్తీశ్వరాలయ గోపురంపై వున్న సముద్రమధన శిల్పఖండం

జట్కాలో ఎక్కాను. వెంటనే ఒకపది నిముషాలు వరుసగా ఆ జట్కా గుఱ్ఱం చేసిన సకిలింపు నాకు అన్ని అపధ్వనులకు అండగా నిలిచింది.

ఇక చూసుకోండి ఆ గుఱ్ఱం పరుగెతింది! ఆహా! శరవేగ వాయువేగాలతో తేలిపోతోంది. నాకోపాట పాడాలనిపించింది. కాని, బండివాడు మూర్ఛపోయి గుఱ్ఱం బెదిరితే తరువాత చాలా అవస్థ పడాల్సి వస్తుందని మానేశాను.


ఏ చిన్ననాటి వైరమో గాని, ఆబండి చక్రాలు రెండూ, ఒకదానికొకటి సరిగా సహకరించడం లేదు. దాదాపు ఒక అడుగు వెనుకపడ్డా రెండో చక్రం కూడా తప్పదురా తద్దినం అని సేషనువైపే పరుగెతింది.

మాయింటి మలుపు తిరిగేదాకా ఏం కూర్చున్నానో సరిగా కూర్చున్నచోట అంతే! ఇకమళ్ళా స్థిమితంలేదు శరీరానికి. కొద్దిమార్పుతో తలకుబదులు, కాళ్లె కొట్టుకున్నాయి టాపుకి. ఆ గుఱ్ఱం దౌడుకి ఆ కాస్తనేలా సుళ్ళు తిరగడంతో నాకు భూమి గుండ్రంగానే ఉన్నట్లు అనిపించింది.

స్టేషన్ రాగానే పెద్ద యాక్సిడెంటునుండి బయటపడ్డ వాడిలా బండిలోనుండి బయటకు దూకి, బండివాడికి ఫైన్ వేసే హోదా లేక, బాడుగ యిచ్చి పంపించాను.

టిక్కెట్టు కొనేసి ఆచిన్న స్టేషన్నుంచి విజయవాడ దాకా అరగంటలో అవలీలగా ప్రయాణం చేశాను. అప్పుడప్పుడు నేను మాట్నీలకోసం వెళ్ళే రూట్ అది.

అది విజయవాడ సేషను. రాత్రి తొమ్మిది గంటలవేళ అయింది. మోడరన్ కేఫ్‌లో భోంచేసి ఎడమచేతిలో పెటె పట్టుకుని కుడి చేతికి సంచీ తగిలించి సెకండు క్లాసు వెయిటింగ్ రూముకి మోసుకుపోయి, అక్కడో పెద్ద బల్లమీద పడేశాను. కొద్దిసేపయినా కాలక్షేపమవుతుంది గదా అనే ఉద్దేశంతో బయటికి వచ్చి ఒకకిల్లీ వేసుకుని, తిరిగి వెయిటింగ్ రూముకి అడుగువేశాను. నాపెటె, సంచి బల్లమీద లేవు. గుండె పగిలినంతపని అవలేదుగాని, ఆశ్చర్యం వేసింది. వెంటనే అణిగిపోయింది. నాసామాన్లు ఆ వెయిటింగ్ రూములో ఉన్న ఒకసిమెంటు గట్టుమీద పెట్టె ఉన్నాయి. అదిచూసి నేనుచేసిన పోటుపనికి నాకే చిన్నతనం వేసింది. వాటి భద్రత విషయంలో నాకేం భయం లేకపోయినా, అయినా ఎందుకైనా మంచిదని, పెటెతాళం గటిగా అయిదారుసార్లు లాగి చూశాను. నాఖర్మం కాలి అది ఊడనే ఊడింది. వెంటనే "అయ్యో భగవంతుడా నన్నింకా పరీక్షిస్తున్నావా? నేనెప్పుడో ప్యాసయ్యానయ్యా, ఇప్పుడు ఎలా? ఈ స్టేషనలో తాళాలు దొరకవే!" అని స్వగతం



గుంటూరుజిల్లా, నరసరావుపేట తాలూకా కోటప్పకొండవద్ద ఏటేటా మహాశివరాత్రికి జరిగే ప్రభల సంబరం.

చెప్పుకున్నాను ప్రక్కవాళ్లకి వినబడకుండా.

సరే, యిక చేసేదిలేక ఆ పెట్టెలో అట్టడుగున ఉన్న మనీపర్సు బయటికిలాగి గబుక్కున జేబులో వేసుకున్నాను. అంతదాకా కళకళలాడుతున్న పెట్టె 'నాప్రాణం తీసేశావా' అన్నట్లు నావంక చూసింది.

ఆగదిలోఉన్న ఫాను అక్కడఉన్న వేడిగాలిని తలాకాస్త పంచిపెడుతోంది. అంతా నిశ్శబ్దంగా ఉన్నది. నలుగురైదుగురు పెద్ద మనుషులు పేపరు చదువుకుంటున్నారు. ఆ వాతావరణం నా కేమీనచ్చక చల్లగాలి కోసం బయటికి వచ్చాను.

స్టేషనంతా చాలాసందడిగా ఉన్నది. ఈ చివరనుండి ఆచివరిదాకా మిల్కుబార్లు తెల్లగా స్వచ్ఛమైన కాంతి నిస్తున్నాయి. టిక్కెట్టు కలెక్టర్లు అసలైన డ్యూటీలో ఉన్నారేమో తెలియదుగాని, అటునుంచి యిటు, యిటునుంచి అటూ తిరుగుతున్నారు. తీగకి కాయబరువా? అనే లెఖ్ఖలో పోస్టు బంట్రోతులు, పెద్దపెద్ద సంచులు మోసుకొస్తున్నారు. జనమంతా గుంపులు గుంపులుగా కూర్చొని ఉన్నారు. కొంతమంది మహోత్సాహంతో ప్రయా

★ ఉద్యోగం దొరికింది ★

కాలకబుర్లు గావల్సి చెప్పేసుకుంటున్నారు. రైల్లో బాగా నిద్రపట్టడానికి కాబోలు కొంతమంది ముందే చికిత్సతీసుకుంటున్నారు మాలిస్ లాంటిది.

ఎటు చూచినా గోలగా ఉంది. అమ్మేవస్తువుల పేరేమిటో సరిగా అర్థంగాకుండా అరుస్తున్నారు కొందరు. ఒకడు మరీ చేతిలో తట్టాబుట్టా లేకుండానే ఏదో అరుచుకుంటూ పోతున్నాడు. వాడు నా ప్రక్కనుంచి రాసుకుపోతున్నప్పుడు వాడి జేబులోని పరికరాలను మాయింట్లోని, గులితెడతో పోల్చుకోవటంతో అర్థమైంది వాడివ్యవహారం నాకు. విశాఖపట్నంవైపు వెళ్ళే జనతాకి టైమింకా ఓ అరగంట ఉన్నది.

అలాగే ప్లాట్ ఫారంమీద నడుస్తూ వుని తిన్నగా స్టేషనుమాస్టరు ఆఫీసుదగ్గరికి వెళ్ళాను. అక్కడఉన్న ఒకబ్లాక్ బోర్డుమీద జనతా అరగంటలేటు అని వ్రాసిఉంది. అదిచూడగానే నాబరువు ఒకపౌను తగ్గినట్లనిపించింది. ఎవరీవెధవపని చేసిందని నే చూస్తుండగానే లోపలినుంచి ఒక తెల్లకోటువాలా వచ్చి బహుతేలిగ్గా అరని ఒకటి చేశాడు. ఎవడీనిర్దయుడు అని లోపల అనుకుని, వెంటనే తెలుసుకున్నాను, ఈమార్పు చేసినది అనధికారవరాలు కావని.

ఇంకా గంటపైముంది గదా, ఒక చిన్న కునుకుతీద్దామాఅనుకున్నాను. కాని వెంటనే 'ఛీ! ఏమి టింత అమంగళమైన ఆలోచన' అనిపించింది. జనతా నా మీదనుంచి పోయినా నాకు మెలుకువరాదని నాకు పూర్తిగా తెలుసు.

ఇలా ప్లాట్ ఫారంమీద ఎంతకాలం తిరుగుతాం గనుక అని తిరిగి విడిదికి వెళ్ళిపోయాను.

మహాశ్చర్యం! మహోపకారం! అక్కడ ఒక యిద్దరు పిఠాపురం స్కూలుసంగతే మాట్లాడుకుంటున్నారు. భేష్! అని వాళ్ళ ప్రక్కనేఉన్న కుర్చీపైన కూలబడ్డాను తోడుదొరికిందంటూ.

వాళ్ళ సంభాషణచూస్తే ఆ యిద్దరిలో ఒకరు ఇప్పుడు నేను వెళ్ళబోయే రైల్లో పిఠాపురమే వెళ్ళబోతున్నారు. చూడబోతే స్కూల్లో ఏదో ఉద్యోగం కోసమే వెళుతున్నట్లుగా తోచింది.

ఉన్నట్లుండి ఆ యిద్దరు గబుక్కున లేచి వెళుతున్నారు. అయ్యో! అదేమిటి నన్ను పిలవకుండా వెళుతున్నారు అని అనిపించింది. అచ్చే! నన్నెందుకు పిలుస్తారు అని సమాధానం తట్టింది. నేను సంసారం చేతపట్టుకుని వారివెంట బడ్డాను. వారు తిన్నగా జనతా రైల్లో ఆఖరిపెట్టెలో ఎక్కి కూర్చున్నారు. నా పెట్టెగూడా అదే అన్నట్లు నేనూ ఆ పెట్టెలోకే ఎక్కాను.

మా వారఫలాలు, యోగం బాగున్నాయేమో మరి, పెట్టెలోమాత్రం మాకు చోపి రాడకుండా చేసేటంత జనం ఎక్కలేదు. కాని ప్రయాణం చేస్తున్నవారంతా మూతి బిగించుకు కూర్చోలేదు గనక చుట్టూ చాలా సందడిగానే ఉన్నది. నేను బెడింగుతీసి పైన పరిచాను. తిరిగి పెట్టెలో చూస్తే ఆ యిద్దరు లేరు. ఇదేమి టిలా అయిందని కంపార్టుమెంటు గేటుదగ్గరకువెళ్లి మధ్య

ఒక డాక్టరుగారు తన పాత పేషంటును ఒకచోట కలుసుకున్నారు.

డాక్టరు: ఇప్పుడు మీ వళ్లు స్తిమితపడ్డట్లున్నదే. మీకు మార్పు అవసరం అని చెప్పానా, చూడండి నా సలహా ఎటువంటిదో?

రోగి: ఔనండీ.

డాక్టరు: అయితే మార్పు కోసం ఎక్కడికి వెళ్ళారు?

రోగి: మరోడాక్టరు దగ్గరికి.

కుమారి కాజ వెంకటకమల,
విజయవాడ.

నుంచుని అటూ యిటూ చూశాను. ఆ యిద్దరు వచ్చినదారినే తిరిగిపోతున్నారు. ఇదేమా అని అనుకుంటూండగా ఆ యిద్దరూ శత్రువుల్లా విడిపోయి, ఒకాయన మాత్రం తిరిగివచ్చి నా పెట్టెలోనే కూర్చున్నాడు.

రైలు కదిలింది. చూస్తుండగానే విజయవాడ స్టేషనుదాటి వెళ్లిపోయింది రైలు. ఊళ్లోని లైట్లుకూడా కనబడటం మానేశాయి. ఇక నేనుకూడా లోపలి కెళ్ళిపోయినాను. పైవైపునే నాలాగే బెడ్ పరుచుకున్న అతను, పైకెక్కి పడుకున్నాడు. దూరప్రయాణాలు చేసేవాళ్లు కూర్చోటం ఏం బావుంటుందని నేనుగూడా పైన పడుకున్నాను.

నా సహవాసి ఏదో నిరాశగా ఆలోచిస్తున్నాడు. నాకప్పుడే నిద్రలాంటిది వళ్లంతా వ్యాపించేలా గుంది. మా యిద్దరికీ మధ్య పైన ఒక్కటే ఒక ఫాను తిరుగుతోంది. దాని గాలి పైసా ఎత్తుకూడా నాపై ప్రసరించటంలేదు. ఇలా కాదనుకుని, ఆ ఫాను నా వైపు త్రిప్పుకోటంతో వచ్చే గాలంతా నా మీద పడటం, నేనొక చిన్న కునుకుతీయటం జరిగింది. ఒక అరనిముషంలో మా యింటిదాకా వెళ్లిపోయి, తక్షణమే, తటాలున జనతా పెట్టెపైన వ్రాలేను. పరిస్థితి ఏదో మార్పుగా తోచింది నాకు. మొద్దునుగదా ఆ ఫాను, అతగాడు పూర్తిగా తనవైపు త్రిప్పుకుని, ఆ మలయమారుతపు టలలలో ఉయ్యాలలూగుతూ నిద్ర పోతున్నాడు. వెంటనే నా జేబులోఉన్న టిక్కెట్టు

ఒకసారి ఘట్టిగా చూసుకొని, కన్సెషన్ లాంటిదికూడా నాకేమీ లేదని తేల్చుకుని, ఆ ఫానును పూర్తిగా నా వేపుకు తిప్పుకుని, నిద్రపోకుండా, జాగ్రదవస్థలోనే గాలిని అనుభవిస్తున్నాను నేను నిద్రపోవటల్లేదని కనుక్కోలేక ఆ పక్షివాడు, నే నొక కన్నుతో చూస్తుండగానే ఫాను తనవేపుకు లాక్కున్నాడు హక్కంతా తనదే అన్నట్టు.

ఈ తరహా చూచిన నాకు గంపెడు అనుమానం కలిగింది యితడెవరా? అని. సరే ఎవరో తేల్చుకోవటం మంచిది గదా అని, తిరిగి ఆ ఫాను పొజిషన్ తప్పించాను. అంతే! తరువాత ఏంచేశానో నాకే తెలియదు. నాకు కొన్ని యుగాలు గడిచినటుగా తోచింది. కొంతసే పయినతరువాత నన్నెవరో కొడుతున్నట్లుగా అనిపించింది. ఆహా! ఎవరో చిచ్చి కొడుతున్నారల్లే ఉంది, కొట్టనియ్యమనుకుని, తిరిగిమాస్తే డబ్బులడుగుతారేమోనన్న అనుమానంతో ఊరుకున్నాను.

“ఏమండీ మిమ్మల్నేనండీ” అన్న మాటలు వినిపించేసరికి, ఎదురుగా ఉన్నతడు ఫాను విషయం తగాదాకొచ్చాడనుకుని యివతలికి తిరిగేను. తక్షణమే పరిస్థితి అర్థంచేసుకుని ఆ నిద్రలేపిన టికెట్ కలెక్టరుకి నా టికెట్ చూపించాను, నా విరోధికూడా చూడాలనే ఉద్దేశంతో.

నాకు పళ్ళుమండింది ఆ ఫానుమళ్లీ అలా తిరిగి ఉండటంచూసి. వెంటనే అడిగేశాను అతన్ని ‘మీ దేవూరండీ’ అని. అతను ముక్తసరిగా ‘మీ ఊరే’ అన్నాడు.

‘మీ పేరు’ అన్నాను.

‘వెంకటేశ్వర్లు’ అని చెప్పాడు.

‘మీరు ఫాను అటూ యిటూ త్రిప్పటమేనా పని’ అని నోటిదాకా వచ్చి, ‘మీరేం చేస్తున్నార’ని మాత్రమే అడిగేను.

పిఠాపురం స్కూల్లో ఉద్యోగానికి వెళుతున్నానన్నాడు.

‘దేనిగానండీ’ అని ఆదుర్దాగా అడిగేను.

‘రిజర్వుడు’గా వెళుతున్నానన్నాడు.

‘రిజర్వుడా!’ అందుకే ఫాను అలా లాక్కున్నాడనుకున్నాను.

రిజర్వుడు అంటే ఏదో పెద్ద ఉద్యోగం, అదేదో హెడ్మాష్టరులాంటిదనుకున్నాను, సినిమాహాల్లో రిజర్వుడు జ్ఞాపకానికొచ్చి. ఈ పెద్దమనిషితో యిప్పటినుంచే పరిచయం చేసికోవటం ఎందుకైనా మంచిదని, నా భోగట్టా అంతా చెప్పేశాను.

‘ఓహో అలాగా, మీరేనా టీచరుగా వస్తున్నది,’ అని చాలా సంతోషాన్ని వెలిబుచ్చాడాయన.

కొంతసేపు అలా ఆయనతో మాట్లాడాను. వెంకటేశ్వర్లుగారు ఎంతో ఆప్యాయంగా “మీరు హాయిగా నిద్రపోండి, పిఠాపురం రాగానే నేను మిమ్మల్ని లేపుతాను. తరువాత యిద్దరం కలిసి వెళదాం” అన్నారు నన్నుద్దేశించి. నేనేమీ సమాధానం చెప్పలేదు, రిజర్వుడుగారికి పని అప్పచెప్పటం యిష్టంలేక. వెంకటేశ్వర్లుగారు తిరిగి అందుకుని “ఫరవాలేదు మీరు పడుకోండి, నాకీ రైలు ప్రయాణం అలవాటే” అన్నారు. వారి సహాయానికి నేనెంతో సంతోషించి హాయిగా నిద్రపోయాను.

రైలుపెట్టెలో నిద్రపోతున్నానన్నమాటే గాని, ఆ మత్తులో, ఇంట్లో హంసతూలికా తల్పంమీద అంటే, నేనుకొత్తగా చేయించుకున్న హంసమార్కు కొంపుకోటుమీద నిద్రపోతున్నట్టే ఉన్నది. నిద్రంటే అది. పోయినా అలాటి అలారం ప్రూఫ్‌లాంటి నిద్రపోవాలిట.

అకస్మాత్తుగా తెల్లారకట్ట అంత గాఢ నిద్రలోనూ వచ్చిందో పీడకల. కొరివి దయ్యాలన్నీ కలసి, నన్నొకనట్టడవిలో దిగవిడిచి, నన్నొదిలేసి వెళ్ళిపోయినట్టూ, ఆ పిడవదలడానికి మా నాయనమ్మ చీపురుతో నా ఒళ్ళంతా బాదుతున్నట్లూను. ఆ దెబ్బలు తటుకోలేక నాకు మెలకువ వచ్చింది. అప్పుడు రైలు కదలటల్లేదు. శుభ్రంగా ఆగిపోయి ఉంది మూడుసార్లు కళ్లుసరిగా తెరిచి చూచినా, ప్రక్కనే రిజర్వుడుగారు లేకపోగా, ఆయన తాలూకు గుర్తుకూడా అక్కడేమీ లేదు. ఆ దృశ్యం నాకంతు పట్టలేదు. అరనిముషం పరికించి చూస్తేగాని, వాతావరణం నాకర్థమవలేదు, అప్పటికే తెల్లవారి చాలాసేపయినట్లు.

తటాలున పైనుంచి క్రిందికి దూకేను. ఆ దూకడంలో పొజిషన్ కొంతతప్పి, నేను వెళ్ళి ఒక ముసలాయన కాలుమీదపడ్డాను. ఆ వృద్ధుడు ఒక పెద్ద వాక్యం లోలోపల అనుకుంటున్నట్లుగా పెదిమలు కదిల్చి, పైకిమాత్రం, “అప్పుడే ఏం కొంప మునిగిపోయిందని దూకేవు నాయనా?”అని కోపంగానే అన్నాడు బాధను వ్యక్తం చేస్తూ. ‘లేదండీ చూడలేదు’ అని క్షమాపణ వేడుకొని, పెట్టెలోంచి ప్లాట్‌ఫారం మీదికి దిగేను.

అది వాల్తేరు స్టేషన్. నా గుండె ఝల్లుమన్నది. నా జన్మలో ఒకే ఒకసారి మా మావయ్యగారింట్లో తగిలిన, ఎలక్ట్రిక్ షాక్ తిరిగి తగిలింది వంటికి. ఎంతో భయం వేసినందువల్ల కాళ్ళు కొద్దిగా వణుకుతున్నాయని తప్పుకున్నాను. ఎదురుగా వున్న వాల్తేరు బోర్డు చూసేటప్పటికి, ఇంకెక్కడి పిఠాపురం అనుకున్నాను. “ఒరేయ్ జాగర్త, నిద్రపోయి విశాఖపట్నంలో దిగేవ్” అని, నే బయలుదేరబోయే ముందు మా నాన్న అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చాయి.

ఎంత ఘోరం! ఇప్పుడు ఏమిటి చెయ్యటం అన్న ప్రశ్న పుట్టింది. రైలువంక చూశాను. ‘ఏం ఇప్పటికయినా దిగుతావా, యింకా వస్తావా’ అని నిర్దాక్షిణ్యంగా నావంక చూసింది రైలు. ‘ఆలస్యం అమృతం విషం’ అన్న సూక్తి నెమరువేసికొని పెట్టెలోని కొళ్ళి సామగ్రినంతా బయట పడేసి నేనూ బయటపడ్డాను

అసలింతకూ ఆ మహానుభావు డేడీ అని బండిలో తిరిగి అడుగుపెట్టాను. ఎవరిని ఏమడుగుదామన్నా అప్పటికి ఐదు నిమిషాల ముందే డగ్గుత్తిక ఏర్పడి గొంతు పూడుకుపోయింది. స్వరంలో కంపనం పుట్టుకొచ్చింది.

“ఏవండీ బెజవాడలో ఎక్కి ఇక్కడ పడుకున్నాడే ఆయ నేడండీ యెక్కడికి వెళ్ళాడు” అని బండిలో పదిమందినీ అడిగేను.

‘అదేమిటయ్యా ఆయన మీ అన్నయ్యే గదా, ఎక్కడికెళ్లాడో నీకు తెలియదా’అని సాక్షిగా సమాధానం చెప్పారు.

‘మా అన్నయ్యేవిటండీ నాపిండాకూడూ! ఆయనెవరో ఇంతకుముందు నే నెరుగనే ఎరుగను’ అని గగోలు పెట్టాను.

అక్కడున్న పదిమంది పెద్దమనుషులూ ఆశ్చర్యంతో “ఆయన పిఠాపురం స్టేషనో దిగేడండి. దిగుతూ దిగుతూ—మిమ్మల్ని గురించి, యితను మా తమ్ముడూ, హాయిగా వెళుతున్నాడు, ఇతణ్ని లేపకండి అని చెప్పి వెళ్ళాడు” అని చెప్పారు.

ఎంత మోసం! ఎంత మోసం! ఈ అకారణ వైర మెందుకో ఈతనికి నామీద అనుకుని, “అయ్యో రామా! ఆయనెవరో వెంకటేశ్వర్లుటండీ, పిరాపురం స్కూలుకి రిజర్వుడుగా వెళుతున్నాడంటేనూ నేను కూడా అక్కడికే వెళుతున్నానని చెప్పిన మీదట, మీరు పడుకోండి, నేను పిరాపురంరాగానే లేపుతాను అని అన్నాడు. అంతే” అన్నాను ఏడుపుముఖం పెట్టి.

(56-వ పేజీ చూడండి)

నక్షత్ర ఫలితాలు

బి. నరసింగరావు

(19-2-58 మొదలు 25-2-58 వరకు)

గ్రహ స్థితి

	శ		
ర	21 తేదీని కుంభములో బుధ ప్రవేశము.		
బు శు	కుంభ, మీన, మేష, వృషభ ములలో చంద్రుడు.		
కు కే		గు రా	

అశ్విని [చూ, చే, చో, లా]

గతవారము కలిగిన మంచియోగము ఈ వారముకూడా వుంటుంది. అనుకున్న డబ్బు చేతికి వస్తుంది. ఆటంకములు తీరిపోతవి. బంధువులతో మృష్టాన్న భోజనము. ఇంట్లో కలిగిన అశాంతి. తొలగుతుంది. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ కుదురుతుంది. నూలు, బట్టలు వ్యాపారస్తులకు ప్రయాణమువల్ల లాభము. వెండినగల వ్యాపారస్తులకు ప్రయాణంవల్ల లాభము. కవులకు, గాయకులకు, నటీనటులకు యోగకాలము. 19, 23 తేదీలలో ఖర్చులు ఎక్కువ, త్రిప్పట, అశాంతి, శ్రమ. మిగిలిన తేదీలలో ప్రయాణమువల్ల లాభము. శుభయోగము.

* భరణి [లీ, లూ, లే, లో] *

మీకు ఈ వారము యోగదాయకము. గతవారము అసంపూర్తిగా నిలిచిపోయిన పనులు ఈ వారము లాభకరముగా ముగుస్తాయి. గృహమందుండు వారికి అలంకార ప్రాప్తి. మీకు వాహనయోగము. పశుసంపద వృద్ధి అవుతుంది. జీవితాభివృద్ధికై మీరు నియమించిన పథకాలు ఫలిస్తాయి. ఇతరులకు సహాయము చేయుటవల్ల సంఘములో మీ పలుకుబడి ఎక్కువవుతుంది. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము, 19, 23 తేదీలలో త్రిప్పట, అశాంతి. మిగిలిన తేదీలలో కార్యసిద్ధి, ఆప్తులతో విందు, వినోదము, శుభవార్త.

కృత్తిక [అ, ఈ, ఊ, ఏ]

ఈ వారము ఆదాయాభివృద్ధికి చేసే ప్రయత్నాలు ఫలించవు. కార్యభారము ఎక్కువగుటచేత అకాల భోజనమువల్ల వేడి ఎక్కువై, తలపోటు, కళ్లుమంట మొదలగు అనారోగ్యసూచనలు కనబడగానే శ్రద్ధ వహించండి. ధనలోపముచే గృహావసరములు తీరవు. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ తక్కువ కోర్టువ్యవహారములు వాయిదా పడుతవి. 19, 23 తేదులలో కార్యభంగము అస్థిమితము, వ్యథ. మిగిలిన తేదీలలో రాజకీయవాదులకు మేలు.

రోహిణి [ఓ, వా, వీ, వూ]

ఈ వారము మీకు అంతయోగము కాదు. మీరు తలపెటిన కార్యములకు ఆటంకములు కలుగుతాయి. కాని వారాంతమున నిజమైన స్నేహితుని సహాయమువల్ల కార్యసిద్ధిని పొందుతారు. ఉద్యోగస్తులు ఆర్థిక చిక్కులను ఎదుర్కోవలసివస్తుంది. వ్యాపారస్తులకు మాంద్యముగా వుంటుంది. విద్యార్థులకు చదువుమీద లక్ష్యము తక్కువ 19, 23 తేదీలలో కార్యభంగము. అస్థిమితము శ్రమ. మిగిలిన తేదిలలో ప్రయాణము, మిత్రదర్శనము, కార్యలాభము, విచిత్రవస్తు సంపాదన.

* మృగశిర [వే, వో, కా, కీ] *

ఈ వారము మీకు మిశ్రమఫలము. తలపెట్టిన కార్యములకు విఘ్నములు కలుగుతాయి. బుద్ధిబలము నుపయోగించి కార్యసాధనకు ప్రయత్నిస్తారు. ఈశ్వరానుగ్రహమువల్ల అన్నీ సాధ్యపడతాయనే నమ్మకముతో వ్యవహరించి చివరకు జయమును పొందుతారు. ఉద్యోగస్తులకు అస్థిమితము. వర్తకులకు లాభము తక్కువ. విద్యార్థులకు చదువుసాగకపోయినా కొత్త విషయాలు నేర్చుకుంటారు. 19, 23 తేదీలలో నిలకడలేని స్థితి, శ్రమ. మిగిలిన తేదిలలో ప్రయాణము. ఆత్మవికాసము, కార్యలాభము. ఇంట్లో వారి ఆరోగ్యచింత.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారముకూడా ఆదాయాభివృద్ధికి అధికమైన కార్యభారమునువహించి, ఆశాభంగము పొందుతారు. ఇతరులకొరకు శ్రమపడి అనవసర వివాదాలకు లోనౌతారు. కోర్టు వ్యవహారములు కొంత మేలుగా వుంటాయి. ఖర్చులు అధికము. ఉద్యోగస్తులకు తమ సమాన హోదాలో వారి సహాయమువల్ల కలిగిన ఒత్తిడిని తగ్గించుకుంటారు. వ్యాపారస్తులకు లాభము కష్టముతో కూడుకొని వుంటుంది. ఇంట్లోవున్న స్త్రీలలో ఒకరికి అనారోగ్యమువల్ల వ్యథ కలుగుతుంది. 19, 23 తేదీలలో కార్యభారమువల్ల శ్రమ. మిగిలిన తేదీలలో కొంత అనుకూలత, వివాదము, మనోవ్యథ.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము మొదలుపెట్టిన పనులు అనుకున్నట్టు జరగవు. డబ్బు చాలక ఇబ్బంది పడవలసివస్తుంది. ఆత్మీయులకు సహాయము చేసిందికి పూనుకుంటారు గాని సాగకమనోవ్యథ చెందుతారు. ఇంటా బయటా కూడా మాట పడ్డంతో పౌరుషము ఎక్కువై ప్రబల ప్రయత్నముచేసి కార్యసిద్ధిని పొందుతారు. యంత్రాలవల్లగాని, ఆయుధాలవలగాని ప్రమాదము కలుగవచ్చును. జాగ్రత్తపడండి. యంత్రములు నడుపు నిపుణులకును, ఇంజనీరింగు శాఖవారికిని శ్రమతో కూడిన యోగము. 19, 23 తేదీలలో కార్యభంగము. ప్రమాద భయము. తక్కిన తేదిలలో కార్యలాభము, అపవాదు, మనోవ్యథ.

పుష్యమి [హూ, హే, హో, డా]

ఈ వారము మీ బుద్ధిబలము, అధికారములోనున్న వారి సహాయము, మిత్రుల సంప్రతింపులవల్ల కార్యసిద్ధిని పొందుతారు. దూరమందున్న ఆత్మీయుల క్షేమము తెలియుటవల్ల కొన్నాళ్ళనుండివున్న విచారము పోతుంది. విద్యార్థులకు చదువు చురుకుగా సాగుతుంది. 19 తేదిని పనితొందరవల్ల శ్రమ అశాంతి. 20, 21, 22 తేదిలలో ప్రయాణం మిత్రలాభము, ధనాదాయము, కార్యలాభము. 23 న అస్వస్థత. 24, 25 తేదిలలో అధికారుల ఆదరణ కవులకు, శిల్పులకూ, నటీనటులకూ యోగకాలము.

ఆశ్రేష [డి, డూ, డే, డో]

ఈ వారము మీకు యోగకాలము. ధనాదాయము ఎక్కువవుతుంది. ప్రతిభావంతులైన వారితో పరిచయమువల్ల విజ్ఞానలాభము కలుగుతుంది. గ్రంథపఠనమువల్ల ఆనందము చెందుతారు. శుభకార్యములనుగురించి ఇదివరకు చేసిన ఆలోచనలు ఒక నిర్ధ

యానికి వస్తాయి. కోర్టు వ్యవహారములు లాభిస్తవి. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ ఎక్కువవుతుంది. ఉద్యోగస్తుల హోదా పెరిగే అవకాశము లున్నవి. ఉపాధ్యాయులకు పండితులకు, న్యాయవాదులకు, కళాకారులకు యోగించును. 19 వ తేదీని కార్యసాధనలో త్రిప్పట, శ్రమ, 20, 21, 22 తేదీలలో ప్రయాణము, బంధుసంయోగము, కార్యసిద్ధి. 23 న అలసట. 24, 25 తేదీలలో పండితగోష్ఠి.

మఖ [మా, మీ, మూ, మే]

ఈ వారము మీ మనోశక్తిని వినియోగించుకొని కార్యసాధన పొందుతారు. కోరు వ్యవహారములు మీ పక్షము అవుతాయి. విద్యార్థులు కొత్తవిషయాలు నేర్చుకుంటారు. ఉద్యోగస్తులకు మంచికాలము. వర్తకులకు ప్రయాణమువల్ల లాభము. కవులకు గాయకులకూ, కళాకారులకూ యోగము. 19 తేదిని ఎటుతేగని ఆలోచనలు. 20, 21, 22 తేదీలలో ప్రయాణము, కార్యలాభము. 23 తేదిని అస్వస్థత. 24, 25 తేదిలలో బంధువులతో వినోదము, మృష్టాన్నభోజనము.

* (పూర్వఫల్గుణి పుబ్బ)* [మో, టా, టీ, టూ,]

ఈ వారము మీకు యోగదాయకము. గత వారము కాకుండా మిగిలియున్న పనులు ఈ వారము లాభకరముగా ముగుస్తాయి. ఇతరులకొరకు పాటుపడి సంఘములో పలుకుబడిని హెచ్చుచేసుకుంటారు. ఖరీదైన వస్తువులను సంపాదిస్తారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. 19 వ తేదిని కార్యసాధన కొరకు త్రిప్పట, అశాంతి. 20, 21, 22 తేదిలలో కార్యసిద్ధి, శుభవార్త. 23 న శ్రమ. 24, 25 తేదిలలో బంధుదర్శనము, విందు, వినోదము.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) * [టే, టో, పా, పీ]

ఈ వారము మీ ఆశయాలు, ఆశలు తీరిందికి చాలా అవరోధాలు కలుగుతాయి. అవసరాలకు కావలసిన డబ్బు లోపించడము వల్ల కార్యాచరణలో ఆశాభంగము కలుగుతుంది. వేళతప్పిన భోజనమువల్ల ఆరోగ్యము చెడుతుంది. శ్రద్ధవహించడము మంచిది. ఉద్యోగస్తులు కొత్తసమస్యలు ఎదురగుటచే ఆందోళన పొందుతారు. అడవి సరుకుల వర్తకులకు లాభకరముగా వుంటుంది. 19 వ తేదిని ఒడిదుడుకులు, అశాంతి. 20, 21, 22 తేదీలలో రాజకీయ వాదులకు మేలు. 23 వ అనారోగ్యము. 24, 25 తేదీలలో శుభ యోగము.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము మీకు అంతయోగకరము కాదు. మొదట్లో సహాయము చేస్తారనుకున్న మిత్రులు తటస్థముగా వుంటారు. ఎవరిని నమ్మకూడదని అనుమానపడ్డారో వారే సమయానికి మిమ్ముల్ను ఆదుకొని కార్యసిద్ధికి తోడ్పడతారు. ఉద్యోగస్తులకు ధనలోపమువల్ల ఒత్తిడి. వ్యాపారస్థులకు మాంద్యము. విద్యార్థులకు చదువుపై అశ్రద్ధ. 19-వ తేదీని ఆశాభంగం, అవసరాలు తీరనందున కలతలు. 20, 21, 22 తేదిలలో ప్రయాణము, మిత్రసహాయము, కార్యసిద్ధి. 23-న కుటుంబములో ఒకరికి అనారోగ్యము. 24, 25 తేదీలలో విచిత్ర వస్తు సంపాదన, అన్యదేశీయులతో పరిచయము.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము అంత యోగదాయకముగా వుండదు. కార్యహాని, కలతలు వచ్చి నిరుత్సాహముగా వుంటుంది. అయిననూ ఆధ్యాత్మిక చింత కలిగి దైవానుగ్రహమువల్ల అన్ని కష్టములు తీరుతాయనే నమ్మకముతో వ్యవహరించి తుదకు కార్యసిద్ధి పొందుతారు. ఇంట్లోవారి అనారోగ్యము కొంత కలవరపాటు కలిగిస్తుంది. వ్యాపారస్థులకు నిరాశ, ఉద్యోగస్థులకు ఒత్తిడి, విద్యార్థులకు చదువుమీద అనాసక్తి. 19 తేదీని ఆటంకములవల్ల అశాంతి. 20, 21, 22 తేదీలలో సాధుసాంగత్యమువల్ల మనశ్శాంతి. 23-న ఆరోగ్యచింత. 24, 25 తేదీలలో కార్యసిద్ధి.

* స్వాతి [రూ, రే, రో, తా] *

ఈ వారము అనుకున్న పనులకు అన్నీ ఆటంకాలే. కార్యభారము ఎక్కువగుటవల్ల శ్రమపొందుతారు. కోర్టువ్యవహారములు అనుకూలించిననూ, ఖర్చులు ఎక్కువగుటవల్ల అసంతృప్తి వుండగు. ఇతరులకొరకు కొన్నిపనులు పైనవేసుకొని అవి నెరవేర్చడములో వివాదాలకు లోనౌతారు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి వున్ననూ సమాన హోదాలో వున్నవారి సహకారమువల్ల కార్యసాధన కలుగుతుంది. భార్యకు ఆరోగ్యము చెడుటచే కలవరపాటు. విద్యార్థులకు శ్రద్ధ తక్కువ. 10-వ తేదీని కార్యభారము త్రిప్పట, ధనాభావము. 20, 21, 22 తేదీలలో కార్యానుకూలత, ధనలాభము. 23 తేదిని వివాదము, ఆరోగ్యచింత. 24, 25 తేదిలలో తోటివారి సహకారము.

ధరలు:

నూలు, వస్త్రములు : కొంచెముగా ధర పెరుగును.

నూనెదినుసులు : మార్పులేదు.

బెల్లము, పంచదార: మార్పులేదు.

చింతపండు : ధర తగ్గును.

ఆహారధాన్యములు : మందముగా వుండును.

పప్పు దినుసులు : కొంచెముగా తగ్గును.

వెండి, బంగారము: స్వల్పతేడాలో వుండును.

* * *

జన్మనక్షత్రము బట్టిగాని, జన్మనక్షత్రము నెరుగనివారు నామనక్షత్రము (వారి వారి పేర్ల ననుసరించి పేరు మొదటి యక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిరా నక్షత్రమును, హృష్ణుడను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడనే పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయును చూచుకొనునది.

విశాఖ [తీ, తూ, తే, తో]

సాహసవంతంగా చెయ్యలేనన్ని పనులు ఉత్సాహముతో మొదలు పెడతారుగాని అడుగడుగునా ఆటంకాలు వచ్చి చికాకు పడతారు. అయినా వెనుకంజ వేయకుండా పట్టుదలతో ప్రయత్నముచేసి సాధించకలుగుతారు. ప్రమాదములకు గురికావలసివస్తుంది. జాగ్రత్తవల్ల తప్పవచ్చును. ద్రావకముల పనివారికి, గనుల యజమానులకు, భూస్వాములకు మేలుకలుగుతుంది. యంత్రనిపుణులకు యోగము. 19 తేదిని త్రిప్పట, ధనలోపము, కార్యభంగము. 20, 21, 22 తేదీలలో ధనలాభము, కార్యానుకూలత. 23-న ప్రమాదము. 24, 25 తేదిలలో లాభ యోగము.

అనూరాధ [నా, నీ, నూ, నే]

మీ ప్రజ్ఞ, పలుకుబడి ఉపయోగించి కార్యానుకూలత పొందుతారు. ధనలోపము తీరుతుంది. అధికారములో వున్న వారి సహాయము కలుగుతుంది. ఆత్మీయుల కుశలం తెలిసి సంతోషము చెందుతారు. ఉద్యోగస్థులకు తొందరలుతీరుతవి. వైద్యులకులాభం. కవులు నూతన రచనలు మొదలు పెడతారు. చిత్రకారులకు నటనటులకు మంచికాలము. 19 వ తేదిని త్రిప్పట, శ్రమ. 20,21,22



వరంగల్లులోని వేయి స్తంభాల ఆలయంలో నందీశ్వర విగ్రహము
—ఫోటో: బి. వి. నరసింహ, సికిందరాబాదు.

★ నక్షత్ర ఫలితాలు ★

తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి 23 తేదీని అస్తిమితము. 24,25 తేదీలలో కుశలవార్త, క్రొత్తవారితో పరిచయము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము మీకు యోగకాలము. ఆర్థిక స్థితిబాగుంటుంది. పిల్లల యోగక్షేమములకూ అభివృద్ధి కలిగే ఏర్పాట్లు కొన్ని చేస్తారు. చాలా కాలమునుండి పరిష్కారముకాకుండా వున్న సమస్యలు రాజీపడి విడగొట్టుకుంటారు. మతవిషయ గోష్ఠిలో పాల్గొంటారు. విద్యార్థులకు శ్రద్ధ ఎక్కువ. ఉపాధ్యాయులకూ, పండితులకు, న్యాయవాదులకు, కళాకారులకు మంచికాలము. 19 వ తేదీని కార్యాచరణలో శ్రమ, 20,21,22 తేదీలలో ధనలాభము, కార్యసిద్ధి. 23 వ తేదీని అలసట. 24,25 తేదీలలో పండిత గోష్ఠి, బంధు సమాగమము, శుభకార్యాలోచన.

మూల [యే, యో, బా, బీ]

ఈ వారము మీరు తలపెట్టిన పనులు నెరవేరుతవి. ఆర్థికస్థితి బాగుపడుతుంది. బంధుమిత్రులతో వినోదములలో పాల్గొంటారు. దగ్గరబంధువుల క్షేమము తెలుసుకొని సంతోషము పొందుతారు. నూలు, బట్టలు, బియ్యము, వ్యాపారస్తులకు లాభము. విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. కవులకు, గాయకులకూ, నటీనటులకు యోగకాలము. 19 తేదిని అశాంతితో కూడిన కార్యక్రమము. 20,21,22 తేదీలలో ధనాదాయము, కార్యసిద్ధి, 22 తేదీని అలసట. 24,25 తేదీలలో మిత్రదర్శనము, విందు, వినోదము.

పూర్వాషాఢ [బూ, ధ, భా, ఢ]

ఈ వారము మీకు యోగదాయకము. ధనాదాయము బాగుంటుంది. యత్న కార్యములు ఫలిస్తాయి. ఇతరులకు మేలుచేస్తారు. కోర్టు వ్యవహారములు అనుకూలిస్తవి. ఇంటియందుండు వారి ఆరోగ్యము బాగుపడి, అలంకారప్రాప్తి కలుగుతుంది. విలువగల వస్తువులు, నగల వ్యాపారస్తులకు లాభము. విద్యార్థులకు చదువుపైని ఆసక్తి ఎక్కువవుతుంది. 19 వ తేదీని శ్రమతో కూడిన కార్యాచరణ. 20,21,22 తేదీలలో ప్రయాణము, కార్య లాభము. 23 వ అలసట. 24,25 తేదీలలో బంధువులతో కూడి శుభ కార్యాలోచన, విందుభోజనము, వినోదము.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము మీ ఆదాయము వృద్ధిచేసుకుందికి జరిపే ప్రయత్నాలు ఫలించవు. ఖర్చులకు సరిపడే డబ్బు సమయానికి అందనందున అవసరములు తీరక కలతలు కలుగుతాయి. కార్యభారముచే శరీర, మానసిక స్థితి చికాకుగా వుంటుంది. వేడి ఎక్కువగుటచే ఆరోగ్యము చెడుతుంది ఉద్యోగస్తులకు శ్రమ అయినా కార్యసిద్ధి వుంటుంది. అటవికవస్తు వ్యాపారస్తులకూ, గోధుమ మొదలగు ఆహారధాన్య వర్తకులకూ లాభము, రాజకీయవాదులకూ శ్రమతో కూడిన కార్యసిద్ధి. 19 వ కార్యభంగము, గృహకలతలు, మనోవ్యథ, 20,21,22 తేదీలలో పితృవర్గము నుండి సహాయము, కార్యానుకూలత. 23 వ అనారోగ్య సూచనలు 24,25 తేదీలలో రాజకీయాలతో కార్యసిద్ధి.

శ్రవణము [జూ, జే, జో, ఖా]


ఈవారము అనుకున్న పనులు జరగవు. ఏపని చేసిందికి పాలుపోదు. ఆశించిన సహాయముకలుగదు. ప్రతిప్రయత్నము కొన్నాళ్ళపోయేక జరిగేటట్లు కనబడుతుంది. మిత్రులెవరో శత్రువు లెవరో తెలుసుకోలేక భ్రమపడతారు. ప్రతికూలు డనుకున్న వ్యక్తి సహాయమువల్ల వారాంతమున కార్యసిద్ధి పొందుతారు. ఇంట్లోవున్న వృద్ధులకు ఆరోగ్యము చెడుటచే ఆందోళన గలుగుతుంది. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి, వ్యాపారస్తులకు వారాంతమున లాభము. 19 తేదీని కార్యభంగము, అధిక ఖర్చులు. 20, 21, 22 తేదీలలో అనుకోని ప్రయాణము, వింత సహాయము, కార్యసిద్ధి. 23 వ ఆరోగ్య చింత. 24, 25 తేదీలలో విదేశీయులతో పరిచయము. విచిత్ర వస్తు సంపాదన.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈవారము మీకు మిశ్రమయోగము. ఎవరి సహాయముపొంది పనులు నెరవేర్చుకుందామనుకుంటున్నారో వారే మీకు ఆటంకము లుకలుగజేస్తారు; మోసముచేస్తారు. డబ్బుకు తొట్రుపాటు పడవలసివస్తుంది. ఈశ్వర కృపవల్ల మీకు తలపెట్టిన మోసమే మేలుగా పరిణమించి ఉపకారము జరుగుతుంది. వర్తకులకూ త్రిప్పట, ఆశాభంగము కలిగిన నూ కొంత లాభము కూడా వుంటుంది. విద్యార్థు

(56- వ పేజీ చూడండి)

శివరాత్రి మహాపర్వం



శ్రీశైల వర్ణనము


★

[పాల్కురికి సోమన 'పండితారాధ్య చరిత్ర' నుండి]

ధర నెన్నఁదగు పర్వతంబులలోన
  సిరిగిరియును నొక్క గిరి యనఁ జనునె ?
లింగమూర్తుల ప్రోవు, లీలల టావు,
మంగళత్వము నెల్ల, మహిమల కెల్ల,
పరమార్థముల కాది, ప్రమథుల వేది,
సురతరువులగుంపు, సురభులసొంపు,
సింహాసనముల పెల్లు, సిరిపుట్టినిల్లు,
సంతసంబులవీడు, సత్వంబు రూపు,
స్వర్ణవేదులకాకి, ప్రవర్గముకాకి,
సర్వజనులముక్తి, ధర్మార్థరక్తి,
సమితేంద్రియులసీమ, సాధుల ప్రేమ,
విమలత మురువు, తత్త్వము పుట్టు పొదువు,
అంగమార్గసదను, ప్రసాదంబు పదను,
సంగీతములగుప్తి, శరణులవృత్తి,
నిర్గతాఘులదృష్టి, నిత్యతపుష్టి,
స్వర్గంబు గరసు, మోక్షంబులవెరసు,
శివయోగుల యిరవు, సిద్ధుల వెరవు,
ధ్రువకీర్తి పెంపు, నిత్యుల మతి యింపు,
నదుల చొచ్చినయిల్లు, నగముల పెల్లు,
నదమలాత్ముల పేర్మి, శంకరుకూర్మి,
దపముల మొల్లి, దీర్థంబుల వెల్లి,
జపసమాధుల ప్రొద్దు, నమయుల దుద్దు,
భక్తుల చెలువు, విరక్తుల నెలవు,
ముక్తిమంతుల త్రోవ, మోదంబు చేవ,
భవసాగరమునావ, వరవులతావ,
శివభక్తి శిఖరంబు, శ్రీ నగేంద్రంబు;
వరికింప నిట్టి శ్రీ పర్వతంబునకు
ధరణీధరము లొండు దత్తుల్య మగునె ?

★

శ్రీశైలప



శ్రీశైల ఆలయ ఆవరణలోవున్న సహస్రలింగేశ్వరుడు

★ పి. వి.

"కదావా కైలాసే కనకమణి సౌ సః
గణైః వసన్ శంభో రగ్రే స్ఫుట, ఘటిః
మూర్ధాంజలిపుటః విభో!, సాంబ!, సా
మిన్!, పరమశివ! పాహి, ఇతి నిగదన్-విః
త్సరాణాం కల్పాన్ క్షణ మివ వి స్యాః
ముఖితః" అని ఆర్తితో పాడిన ఆదిశంకరుః
మెట్టిన తీర్థమిదే.

'సంధ్యారంభ విజృంభితం, శృతి శి


శ్రీశైలనాథునికి శ్రీ కృష్ణదేవరాయ

అదిగో ఆంధ్రుల పాలిటి మేరువు, కామధేనువు శ్రీశైలం! అల్లవిగో - అవే - శ్రీశైల మల్లికార్జునుని ఆలయ శిఖరములు! ప్రభాతసమయమున ఆలయ ప్రాంగణంనుంచి సుప్రభాత గీతములు శ్రవణానందముగా విన వచ్చుచున్నవి!

ప్రొద్దు ఎక్కకమునుపే, కృష్ణా పవిత్ర తోయములలో స్వామి నభిషేకించుటకు తిరిగి రావలెనను ఆకాంక్షతో అంగలు వైచుకొంటూ పాతాళ గంగకు "హర హర మహాదేవ్! నమః పార్వతీ పతయే నమః!", "చేదుకో మల్లయ్యా, మమ్మేలుకో మల్లయ్యా!" అని భక్తులు పరుగెత్తుచున్నారు. ఆలయమండపంనుంచి కమ్మని మేల్కొల్పు పాటలు సన్నాయివాళ్ళు పాడుతున్నారు. గూళ్లనువదలి తిళ్లకు పోవు పక్షుల కిలకిలారవములు, దిగంచలమున కనిపించు అరుణకిరణకాంతులు భక్తులకు కల్గించు అపార ఆనందమును వర్ణించుట కెవరి తరము?

మనోజ్ఞమగు కృష్ణవేణమ్మ

బ్రహ్మగిరి, రుద్రగిరి, విష్ణుగిరుల మధ్య నొయ్యారముగా - అడుగిడుచున్నదా! లేక అక్కడనే నిలబడిపోయినదా అని చోద్యముతో కన్నులు ఆ కృష్ణవేణమ్మకు అప్పగించిన అమ్మమ్మలు, అమ్మలు, నాన్నలు, తాతయ్యలు, తమ్ముళ్ళు, అన్నయ్యలు, అక్కలు, చెల్లెళ్ళు, వదినెలు అదుగో—నీలిరంగు, పసుపు పచ్చరంగు, ఆకుపచ్చరంగుల కలయికో అన్నట్లున్న ఆగంగోదకాన్ని చూచి మొదట దిగ్భ్రమ పొందుతున్నారు. అంతలోనే ఆతీర్థమున స్నానం చెయ్యాలని కుతూహలం పెరుగుతోంది. అయితే అంతూ పంతూలేని ఆ అగాధంలో కాలు పెడితే ఎక్కడికి పోతుందో తెలియక ఏ మొసలో కాలు పుచ్చుకు లాక్కుపోతే ఆనాటి గజేంద్రుని మాదిరిగా 'రావే ఈశ్వర, కావవే వరద' అని మొయ్యిడవలసి వస్తుందేమోనని బెంగకలుగుతుంది. కాస్త ధైర్యం తెచ్చుకొని స్నానంచేస్తారు. స్నానం చేశాక, శుచిర్భూతులై చక్కనిపర్వత సానువులపై ఆసీనులైన భక్తులకు వేరేకైలాసచింత ఏల? కొంపలూ, సంసారాలు అన్నీ వదలుకొని ఇక్కడే ఉండిపోదామా అనిపిస్తుంది. ఇంతలో ప్రొద్దెక్కుతూ ఉంటే చండ్రుని తగిలే సూర్యకిరణాలతో చురుకు కలిగి మళ్లా ఈ ఇహలోకస్ఫురణ వస్తుంది.




హా క్షేత్రం

మల్లయ్యా! కోవయ్యా!


ఆర్. శర్మ ★

స్థానాంతరాధిష్ఠితం, సప్రేమ, భ్రమరాభిరామ మసకృత్, సద్భావనాశోభితం, భోగీంద్రాభరణం, సమస్త సుమనః పూజ్యం, గుణావిష్కృతం సేవే శ్రీగిరి మల్లికార్జున మహాలింగం" అని ఆయన స్తుతించిన దీ గిరిపై వెలకొన్న ఈశ్వరమూర్తిని గూర్చియే! "భృంగీచ్ఛానటనోత్కటః-సత్ప్రతు సుమనోవనేషు, భ్రమరాధిపో విహరతాం శ్రీశైల



శ్రీ భ్రమరాంబాదేవి


ు కట్టించిన ఉన్నత ప్రాకారము, గోపురము.



వాసే విభుః" అని భ్రమరాంబాసహిత శ్రీశైలేశుని కన్నులార సేవించి అపరశంకరులు తనివితీర పాడిన దీ జ్యోతిర్లింగమును ఉద్దేశించియే. అష్టాదశమహాపీఠములలో ఒకటైన ఈ భ్రమరాంబామతల్లిని గూర్చియే. ఎందరో పండితారాధ్యులు, మహానుభావులు తమ మనసుతీర ఈ స్వామికి హృదయము నర్పించినారు.

రారాజులు కొల్చిన దైవము

ఎందరు యోగులు, భోగులు, రాజులు, రారాజులు, శ్రీశైలేశు భజించి తరించలేదు? నాడు ఇక్ష్వాకు కులతిలకుడైన ఆ శ్రీరామచంద్రుడు సీతా మహాసాధ్వితో లంకనుండి పుష్పకముపై అయోధ్యకు తిరిగివెడ్తూ ఇట విడసి ఈ స్వామినర్చించలేదా? పంచపాండవులు కొంతకాల మిక్కడ ఉండి తపస్సు చేసి, విజయులైనారన్నందుకు ఆలయంలో ఉన్న పంచపాండవుల గుళ్ళేకన్న సాక్ష్యమేమి కావలె? కలియుగంలో ప్రతాపరుద్రుడు స్వామికి పునఃప్రాణప్రతిష్ఠ చేసినాడన్నందుకు ప్రతాపరుద్రుని మండపమే నిదర్శనము. అనవేమారెడ్డి పాతాళగంగకు సోపానములనిర్మించి ధన్యుడైనాడు. విశలాంబ శిథిలమైన ఆ సోపానముల పునర్నిర్మాణము చేయించినది. హరిహరరాయలు ఉవ్వెత్తున గోపురములు, మండపములు కట్టించినాడు. ఇక శ్రీ కృష్ణదేవరాయలు తనదేవేరులతోపాటు కింకరుడై ఆలయము నలువైపులా పెద్దప్రాకారము కట్టించినాడు. ప్రాకారము ఎత్తు 22 అడుగులు. తూర్పు



శ్రీశైలస్వామి దర్శనార్థము నీలిగంగవద్ద తెప్పలలో కృష్ణానదిని దాటుతున్న యాత్రికబృందాలు.

శ్రీశైల మహాక్షేత్రం

పడమరలు 510 అడుగుల పొడవు. ఉత్తర దక్షిణములు 600 అడుగులు. వాటిపై కళలు ఉట్టిపడే గిరిజాకల్యాణము, రామాయణ, భారత, భాగవతాది పుణ్యగాథలు, అశ్వక, గజపంక్తులు, చెక్కించినాడు. గోపురాలు మండపాలు మహోన్నతంగా కట్టించి, అగ్రహారాదులను స్వామి అర్చనాదుల కేర్పరచి చేతులు కట్టుకొని రాణులతో సహా అక్కడ వెలసి, భక్తులపాదధూళితనతలపై పడిన చాలునని అక్కడ ప్రస్తుతము రాణులతో శిలామూర్తియై నిలచి యున్నాడు. ఆ శిలలే ఆనాటిప్రతిభను వేనోళ్ళ చాటుతున్నవి.

శిథిలమవుతున్న శివాజీగోపురం

కరకు తురకల కాలదృష్టి ఈ కొండపై కొంతకాలము పడకపోలేదు. అయితే శివాజీ మహారాజు ఈ కొండపైనున్న అంబ, భ్రమరాంబ నాశ్రయించియే, ఆమె వరప్రసాదమైన కరవాలముచేతనే ఆ శత్రురాజుల గుండెలు తరిగి, అంబరచుంబితమైన శిఖరమును కట్టించినాడు. మనుష్యమాత్రులకే




శ్రీ మల్లికార్జునలింగము

గాక, ఆ పరాత్పరునికిగూడా ఉచ్ఛ, నీచ, తప్పవు కాబోలు. అట్టి శివాజీ గోపురము నేడు దగ్గరకువఠిన నెత్తిన పడునటి శిథిలావస్థలో ఉన్నది. హరిహరరాయగోపురం, కృష్ణదేవరాయగోపురం నేడు మనము చూచి కంట తడిపెట్టుస్థితిలో ఉన్నది. చుట్టు ప్రాకారములు ఒక్కొక్కరాయే ఊడిపోతూ, దిక్కూ మొక్కూ లేక, ఎండవానల దెబ్బతిని నామరూపములు లేకుండపోతున్న శిల్పకళాఖండముల చూచి గుండె కరుగని రసజ్ఞు డుండునా? గర్భాలయద్వారము నెర్రలిచ్చి, ముఖమండపమున స్తంభములు పట్టుదప్పి, మిగిలిన జీర్ణావశేషములు పూర్వశోభను స్ఫురణకు తెచ్చుచుండ, ఒకనాడు గాకపోయిక మరొకనాటికైన మరల ఆలయము నుద్ధరించు భక్తబృందము లవతరించకుందురా? అని చింతిగలుగనివా రుందురా?

మంత్రిమండలి కృషి

ఆలయమును ఉద్ధరించ శక్త్యనుసారము కృషిచేసిన భక్తులు ఇప్పటికీ ఉన్నారు. ఆలయఉద్ధరణ సంఘాన్ని పూర్వమంత్రి శ్రీ కల్లూరి చంద్రమౌళి ఏర్పాటుచేశారు. పూర్వ ఆర్థికమంత్రి శ్రీ తెన్నేటి విశ్వనాథం, ఇప్పటి ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి డోర్నాలనుంచి శ్రీశైలానికి 30½ మైళ్ళు దాదాపు 20 లక్షలతో రస్తా పడటానికి కేంద్ర ప్రభుత్వ సహాయంతో కృషిచేశారు. ఇప్పుడు పడిన రస్తాపై తారు వేయించేపని విషయంలో రస్తాల మంత్రి శ్రీ మందుముల నరసింగరావు శ్రద్ధవహిస్తున్నారు. శ్రీశైలం కొండపై పాతాళగంగనుంచి గాని దగ్గిరనున్న ఊటబావులు, ఏళ్ళనుంచిగాని మంచినీటి వసతి సౌకర్యం శాశ్వతమైనది కలిగించే బాధ్యత స్థానికస్వపరిపాలనా మంత్రి బ్రహ్మానందరెడ్డి, విద్యుద్దీపాలేర్పరచే కర్తవ్యం శ్రీ జోగినేపల్లి నరసింగరావు పైన ఉన్నది.

డోర్నాలనుంచి, శ్రీశైలానికి ముప్పయి మైళ్ళ రస్తా వెయ్యడానికి ఉద్యోగులు రెండేళ్ళపాటు చేసిన



ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి నవంబరులో ప్రారంభించిన డోర్నాల-శ్రీశైలం రస్తా.



ఆలయమండపంలో ఉన్న నందీశ్వరస్వామి.

భక్తియుతమైన నిస్వార్థసేవ చరిత్రలో స్థిరంగా నిలచిపోగలదు. తెలంగాణా జిల్లాలవైపు అమ్రాబాద్ కొండల్లోంచి, ఫర్హాబాద్ మీదుగా నీలగంగ వరకు 40 మైళ్ళదూరం రు 17 లక్షలతో రస్తావేసే కృషి జరుగుతోంది. మన్ననూరునుంచి ఫర్హాబాదు వరకు రస్తాపని ప్రారంభమైనది. నీలగంగ (కృష్ణపై) వంతెనకూడా పడి, ఆ రస్తాపూర్తి అయి, శ్రీశైల ఆలయమునుంచి పాతాళగంగ రెండు మైళ్లు గూడా రస్తాపడితే భక్తులకు నిరంతరం రాకపోకలకు చక్కని మార్గము వెలుస్తుంది.

యాత్రికులకు సౌకర్యాలు

శివరాత్ర్యుత్సవాలకు ఇటు జడ్చర్ల, మహబూబునగర్ నుంచి మన్ననూరుదాకా అక్కడనుంచి నీలగంగదాకా రోడ్డు ట్రాన్సుపోర్టు కార్పొరేషను వారు బస్సుసౌకర్యాలు చేశారు. అటు మార్కాపురం, డోర్నాల, నంద్యాల, కర్నూలునుంచి 30 బస్సులు శివరాత్రికి నడపుతున్నారు. నీలగంగనుంచి నాలుమైళ్ళు నడిస్తే స్వామిదర్శనం అవుతుంది. అయితే పెద్దచెరువునుంచి ఉదయమే బయలుదేరి, మధ్యన భీముని కొలనుచేరి, వంటలు చేసుకొని సాయంత్రం 11 కొండలు, 11 మైళ్ళు చేరే భక్తబృం

★ శ్రీశైల మహాక్షేత్రం ★

చాల దృశ్యాలు ఇప్పుడు అంతగా మనకళ్ళ పడవు. రెండుగంటల్లో పర్వతపాదంనుంచి పర్వత శిఖరానికి బస్సులలో చేరే భక్త బృందాల దృశ్యాలు చూడవచ్చు. పైన ఆకాశము క్రింద పాతాళాన్ని చుట్టూ ప్రకృతి ప్రసాదించిన రమణీయ దృశ్యాలు పూర్వం పాద చారులైన భక్తులకు లభించేవి. ఇప్పుడు శిఖరేశ్వరంనుంచి మనోజ్ఞమైన పాతాళగంగను, స్ఫటిక సదృశమైన స్వామి ఆలయ శిఖరాలను దోర్బాలనుంచి వెళ్ళు భకులు తిలకించవచ్చు. కొండపైన శ్రీ మల్లికార్జున ఆలయము, భ్రమరాంబగుడి, సహస్ర లింగేశ్వరుని, వృద్ధమల్లికార్జునుని గుళ్ళు, పంచ పాండవుల గుళ్ళు, ఏనుగులవాగు, కదళీవనము సిఖరేశ్వరం, హాటకేశ్వరంచూచి భక్తులు ఆనందిస్తారు.

లోకపితః లోకమాత

భక్తులపాలిట కల్పవృక్షము శ్రీ మల్లికార్జునుడు. కన్నబిడ్డల కోర్కె లీడేర్చే తల్లి భ్రమరాంబ. భ్రమరాంబ కల్యాణాన్ని భక్తులు కన్నులార చూడవచ్చు. లింగోద్భవ కాలమునకు శివరాత్రినాడు భజనలు చేస్తూ జాగారంచేసే దృశ్యం ఆ దేవళకే చూడాలి.

స్థలమాహాత్మ్యం

మరి ఇంతప్రశస్తి ఉన్న శ్రీశైలం స్థలమాహాత్మ్యమేమి? శిలాదుడనే మహర్షి శ్రీశైలంపై తపస్సుచేశాడు. శివుని కటాక్షంవల్ల నందీశ్వరుడు పర్వతుడు అనే కొడుకుల్ని బడశాడు. పర్వతుడు గూడా కఠోరమైన తపస్సుచేసి కైలాసాన్ని వదిలి శ్రీశైలంపై వచ్చి కొలువున్నాడు. పర్వతలింగ ఆకృతిలో స్వామి వెలిశాడు. వసుమతి అనే ఋషి కన్య బ్రహ్మను గూర్చి తపస్సుచేసి శ్రీ దేవి అనే పేరు పొందింది. ఆమె పేరిట శ్రీ పర్వతం అనే పేరు, శిలాదముని పేరిట శ్రీశైలం అనే పేరువచ్చినది. చంద్రావతి అనే గుప్తరాజుల కన్య మల్లికాపుష్పాలతో పూజించినందున మల్లికార్జున స్వామి పేరు వచ్చింది. చిన్నతనాన తండ్రి విదేశాల జయించడానికి వెళ్ళి, తిరిగివచ్చి యుక్త వయస్కురాలైన కుమార్తెను కూతురని తెలియక వెంటపడగా, ఆయమ ఈ స్వామిని శరణుజొచ్చెనని, ఆరాజు శాపగ్రస్తుడై పాతాళగంగ ప్రవహించేచోట పచ్చని శిల అయిపోయాడనీ, అందువల్లనే అచ్చటి జలాలు పచ్చగా ఉన్నాయని చెబుతారు.

విశ్రాంతి మందిరాలు

శ్రీశైల ఆలయం 1500 అ. ఎత్తుకొండపైన ఉన్నది. కృష్ణ పాతాళగంగ 900 అ. ఎత్తున ప్రవహిస్తోంది. కొండపై కేంద్ర ప్రభుత్వం కట్టిస్తున్న రూ 40 వేల విశ్రాంతి మందిరం రెండు మూడు నెలల్లో పూర్తి అవుతుంది. రాష్ట్రప్రభుత్వమూ, భక్తులు కట్టిస్తున్న 8 భవనాలు గూడా త్వరలోనే పూర్తి కాగలవు. తిరుపతి దేవస్థానం, ఆర్యవైశ్య సంఘం, వీరశైవసంఘం, అంతా తలో లక్ష రూపాయిలతో సత్రాలు కట్టే సన్నాహాల్లో ఉన్నారు. తిరుపతి ఆదిశేషునికి తల అనీ, శ్రీశైలం తోక అనీ చెబుతారు. పదేళ్ళలో శ్రీశైలం - పూర్వంవలె శివరాత్రికో, సంవత్సరాదికో వచ్చే యాత్రికులతో గాక, నిత్యము వేనకువేలు యాత్రికులకు నిలయము అవుతుంది.

తరించే మార్గం

ఇంతదూరం వెళ్లి భక్తులు చెయ్యవలసిన దేమి ? శిఖరంచూస్తే మళ్లీ జన్మంఉండదు. 'శ్రీశైల శిఖరందృష్ట్వా పునర్జన్మ నవిద్యతే' అంటేనా? పునర్జన్మ లేకుండటానికి పూర్వం భక్తుల కర్తవ్యం ఏమిటి? స్వామికి పూర్వం 70 గ్రామాలు ఉండేవి కాని ఇప్పుడు సెంటు పొలం లేదు. చుట్టు ప్రక్కల ఉన్న అడవులైనా స్వామికి అధికారం హక్కు లేకుండా అయినది. ఇక భక్తులిచ్చే దర్శనరుసుము రు 1-4-0 యే ఆయన ఆస్తి. శివరాత్రికి స్వామిదర్శనం చేసి భక్తులం దర్శనరుసుము చెల్లించుటతోడు జీర్ణ ఆలయ ఉద్ధరణ కార్యంనిమిత్తము, కార్యనిర్వాహక ఉద్యోగి శ్రీ రాజగోపాలరాజుగారికి గాని, కమిషనరు శ్రీ లక్ష్మయ్యగారికి గాని, ఉపకమిషనరు శ్రీరామమూర్తిగారికి గాని ఎంతో కొంతం ఇచ్చి మరీ రావాలి.

ప్రభుత్వం భూములకు గరిష్ఠ ప్రమాణాన్ని నిర్ణయిస్తోంది. ఆలుబిడ్డలకు భూములు పంచియిచ్చే ఆసాములు ఒక్కగానొక్క ఎకరం లేని స్వామి ఏమైనా తమ చిక్కులతోపాటు భూమిని వ్రాసి ఇవ్వవచ్చు కాని స్వామిని కన్నులార సేవించి, చేతులార తాకి పూజించి అభిషేకించవచ్చు. ఒక భక్తురాలు హృదయ పూర్వకమైన భక్తితో చేయించిన నాగాభరణము పర్వత లింగమునకు అపూర్వ శోభను తెచ్చినది. మరొక భక్తుడు వెండి ధారాపాత్ర నిచ్చినాడు. మరొక భక్త బృందము శాశ్వతముగా ఆలయమున సన్నాయి మేళమును ఏర్పాటు చేస్తోంది. అన్నసత్రాలేర్పరచడానికి ఎన్నో సంఘాలు అహమహమికతో ముందుకొస్తున్నవి. శివరాత్రికి వెళ్ళే ప్రతిభక్తుడు జీర్ణావస్థలో ఉన్న ఆలయాన్ని ఉద్ధరించడానికి ఏదో కొంత ముడుపు చెల్లించి జన్మను సార్థకంచేసుకోకుండా ఉండగలడా ?" ★



శ్రీ మల్లికార్జునస్వామి ఆలయశిఖరం, మండపాలు.

[శ్రీశైలక్షేత్రం ఛాయాచిత్రాలు: శ్రీ డి. ఎస్. నాయుడు, హైదరాబాదు]

షష్ఠాష్టకం

సిహెచ్. వెంకటేశ్వర్లు

౧

'తెల్లవారిందండీ!

'అప్పుడే!

'అప్పుడేయేం. ఆరున్నర దాటింది!

'మన గడియారం 'స్లెం' తప్పు'

'అయితే లేవకుండా అట్టె పడుకుంటారా!

'ఎవరన్నారా మాట' ఇప్పటినుండి లేచేమి చెయ్యాలనే అనేది!

'ఈపూటన్నా కొంత మార్కెటువైపు పోయి, యేదన్నా కూర తెస్తురుగాని'

'దొడ్లో తోటకూరేమన్నా, ఉందేమో చూడలేకపోయావు.'

'నాలురోజులనుండి దానితోనే సరిపోతున్నది. చప్పగా యేమన్నా రుచూపచా!?

'ఎండాకాలము. ఆకుకూరలు శ్రేష్ఠము'

'మంచివయితే మీకు వండిపెడతాలెండి. కేమన్నా కూర తెద్దురూ!'

'ఇంట్లో ఉన్న యిద్దరికీ రెండు కూరలా? బాగానే ఉంది. వరుస!

'కూరలో పెద పొయ్యే కేమున్నదిలెండి మీరు రోజూ పేకాటకు, కాఫిహోటలికి తగలేసేదాంట్లో యెన్నోవంతు'

'ప్రొద్దున్నె తగాదాకు కూర్చున్నట్లున్నదే, ఇంకా కాఫీ భాండము కుంపటిపై నుండి దిగలేదా'

'దింపేందుకు మీకోస మెదురుచూస్తున్నదనుకొన్నారా యేమి. నే కాఫీ త్రాగటం గూడా అప్పుడే అయిపోయింది'

'అందుకేనా తీరిగ్గా రగడకు కూర్చున్నావు. ఈ ముప్పూట కాఫీలతో సంసారాలు సగము గుల్లవుతున్నవి:

'మీకెందుకంత సూయ? ఇంట్లో చేసిన మీకు దిగదాయె? హోటలువాడే నీళ్ళిచ్చినా మీకమృతము!

'శనిపడితే యేడేండ్లు. నీవు పడితే పద్నాలుగేండ్లు'

'అందుకనే ముఖము కడుక్కొని త్వరగా మార్కెట్ కెళ్ళిరండి'

'మార్కెటుమాట మరచి పొయ్యేట్లు లేదే. ఏమి తెమ్మంటా వేమిటి?'

'తెచ్చేటందు కేమున్నది. బంగాళదుంప లోకవిశే,వంకాయ లొక అరవీసెపట్టుకరండి మరల నాలురోజుల దాక అటుపోవలసినపని ఉండదు.'

'ఏమికూర చేస్తా వేమిటి ?'

'నాలుగు ఉల్లిపాయలుతరిగి బంగాళదుంప వేపుడుచేస్తాను. నిన్న పిన్నిగారిచ్చిన మునగకాయల్లో నాలుగు మిగిలినట్లుంది. వాటితో పులుసుచేసి ఉల్లి తిరగమోత వేస్తాను.'

'శ్రాద్ధయోగ్యంగా ఉంది. ఏపూట ఉల్లిపాయలేందీ ముద్ద మ్రింగుడుపడదు. మళ్ళీ పుట్టింది బ్రాహ్మణపుట్టుక '

'ఒకసారి వాటి రుచిమూస్తే మీరు వదులుతారా. అవిరాకుండా తీసివేసి కూరవేస్తాలెండి.'

౨

'ఇంకా వంటకాలేదా? పదిదాటింది.'

'కచ్చేరి వేళంతా మించిపోతున్నదా? మీ పేకాట కచ్చేరి తెంపులేకుండా నడుస్తుంది గదా?'

'కచ్చేరి కెళ్ళేవాళ్ళే నా వేళకు తిండి తినేది. మిగతావాళ్ళ కవసరములేదా'.

'ఆలస్యముచేస్తే దండించటానికి వాళ్ళకి పైన ఆఫీసరంటూ ఒకడుంటాడు. మీకేముంది.'

'మాకుమటుకు లేకేమి. వేళకు పోకపోతే బయట కూర్చోవలసి వస్తుంది.'

'చోద్యంగానే ఉంది. అక్కడ చేరే వాళ్ళంతా మీలాంటివాళ్ళే. తాతముత్తాతలు సంపాదించిన ఆస్తులు తెరగతినటము, ఇండ్లలో పెళ్ళాలమీద సవారీచేయటము.'

'ఈ మాటలకేమిలే. ఇంతకు వంట యెంతవరకొచ్చింది.'

'——.................'

'ఇంకా కూర తరిగినట్లు లేదే.'

'పనిమనిషింకా రాలేదు.'

'అంటగిన్నెలు గూడ తోమలే దన్నమాట'.

'నిన్నటి చద్దన్నమింకా అట్లనే వుంది.'

'పొయ్యిగూడా అలికినట్లు లేదే'

'వేరే పనిమనిషి కోసము కబురుచేశా'

'ఇక అయితే యీరోజు నాలుగ్గ్రేళ్ళు లోనికి పోయినట్లే'

'పోకేమి చేస్తవిలేండి. వేళకు కావాలంటే, కాస్త పనిమనిషిని కేకేసుకురండి. నిమిషములో వంటయిపోతుంది.'

3

'ఎదురింటి పిన్నిగారు క్రొత్తరకము గాజులు చేయించుకొన్నదండీ!'

'ఎదురింటివారు చేయించుకొంటే మన కేమి'.

'తెమ్మంటారేమోనని'.

'ఎందుకు.'

'చూస్తారేమోనని. నాకుగూడా అల్లాటి వయితే బాగుంటుందని'

'బాగానే ఉంటుంది. ఇప్పుడు డబ్బెక్కడిది?'

'ఒకప్పు డెక్కడనుండి వసుంది'

'వచ్చినప్పుడే చేయించుకొనేది'

'మా నాన్న "పసుపు కుంకుమ" క్రింద నాకు వ్రాసిచ్చిన పొలంపై యేటా వచ్చే మక్తా యేమి చేస్తున్నట్లు.'

'ఏమి చేస్తున్నా నా. ఇంట్లో ఖర్చులన్నిటికి డబ్బెక్కడనుండి వస్తున్నదనుకున్నావు'

'అవి రాకపోతేనో'

'అప్పటి సంగతి వేరు'

'ఎన్నాళ్ళనుండి మిమ్మల్నడగటము.'

'.................'

'పదేళ్ళలో మీరు నాకు చేయించినదేముంది. పుట్టినన్నాళ్ళకు పురుషుడు యజ్ఞము చేశాడన్నట్లు ఆ నాలుగు పేటల గొలుసొక్కటేగదా'

'అది లేనివాళ్ళు ప్రపంచములో యెందరున్నారు'

'లేరనికాదు'

'ఇప్పుడు నీవనేదేమిటి'

'అనటానికేముంది. తాము తినక ఒకరికి పెట్టని డబ్బు తగులబెట్టనా! లేపేమన్నా కట్టుకపోతారా?'

'ఆ సంగతి మీ నాన్ననడుగు.'

'మాట మాట్లాడితే అదొకటి తెలుసు మీకు'

'మీ కంతఉండి, నా కిచ్చిన కట్నమేముంది.'

★ షష్టాష్టకం ★

'మీరు చదివిన చదువుకు, ప్రయోజక త్వానికి ఆ కట్నము చాలులెండి'

'ఈ వేలకు వేలు కట్నాలు తీసుకునే వాళ్లు నాకన్న ప్రయోజకులా.'

'మామగారు ఆ కాస్త నేల సంపాదించి యివ్వకపోతే, తెలిసేది మీ ప్రయోజక త్వము.'

'తెలిసేదేముంది. నే నెవడిక్రింద గులాము గిరి చేయటము లేద నేకదా నీవు మాటి మాటికి యెత్తిపొడిచేది'

'ఉద్యోగము పురుషలక్షణమని చెప్పిన మన పెద్దలు చేతగాని దద్దమ్మలన్నమాట.'

'ఉద్యోగమంటె గులాము గిరిగాదు!'

'నిర్వ్యాపారత్వము కాపురుషగుణంబు లలో లెక్కగట్టిన మన భారత కర్తలుగూడ పనికిమాలిన వాళ్ళేనా?'

'ఓ! యబ్బా! చాలవరకు పోయిందే!'

'పోదా మరి. తీగలాగితే పొదకదులు తుందంటారు.'

౪

'ఏమండీ! పండగింకా నాల్గురోజు లే యుంది.'

'అయితే యేమంటావు.'

'మీకంతా మరపే.'

'ఏమన్నా నేమిటి.'

'ఇప్పటి కెన్నిరోజుల నుండి అడిగేను తున్నారు.'

'ఏమని?'

'పోయిన పండుగ కెట్లాగూ లేదు. ఈ పండుగకన్నా నేనడిగిన బెంగుళూరు సిల్కు చీర కొనరా.'

'అదిగూడా యిప్పుడే వచ్చింది కఅవులో అధికమాసంలాగ'

'సంవత్సరాది పండుగ కన్నది సంక్రాం తికిగూడ వాయిదా వేస్తే యెల్లాగండి.'

'.........'

'కొట్లోకి క్రొత్తరకము సిల్కు చీర లొచ్చినవట అండీ.'

'ఉన్నచీరలు చాలవా.'

'ఎన్నున్న వని.'

'ఉన్నవి వాడుకుంటే సరిపోవూ?ఇప్పుడు డబ్బెక్కడిది.'

'డబ్బు వచ్చినప్పుడు పండుగ వస్తుందా'

'.........'

'ఒకముద్దు ముచ్చటేమన్నా ఉంటేగా. ఎవరిని చూచినా చిలకా గోరింకల్లా గుంటారు. మన కర్మిట్లాగాలింది.'

'అను అను. నీయిష్టమువచ్చినట్లను.'

'ఆనల్లరాతినంటే యెంతో, మిమ్మ ల్నన్నా అంతే'

'అయితే నేను నల్లరాతినన్నమాట.'

'అబ్బే లేదు. ఆ మాటలంటే నల్లరాతి కప చారము చేసినటు.'

'బాగానే ఉంది సరసము'

'సరసాలు మీలాంటివాళ్లతోనే.'

'ఎవరినో క్రొత్తరసికులను వెతుకుతున్న ట్లున్నదే'

'ఆమాటకొస్తే ఇదివరుస'

'.........'

'సరస మంటే జ్ఞాపక మొచ్చింది. ముదు ముచ్చట మామరిదికి తెలిసినట్లు మ రెవ్వ రికి తెలియవు.'

'ఆమరిదిని ఈవదినెగారు పొగడాలిసిందే.'

'పండుగకని వస్తే ఎంత సరదా పడతాడు. పోయిన దీపావళికి మా చెల్లెలితో బాటు, నాకు చీర రవికె తెచ్చి యేకంగా ఒకటే బలవం తము చేసి, కట్టుకున్నదాకా వదలలేదు.'

'ఇకచాల్లే. దండకమంతటితో ఆపితే బాగుంటుంది.'

'ఆపకేమి చేస్తాను. మీ చేతిలో చిక్కి నప్పుడు. మొండివాడు రాజుకంటె బల వంతుడు.'

౫

'క్రొత్త సినిమా వచ్చినదటండీ.'

'ఊ'

'చాల బాగుందంటున్నారు'

'ఎవరు.'

'వెళ్ళి వచ్చినవారు.'

'అమ్మలక్కలంతానా.'

'వాళ్ళతో మన కేమిలెండి. ఈ రోజా పెందలకడనే మొదటాటకెళ్ళివద్దాము.'

'ఇంకానయము. ఇప్పుడే వచ్చి పూర్వో మనలా.'

'కాంచెము పెందలకడరండీ.'

'ఏమి సినిమాలు? పుణ్యమా పురు షార్థమా?'

'మీరుచేసే ప్రతిపని పుణ్యముకోసమే చేస్తున్నట్లు! ఇప్పటి కెంత పుణ్యము సంపా దించారు'

'పెద్ద గుమ్మడికాయంత'

'సంక్రాంతిపండుగ వరకు దాచిపెట్టు కోండి. ఏ బ్రాహ్మణునకైన దానము చేద్దురు గాని.'

'అవతల నా కరంటు పనుంది. చెప్పట మయిపోయిందా. కొదవేమన్నా యుందా.'

'ఏమంతర్జంటుపని. మండపముమీద చతు ర్ముఖ పారాయణమేగదా'

'ఇకచాల్లే. ఎరవన్నావిన్నా నవ్వుతారు. ప్రొద్దస్తమానము.'

'నవ్వేటట్లుగానే చేస్తున్నారు. ఒక ముదా ముచ్చటా'

'పోనీ. నీవు వెళ్ళిరా.'

'నే వెళ్లటానికి నేమిలెండి. మీరుగూడ వస్తార నేగదూ.'

'నాకు తీరదనిచెప్పట మిది రెండోసారి'

'ఏమంత తీరని రాచకార్యము'

౬

'గాజులు చేయించటానికి డబ్బులేదం టిరిగదండీ'

'ఎక్కడిది.'

'మీనాక్షికి మొన్న పండుగకు సిల్కు చీర కొంటానికి డబ్బెక్కడనుండి వచ్చింది'

'నే కొన్నానని యెవరన్నారు'

'ఒకర నేదేముంది? లోకము కోడై కూస్తుం టేను. ఎవరినోరని కప్పెట్టగలము.

'లోకానికి కళ్ళులేవు. గ్రుడ్డిది.'

'పిల్లి కళ్ళు మూసుకొని పాలుత్రాగుతూ యెవరు చూడలేదనుకుంటుందట'

'నీతో అన్నవాళ్ళెవరు.'

'ఎందుకు రుజూ చేస్తారా? అదే అంద రితో చెబుతున్నదట గా'

'నే కొన్నానా!'

'కానండి. యింకెన్నాళ్ళని కొంటారు.

(55 వ పేజీ చూడండి)

వనితా లోకం

సిగ్గా - సింగారమా

“సిగ్గు సింగారం” అన్నారు పెద్దలు. అదే మాట మా పొరుగింటి వెంకాయమ్మ గూడా పదేపదే చెబుతూవుంటుంది. “మాశావుటమ్మా! ఆ పుల్లమ్మ వుందే (ఆవిడా మా పొరుగావిడే లెండి) ఎంత సిగ్గులేని దనుకున్నారు? ఇరవై నాలుగు గంటలూ వీధరుగు మీద కూర్చొని అల్లా సిగ్గూ ఎగ్గూ లేకుండా వీధిలో వచ్చిపోయేవారిని మనం చూడగలమటమ్మా! ఇంట్లోకి ఎవరైనా కొత్తవారు వచ్చినా వీధరుగుమీదినుండి కదలనే కదలదు గదా! మరీ అంత సిగ్గులేనితనం భోగంపడుచులకైనా వుండదు. అటువేపుగా వెళ్తున్నపుడల్లా తనకేసి చూస్తూందని సిగ్గుపడి మా ఆయన అటువేపు వెళ్ళటంగూడా మానేశారండీ! అవ్వ! మరీ అంత సిగ్గూ బిడియమూ లేని ఆడది! నామటుకూ నాకు అలా కొత్తవారికేసి చూడాలంటేనే బ్రహ్మాండమైన సిగ్గుసుమండీ! అసలు నేనెప్పుడైనా బయట నించొనివుండగా చూశారూ? ఏదైనా బయటికి వచ్చినా యిటు మాయింటికితప్ప మరో చోటికి వెళ్ళను. ఆవిడగారైతే నడివీధిలో నించొని మాట్లాడుతూ వుంటుంది. అలాంటపుడు ఆవిడకేసిచూడాలన్నా నాకు బోలెడు సిగ్గుసుమండీ! అందుకనే మా అత్తగారు నన్ను భలే మెచ్చుకుంటూ వుంటారు. ‘అమ్మాయ్! ఈ సిగ్గు అనేది వుంది చూశావూ! అది నీకు పెట్టని సింగారం! ఆడది అంటే నీలా సిగ్గుపడటం నేర్చుకోవాలి!’ అంటుంది. ఇహ ఆయనగారి సంగతి చెప్పక్కర్లేదు లెండి. తన స్నేహితులతో, వారితో వీరితో చెప్పుకొని మరీ మురిసిపోతుంటారుట...” ఆవిడ ఉపన్యాస పరంపరలన్నీ యిదే వరసలో వుంటాయి. ఈ ఉపన్యాసం విన్నవారికి అసలు వెంకాయమ్మగారికి సిగ్గనేది ఏకోశానావున్నట్లనిపించదు. ఎవరి సంగతో ఎందుకులెండి. నా మటుకూ నాకలా అనిపించింది. అసలు ‘సిగ్గు సింగారం’ అన్న పెద్దలే ‘ఆత్మస్తుతి’ ‘పరనింద’ పనికిరావన్నారు. ఫలానివారికి సిగ్గు లేదు అని ఆరోపణలు చేయటంకంటె తమకెంతమటుకు సిగుందో ఆలోచించుకోవాలి. తన్ను తాను పొగడుకొంటూ యితరుల్ని నిందిస్తున్నపుడు ఆ పని చేసేవారి కేంవుంటుందోగానీ, వినే వారికి మాత్రం వెగటుగానే వుంటుంది. నలుగురిలో మంచివారనడానికి ‘ఆత్మస్తుతి’ ‘పరనింద’లు సాధనాలు కావు. తమ మంచితనాన్ని నలుగురికీ చెప్పవలసిన అవసరం లేదు. పూవులో తావి వుందని తుమ్మెదకు చెప్పాలా? నీలో మంచితనం వుంటే - అది వుందని సంఘానికి చెప్పాలా? మన నడవడిలో చేష్టలో ఉన్న మంచితనాన్ని గుర్తించలేకపోవటానికి సంఘం గుడ్డిది కాదు.

కె. లీలావతి

మన మంచితనాన్ని ప్రచారం చేసుకోవటానికి మనల్ని మనం పొగడుకోవటానికి గానీ, ఇతరులనునిందించటానికి గానీ సిగుపడిననాడు సిగ్గు బంగారంకన్నా ఎంతో విలువైన సింగారంఅవుతుంది. ఈలాంటిసింగారం ఆడవారికే గాక మొగవారికి గూడా చాలా అవసరం.

కొన్ని కొన్ని విషయాలలో సిగ్గుపడటం ఎంత అవసరమో - కొన్ని విషయాలలో సిగ్గుపడకుండా వుండటంగూడా అంత అవసరమే!

ఇరవయ్యో శతాబ్దాలలో ఎంత కూపస్థమండూకాలలా గడుపుదామనుకున్నా నలుగురితో మాటలాడవలసిన అవసరం వుండనే వుంటుంది. కొత్తవారితో పరిచయం చేసుకోవలసిన అవసరాలు గూడా వుంటాయి. అలాంటపుడు మాటలాడటానికి గూడా సిగ్గుపడేవారు ఈ నాటికీ మనలో వున్నారంటే చాలా సిగ్గుపడవలసిన విషయం. ఎంత ఆప్యాయంగా మాట్లాడనా - ఎంత లాలనగా ప్రేమగా పలకరించినా కొందరు ‘ఊ...’ ‘ఆ...’ అనటంకంటె చచ్చినా ఎక్కువ మాట్లాడరు. అలాంటివారు స్వతహాగా ఎంత మంచివారైనా - వారితో మాట్లాడటం చిరాగ్గావుంటుంది. అసహ్యంగా గూడా వుంటుంది.

మనం విజ్ఞాన యుగంలో వున్నాం. శాంతి సౌహార్దాలు, అన్యోన్యత ప్రగాఢంగా కాంక్షించే యుగం మధ్య కాలంలో నివసిస్తున్నాం. కొత్తవారిని మిత్రులుగా చేసుకోవటానికీ - కొత్త విషయాలు మాటలాడుకోవటానికీ - మనం సహజంగా ఉత్సాహం చూపుతూనే వుంటాం. కానీ మన మధ్యనే మాటలాడ్డానికి సిగ్గుపడేవారున్నారన్నా శాంతి సౌహార్దాలు ఏలా సాధ్యపడతాయి? ఏ పనికైనా పరస్పరం అర్థంచేసుకోవటం ఎంతైనా అవసరం. ఒకర్ని అర్థం చేసుకోవటానికి సంభాషణ ప్రాణ సమానం. మాటలాడకుండానే ఎదటివారిని అర్థంచేసుకోవటం ఎలా సాధ్యం అవుతుంది? అంచేత మాటలాడుకోవటానికి గూడాసిగ్గుపడటం అనవసరం! అలా చేయటం వలన మనం సిగ్గును దుర్వినియోగం చేస్తున్నట్లవుతుంది గానీ సింగారంగా ఉపయోగించుకున్నట్లవదు. అసలు దానిని సిగ్గు అనటంకంటే పిరికితనం అనటం సమంజసమేమో!

మాటలాడటానికి సిగ్గుపడేవారిలో మాటలాడటంచేత కాదని బాధపడేవారు చాలామంది వున్నారు. మాటలాడితే ఎదటివారు ఎక్కడ తప్పుపట్టిస్తారో అని వీరి బాధ! డబాయించి మాటలాడటం వీరిచేత కాదు. ఈలాంటివారు తరచూ నలుగురి మధ్యా తిరుగుతూ వుండటం అవసరం. నలుగురూ కూర్చొని మాటలాడుకుంటున్నపుడు జాగ్రత్తగా వింటూ వుండటం వీరి సిగ్గును చాలా మటుకు తగ్గించెయ్యగలదు. నలుగురూ పర

★ సిగ్గూ · సింగారమూ ★

బాగా చేరి మాటలాడుకుంటున్నపుడు. పింటే ఎంత సిగ్గుపడేవారికైనా 'కొన్ని మాటలు మనంగూడా మాట్లాడితే బావుంటుంది!' అనిపిస్తుంది. అలా అనిపించినపుడు సిగూగిగూ చక్కా ఎగిరిపోతుంది. క్రమంగా వారు మనకంటె బాగా మాట్లాడేవారుగా తయారౌతారు. మా పిన్నమ్మ కూతురిల్లాగే మాటలాడ్డానికి సిగుపడుతూండేది. మేము మాటలాడుకునేపుడు ఆ అమ్మాయిని ఒడిలో కూర్చొపెట్టుకొనేవారం. ఆ అమ్మాయి యిప్పుడు మాకంటె బాగా మాట్లాడేస్తుంది. అంచేతే 'మాటలపుట్ట' అని పిలుస్తున్నాం ఆ అమ్మాయి నిపుడు.

*　　*　　*

"అబ్బబ్బ! ఈసుధతో చచ్చేచావయింది. వచ్చి కూర్చొని గంటలకొద్దీ చెత్త పేలాపన పేలుతూ వుంటుంది. చూసిచూసి ఇహ చాలు పొమ్మని ఎలా అనటం? ఆ ప్రేలాపన అంత చెత్తగా వుందని ఏలా చెప్పటం? అది ఆవిడకే తెలియాలిగానీ" ప్రతిదినం సుధతో మాట్లాడాక వరస తప్పకుండా చెల్లాయి అనేమాటలివి. బావుంది! ఎదటివారి తప్పులు తెలిసినంతగా తమతప్పులు తెలీ వెవరికైనా. ఎదటివారుచేస్తున్న తప్పును ఎత్తి చూపించటానికి సిగ్గుపడితే ఎలా? అలా వారితప్పును కప్పిపుచ్చటంవలన మనం వారిని బాగు చెయ్యటంమాట అటుంచి అటువంటి తప్పుని మరోమాటు చెయ్యటానికి అవకాశమిస్తున్నామన్నమాట. కొందరు మాటలధోరణిలో పడిపోయారంటే భూమ్యాకాశాలు కానరాకుండా మాట్లాడేస్తారు. ఎదటివారు ఓపికగా వింటూవుంటే. ఏమేమిటో మాటలాడుతూ వుంటారు. వారికి "మీరు మాట్లాడేది చెత్త" అని మనం చెప్పేదాకా తెలీదు. అలాంటి వారిలో చెల్లాయి ఫ్రెండు సుధ ఒకరు. ఆ అమ్మాయి సంభాషణతో బాధపడేది మా చెల్లాయి. చెల్లాయి సుధకు కచ్చితంగా చెప్పెయ్యలేక బాధపడుతూవుంటే చూల్లేక ఒకరోజు సుధతో నేనే అన్నాను: చూడండి! మీరు అంతగా మాటలాడటం బావుండదు. కాస్తా మాటలు తగ్గించి మాట్లాడండి అని. కానీ సుధ "అవును మామాటలు మీకెలా బావుంటాయిలెండి" అని కోప్పడి వెళ్ళిపోయింది. ఆరోజునుండి కొన్నాళ్ళదాకా మాయింటికి రావటం మానేసింది. చెల్లాయితో నాతో మాటలాడ్డమూ మానేసింది. నేను ఎందుకు చెప్పానా అని బాధపడ్డాను. కాస్తా చెల్లాయికూడా నామీద అలుక పూనింది. కానీ ఓరోజు సుధ క్షమాపణ కోరుకుంది. డైరెక్టుగా క్షమించమని అడగటానికి సిగ్గుపడి ఉత్తరం ద్వారా క్షమించమని కోరింది "మరీ అంత చెత్తగా మాటలాడటం తప్పేనని తెలుసుకొన్నాను. క్షమించండి. మీమీద అనవసరంగా కోప్పడినందుకు నాకు చాలా సిగుగా వుంది. మన స్నేహాన్ని యింతటితో నిలిపివేయరుకదూ!" అని రాసింది ఆ పిచ్చిపిల్ల. ఆతర్వాత మామూలుగా మాయింటికి రావటం కూడా తిరిగీ మొదలెట్టిందనుకోండి. ఎదటివారితప్పును ముఖాన్నే అనేయటంవలన తాత్కాలికంగా వారు బాధపడి కోప్పడవచ్చు. కానీ చివరకు తప్పు తెలుసుకొని పశ్చాత్తాపపడక మానరు. ఈలాంటి విషయాలలో సిగ్గుపడటంవలన కొందరి భవిష్యత్తుల నాశనానికిగూడా మనం కారణమౌతున్నాం!

మాటమాటకూ సిగ్గుపడటం - మాటిమాటికీ సిగుపడటం — ప్రతి చిన్న విషయానికీ సిగ్గుపడిపోవటం - ఎంత అసహ్యకరంగా వుంటాయో చెప్పలేం. పండక్కి మాయింటికి ఓ బంధువు లమ్మాయి వచ్చింది. పండగరోజు కొత్తచీరా జాకెట్ వేసుకొని మేమంతా ఓచోట కూర్చొని మాటలాడుకుంటూ వుండగా సిగుపడుతూ వచ్చి కూర్చుంది. చెల్లాయి ఆవిడ సిగ్గును పసికట్టి తమాషాగా "అబ్బే! ఆ చీరకూ జాకెట్‌కూ ఏమీ సరిపోలేదు" అంది. వెంటనే ఆ అమ్మాయి తల వంచుకొని గబగబా ఇంట్లోకి వెళ్ళి కొత్త గుడ్డల్ని మార్చి మరోజత వేసుకొని వచ్చింది. ఆ జత బావులేదని మరొకరన్నారు. సరి. అలా మూడుజతలు మార్చాక పక్కింటి సరోజని "దేవాలయానికి వెడదాం రండర్రా" అని పిలచి, "అబ్బే! జాకెట్ బావుందిగానీ, చీర బావులేదండీ!" అంది ఆ అమ్మాయిని చూచి. దానితో ఇక మార్చటానికి వేరేగుడ్డలు లేక పండగ రోజంతా ఇంట్లో మూలన కూర్చొని ఏడ్చేసిందా అమ్మాయి. చూడండి! ఈలాటి చిన్న చిన్న

(42-వ పేజీ చూడండి)



సోఫాలకు, రేడియోలకు కవరుమీది డిజైను

—[శ్రీమతి కృష్ణ, చల్లపల్లి.]

ఆడవాళ్లు: ఆత్మహత్యలు

మేరీ వ్యాసంపై మరోసోదరి ప్రతివ్యాసం

[illegible]

ఆడవాళ్లు—ఆత్మహత్యలు అని ఆ మధ్య శ్రీమతి ఆదిమధ్యం రమణమ్మగారు వ్యాసమురాశారు. చాలా బాగుందని పఠితలు అభిప్రాయాలు వెలిబుచ్చారు. నిజంగా ఆమె వ్యాసంలో చెప్పకోతగ్గ లోపాలేమీ లేవు. ఉండి ఉండి ఆటంబాంబు పేల్చినట్లుగా సి. హెచ్. మేరీగారు ఆ వ్యాసానికి ఒక ప్రతి వ్యాసం వ్రాశారు. దానిలో రచయిత్రిగారి ఆవేశమేతప్ప వుద్దేశ్య మాత్రే కన్పించలేదు. ఒకవేళ వుద్దేశ్యమేమన్నా వున్నట్లైతే, స్త్రీ పురుషులు సమానులు కదా! పురుషుడు చేసినతప్పు స్త్రీ ఎందుకు చెయ్యకూడదు? తప్పుచేసిన స్త్రీని ఆదరించేందుకు విడాకుల చటము మొదలైన సదుపాయాలుండగా గృహ కల్లోలాలవల, లేక కన్యగా కాలు జారినందువల్ల ఆత్మహత్య చేసుకోవలసిన అగత్యములేదని, అట్లా ఎవరూ చేసుకోటము లేదనీ, ఆత్మహత్యలకి వేరే కారణా లున్నాయనీ (ఆ కారణాలు వారు వివరించ లేదు) అన్నారు మేరీగారు.

మేరీగారు అంతతో ఆగక ప్రస్తుత కాలాన్ని వదిలేసి ఆదికాలమంటూ హిందూ మతాన్ని, ఆ మతవ్యాప్తికి మూలమైన పురుషుల్ని, పుణ్యగ్రంథాల్ని, పవిత్ర చారిత్రలైన స్త్రీలనీ దుమ్మెత్తి పోశారు. ఇలా చెయ్యటమే రచయిత్రి ఉద్దేశమనుకుంటూ; లేనట్లయితే వేలాది సంవత్సరాల నుంచి మన్నింపబడుతూ వచ్చిన రామాయణ భారతాది గ్రంథాలు, ఆ గ్రంథకర్తలైన వ్యాస వాల్మీకాదికవులు, సీతాది మహా సాధ్వులు ఎందుకూ పనికిరానివారుగా, స్త్రీ జాతి మనుగడకు ముప్పు తెచ్చినవారుగా కనుపిస్తారా? హిందూమతానికి, నేటి కన్యలకు, వనితలకు గొడ్డలిపెట్టులా వుంది వారి వ్యాసము - నా చిన్నప్పుడు ఫాదరీలు, మిస్సమ్మలు వారి మతవ్యాప్తి చేసేందుకు మా వూరు వచ్చేవారు. వారివాదన ఎల్లా వుండే దంటే మీ రాముడూ, కృష్ణుడూ దేముళ్లు కారు, మా క్రీస్తుమటుకు దేముడి కుమారుడు, అంచేత మా మతంలో చేరండి, మా క్రీస్తుని నమ్మండి అన్నట్లుండేది. వారి మతమంటె వారికెంత నమ్మకో ఎదటి వారికికూడా వారి మతమంటే అంతే నమ్మక ముంటుందని తెలుసుకోలేనివారిఅమాయకతకు నవ్వుకునేవారేకాని, మనమతాన్ని దూషిస్తున్నారనే ఆవేశాన్ని ఏ మాత్రము చూపే వాళ్ళుకాదు హిందువులు. ఆ తొందరపాటునే రచయిత్రి తమ వ్యాసంలో చూపారనవలసి వస్తున్నది.

ప్రస్తుతవిషయానికి వద్దాం. ఆదికాలంలో హిందూమతము స్త్రీకి పాతివ్రత్యాన్ని, పురుషునికి ఏకపత్నీవ్రతాన్ని సమంగానే విధించిందనేందుకు శ్రీరాముడు, హరి

[illegible]

శ్చంద్రుడు మొదలైనవారే నిదర్శనం. అయితే హిందూధర్మశాస్త్రానుసారము నడుచుకోటములో స్త్రీదే పైచెయ్యి అయింది. తత్ఫలితంగా ఏకపత్నీవ్రతులకన్నా పతివ్రతలే ఎక్కువగా గణుతికెక్కారు.

కాలుజారిన కన్యలకు వ్యభిచారిణులకు కుంతి ఆదర్శముకాదా అన్నారు. బాల్య చాపల్యముతో, ఏదో మంత్రమిచ్చాడు పరీక్షిద్దామనే వుద్దేశ్యంతో, తన తప్పిదము తెలుసుకుని ముందు తనకీ తన బిడ్డకీ సరైన భవిష్యత్తు వుండదని భయంతో పసి నిసుగును గంగపాలుచేసిన కుంతిని ఆదర్శము చేసుకుని కాలుజారిన ప్రతి కన్యా అనుసరించవచ్చునవా వారి అభిప్రాయం?

రచయిత్రి దృష్టి భారతనారియైన ద్రౌపది మీదకుకూడా పోయింది. కారణాంతరాల వల్ల ద్రౌపది మెడలో పంచపాండవులూ తాళికట్టారు. కనుక ఒకే ముహూర్తంలో ద్రౌపది పంచపాండవులకూ ధర్మపత్ని అయింది. అయిదుగురియందు సమానముగానే తన పాతివ్రత్యాన్ని నెరపి తనమూలంగా (కయ్యానికి కారణము కాంత అన్నారు కాబట్టి) అన్నదమ్ముల అయికమత్యానికే మాత్రము భంగమురాకుండా చూసుకున్న ద్రౌపది పతివ్రతగాక, ఒక్క మొగుడుకే అనుకూలంగా నడచుకోలేక విడాకుల నామస్మరణ చేస్తున్న నేటి నాగరికయువతి పతివ్రత అవుతుందా? మరి ద్రౌపదితో ఎందులో సమానఅవుతుంది నేటి యువతి?

తను ప్రాణసమానంగా ప్రేమించిన పురుషుడు పోవటముతో (అటువంటి ప్రేమ వకసారే పుడుతుంది.) జీవచ్ఛవముగా బ్రతుకలేక తనంతటతాను సహగమనముచేసేది తను మనసారా ప్రేమించిన పురుషునితో. అందుకు ఇష్టములేనివారు బ్రతికే వుండేవారు. అంతేకాని రచయిత్రి వుద్దేశాను సారము ఆదికాలంలో బలవంతంగా సహగమనము చెయ్యమని ఏ స్త్రీని ఎవరూ బలవంతము చెయ్యలేదనేందుకు వాల్మీకి రాసిన రామాయణంలో దశరథుడుపోగా సహగమనము చెయ్యని కౌసల్య, కైక, సుమిత్రలే నిదర్శనం. సహగమనము చేసేవారి యిష్టము మీద ఆధారపడి వుందనేందుకు పాండురాజు చనిపోగా మాద్రి సహగమనముచేస్తే బ్రతికిన కుంతి దృష్టాంతము (వ్యాసుడు రాసిన భారతంలో)-కాలము గడచినకొద్దీ మంచి ఆచారమనేది మాసిపోయి - చెట్టుడుగు కాలానిక్కుక్కమూతి పిందెలన్నట్లు-కొన్ని దురాచారాలు ఆ పేరుతోనే చెలామణి అవుతాయి. సరిగ్గా సహగమనము విషయంలో యిల్లాగ జరిగి,చావంటె భయపడే వారను కూడా బలవంతాన చంపటముకాడికి వచ్చింది. సంఘానికి చీడపురుగులాంటి దురాచారాలు వాటి అంత్యానికే ప్రబలుతాయి. ధర్మచ్యుతికల్గి ఆ ధర్మానికే కళంకము కల్గినప్పుడు కొందరు మహాపురుషు లుద్భవించి ధర్మాన్ని ఉద్ధరిస్తారు. అల్లాగ రాజారామమోహనరాయలు జనించి ఆ దురాచారాన్ని మాన్పారు. అల్లాగ వితంతు వివాహాలవిషయంలోకూడా కందుకూరి మేలు చేసినప్పటికి, వితంతువయిన ప్రతి స్త్రీ ద్వితీయ వివాహము చేసుకోటము లేదని మనము గమనించాలి. కారణాలు రకరకాలుగా వున్నాయి. ప్రథమ

అడుసు త్రొక్కనేల? కాలు కడుగనేల?

వివాహానికి కట్నమివ్వనిదే వరుడు లభించని వనితకు ద్వితీయాన్కి తేలిగ్గా వరుడు లభించకనో, కొన్నాళ్లు కాపురము చేసిన స్త్రీ ఆ భర్త మధురానుభూతులు మరువలేకనో, తను ద్వితీయ వివాహము చేసుకోటము వలన అంతకు ముందున్న తన పిల్లల మనుగడ కష్టమవుతుందనో, ఏమైతే ఏమి పతిసుఖ మెరుగని బాలికలు తప్ప, మిగతావారు ద్వితీయానికి ఒప్పుకోటములేదు. అనాదినుంచి నూరు మనువులున్న పాటక స్త్రీలు కూడా సామాన్యంగా మారుమనువులు చేసుకోరు. మా పని చేసే అప్పలమ్మకు ముగ్గురు పిల్లలు. చిన్నతనంలోనె మొగుడు పోయాడు. మారుమనువుకి వెళ్ళలేదు. కారణము తను మారుమనువుకివెళ్లినట్టయితే, ముందుకలిగిన తన పిల్లలని ఎవరూ సరిగా చూడరని. మూడేళ్ల క్రిందట పనిచేసి మొగుడు కొట్టిన దెబ్బలకు కళ్లు హూనముకాగా పని మానేసిన నల్లమ్మని ఓరోజు అడిగాను: మీకు మారు మనువులున్నాయి కదా? ఇల్లా చావు దెబ్బలు తినకపోతే, మారుమనువు కెళ్లక పోయావా? అని. అదిఅంది: "తాగిన కాసేపే తిన్నతాడు కానీ ఆడు బంగారం! మళ్లా మనువుకిపోతే ఆడు మటుక్కు బుద్ధిగా వుండద్దూ?" ఏనాగరికతా లేని స్త్రీలు మారుమనువుకి అవకాశముండీ కూడా ఒక మొగుడుతో సంసారము చేస్తూంటే, నాగరికుల మనుకు నే మనము నిన్న మొన్న విడాకుల బిల్లు తెచ్చుకుని మొగుడు ఆజ్ఞలో పడి వుండాలని వుందా ఏం విడాకుల బిల్లుండగా అనుకోటము ఎంత అవమానకరము?

హత్యలేనా! ఆత్మహత్యలేనా, మునుపటికన్నా ఇప్పుడు ఎక్కువగా జరుగుతున్నాయనేందుకు సందేహపడక్కరలేదు. ఆత్మహత్యల్లో ముప్పాతిక మూడుపాళ్ళు కన్య అజ్ఞానంతో కాలుజారినందువల్ల; మిగతావి గృహ కల్లోలాలకు సంబంధించినవి.

రచయిత్రి దృష్టిలో కన్యలంతా కాలు జారినవారుగా కనుపించటముహాస్యాస్పదము. ఈరోజులలో సకాలంలో తగినవరుడు లభించక దుర్భరంగా కాలముగడిపే కన్యలకు వారికి త్వరలో వివాహము చెయ్యలేక కృంగుతున్న తల్లిదండ్రులకి కన్యలంతా కాలుజారని వారేనా అన్న ప్రశ్న గొడ్డలి పెట్టులాంటిది. వనితాలోకానికే అవమానకరమైనదీ ప్రశ్న. ఆవిడ రాసినట్లుగా ప్రతి కన్యా కాలుజారినవాడు తల్లిదండ్రి తదితరులతోపాటు ప్రకృతికూడా క్షమించి కడుపులో పెట్టుకుంటూండా!

నిన్న మొన్నటి సంగతి. మాకు బాగా తెలిసిన వారు కళావంతులలో ఒకరున్నారు. పెండ్లి అయిన 7 నెలలకే భార్యకు ఆడపిల్ల పుట్టింది. దానితో ఆ అమ్మాయిని వదిలేసి మళ్ళీ పెళ్లి చేసుకున్నాడు. మీరు కళావంతులేగదా! ఏమైనా పొరపాటు జరిగినా తప్పేమిటి? అదీకాకుండా కొంతమందికి 7 వ నెలలోనే పుడుతుంటారని నచ్చచెప్పబోతే, మేమేమి వృత్తిలో లేము. పెళ్ళిఅన్న తరువాత పెళ్ళే. కాదంటే నెలకి 10, 15 రూ. తిండికి పంపిస్తానన్నాడు అతను. బంగారంలాంటి కాపురము పోయిందని ఈ నాటికీ వాపోతుందాపిల్ల. స్త్రీ పురుషులిరువురు సమానులైనప్పుడు పురుషుడు చేసిన తప్పు స్త్రీ ఎందుకు చెయ్యకూడదంటే, కాలు జారిన స్త్రీకి ప్రకృతి విధించినముద్రని పురుషునికికూడా ప్రకృతి విధించిననాడు రచయిత్రి చెప్పినట్లుగా స్త్రీ పురుషులిరువురూ సమానంగా తప్పులు చెయ్యవచ్చు. అంతదాకా ఇతర రంగాల్లో స్త్రీ పురుషులు సమానులనుకొన్నప్పటికీ, కాలుజారటములో మటుకు పురుషునితో సమానులు కాకండి. అడుసు త్రొక్కటము కాలు కడగటము ఎందుకు కన్యలారా? మెళ్ళోతాళి కట్టనిదే పురుషుల తీయని మాటలకు లొంగి తప్పటడుగు వెయ్యకండి అని చెప్పటము పిరికి

అసూయా, అహంభావమూ!

ఎదటివారు పచ్చగావుంటే చూసి ఓర్వలేని తనము, అంటే, అసూయ, మనలోచాలా మందికి వున్నదే. అలాగని అందరూ అలాంటివారే వుంటారని చెప్పడంకాదు. ఎవరికివారే మిగతావారందరికన్నా మిన్నగా వుండాలని అనుకుంటూవుంటారు. అంటే superiority complex ఫీలవుతూ వుంటారు. అంతటితో సరిపోకుండా అటువంటివాళ్ళకు ఐశ్వర్యం కలసివస్తే ఇక వారికి పట్టపగాలే వుండవు. ఆ సిరిసంపదల ముచ్చటలోపడి ప్రాణస్నేహితుల్నికూడా మర్చిపోయే వారున్నారంటే చాలా సిగుపడాల్సిన విషయం. పురుషులతో సమానత్వంకోసం పాటుపడుతున్నామే, కాని మనలోమనం ఒకర్నిఒకరం ఎలా గౌరవించుకుంటున్నాము? అని ప్రశ్నించుకోవాలి. ఒక అమ్మాయే వుందనుకోండి. ఆ అమ్మాయి ఏదో ఆఫీసులో గుమాస్తాగానో, టైపిస్టుగానో లేక ఏస్కూలు టీచరుగానో వుంటుంది. ఇక ఆ అమ్మాయిపాట్లు చెప్పతరం కాదు. ఆఫీసులో మేనేజరూ, హెడ్ గుమాస్తా, వాళ్ళవద్దనుండి బయటపడేసరికి క్రూరజంతువుల మధ్యనుండి తప్పించుకున్నట్టుగా వుంటుంది. ఇక యింటికి వచ్చేలోగా ఆమెమీద ఒకవంద కామెంట్సు యినా ప్యాసవుతాయి. అందులో మన ఆడవాళ్ళదే పైచేయి. అయితేమగవాళ్లదికూడా లేదని కాదు కాని వారుచాలాతక్కువ. త్రోవలో అమ్మలక్కలు "మగరాయిడిలా ఉద్యోగం చెయ్యడమేమిటమ్మా?" అనిఒకరు, "అయినా తనే మహాఉద్యోగం చేస్తున్నట్లు యింత గర్వమా?" అని ఒకరు, ఇలా యిష్టమొచ్చినట్లు తలోకమాటా అంటారేగాని, ఆపిల్ల ఎటువంటి పరిస్థితులలో ఉద్యోగం చేయడానికి పూనుకుందో ఆలోచించరు. అదే జ్వరంవల్ల రెండు రోజులు లేవలేకపోతే జావయినా కాచియిద్దామని తలచరు. దిక్కులేనివారికి దేవుడే దిక్కన్నట్లు ఆపిల్లకి సహాయపడేవారుకూడాయుంటారు. యింక చదువుకున్న అమ్మాయే వుందనుకోండి. "ఎంత అహంభావమమ్మా? మహా బి. యే చదివితేమాత్రం అంత టెక్కా? ఏమైనా చదువుకున్నవాళ్ళకదా ఆ మాత్ర గర్వం ఉంటుందిలే" అని అంటారు. ఆ అమ్మాయే కొంచెము సోషలుగా వుంటే, అంత సిగ్గూ బిడియమూ లేకుండా

శ్రీమతి ఎన్. ప్రేమజ్యోతి


అందరి దగ్గరా అలా తిరుగుతుందేమిటమ్మా?" అని ఆశ్చర్యం ప్రకటిస్తారు. ఇలా ప్రతీదానికీ వంకపెట్టడం మన ఆడవాళ్ళలోనే ఎక్కువఅనడానికి సందేహంలేదు. ఇందులో యింకొకరకం వారున్నారు. ఎవరయినా ఏదయినా ఒక కొత్తనగ పెట్టుకుని వస్తారనుకోండి. చూసి వూరుకోక ఇది ఎన్ని తులాలు వుంటుందమ్మాయ్? అని అడిగేస్తారు. మనం చెప్పేలోగానే బహుశా రెండు తులాలు ఉండవచ్చు అన్న నిర్ణయం కూడా చేసేస్తారు? అది ఏ మూడు నాలుగు తులాలదో అయితే, ఈవిడన్న మాటలకు ఆవిడ ఎంత ఫీలవుతుందో వేరే చెప్పనక్కరలేదు. ఇలాగే ఒక పేరంటంలో ఒకావిడ ఇంకొకరని "నీ చీర ఎంత అయింది అమ్మాయ్? అని అడిగింది. ఆవిడ పాతిక రూపాయలని చెప్పడంతడవు "అబ్బే అంత ఖరీదేమిటమ్మ మొన్న నే మా యింట్లో వున్నావిడ కొనుక్కుంది, ఇరవై రూపాయిలే అయింది," అనేసింది. యీమె మాటలకు ఆవిడ నీరుగారి పోవాల్సిందే. ఇంతట్లో ఆవిడకు పోయేదేమీలేదు, యీవిడకు వచ్చేదేమీలేదు. అదొకరకం ఈర్ష్య, చులకన భావమో తెలియదు.

ఒకసారి మా స్నేహితులయింటికి వెళ్లేము. వాళ్ళు మాకన్న సంపన్నులే. అయినా స్నేహితులుకదా అని వెళ్లేం. తీరా వాళ్ళింటికి వెళ్ళిన తరువాత ఎందుకొచ్చామురా భగవంతుడా? అనిపించిందంటే నమ్మండి. మేము వెళ్ళగానె మమ్మల్ని (నేను మా స్నేహితురాలు) ఒక గదిలో కూచోపెట్టి ఆ యింటివాళ్ళు ఎక్కడకు వెళ్ళిపోయారో తెలియదుకాని, సుమారు ఒకగంటసేపు చూసి మేము వెళ్ళిపోతున్నామని కేకవేస్తే వచ్చి "ఆహా! మంచిది," అంటూ మేమింకా వెళ్లకుండానే తిరిగీ లోపలికి వెళ్ళిపోయిందావిడ. వాళ్ళకన్న తక్కువవారే అవుగాక, కాని తీరా యింటికి వెళ్తే చేయవలసిన మర్యాదా యిదేనా? అలాగని అందరూ అలాంటివారే వుంటారని నా ఉద్దేశ్యం కాదు. యిటువంటి అహంభావాన్ని మనం అంతరింపచేస్తేనే మనం బాగుపడతాము.

ఇంకా ఇంకొకరకంవారు కూడా వున్నారు. వారు ఎదుటవారిని ఎలా కించపరచడమా అని ఆలోచిస్తూ వుంటారు. మాకు తెలిసిన ఒకమ్మాయి వుండేది. ఆ అమ్మాయి భర్త గుమాస్తాగా పనిచేస్తూ రయిల్వేలోకి వెళ్ళిపోయాడు. ఇలా ప్రమోషను వస్తే కొంతమంది సంతోషిస్తారు. కాని పై చెప్పిన రకం వాళ్ళున్నారే, వాళ్ళుముఖం ముందే అనేస్తారు నోటికొచ్చినంతాను. ఆ అమ్మాయి చేసుకున్న పూర్వజన్మపుణ్యంవల్ల భర్తకు మంచి ఉద్యోగమయితే పాపం ఆ అమ్మాయిని ఆడిపోసుకునేవాళ్ళు. మనలో మన మీదే ఇలా ఈర్ష్య, అసూయా, అహంభావమూ అన్నవి ఎప్పటికయినా వదిలిపోతేనేకాని మనకు పురుషులతో సమానత్వంరాదు. పురుషులుకూడా మనల్నే వ్రేలెత్తి చూపిస్తారు. ★

మందు పొయ్యటము కాదు. ముందుజాగ్రత్త తీసుకోటము అబలత్వాన్ని అంగీకరించటమూ కాదు.

వెనుకటికి ఒక యిల్లాలు ద్వితీయ వివాహము చేసుకుందిట. ఆ భర్తకీ ద్వితీయ మేట. ఇద్దరికి మొదట సంతానముందట. తర్వాత వీరిద్దరికీ సంతానము కల్గిందట. ఒకనాడు ఆ పిల్లలు పోటాడుకుంటున్నారుట. అపుడా భార్య అందిట భర్తతో మీ పిల్లలు, నా పిల్లలుకలసి మనపిల్లలిని కొడుతున్నారని. ఆ పరిస్థితి తల్చుకుంటూనే అసహ్యంగా వుందే, భారతనారీశీలమే హిందూ దేశాభివృద్ధికి మూలమని విదేశాలలోకూడా చాటిన వివేకానందలాంటి మహామహుల ఆశయాల్ని, పవిత్రమైన తమ శీలాన్ని వనితలు నమ్ముచేసుకున్ననాడు, నిజంగా హిందూ దేశానికి అంత్యకాలమే ప్రాప్తిస్తుంది. ★



అంతా దగా - మోసం!

ఈ రోజులలో ప్రతి మనిషి దగా చేయందే వర్తకము చేయడంలేదు. పేపరు కొనేవాడి దగ్గరనించి, సూదులమ్మే మనిషి వరకు అంతా మోసము చేయటానికే ప్రయత్నిస్తారు కాని, న్యాయమార్గముగా అమ్ముదామనే ధ్యాసే లేదు. ప్రతి మనిషిని నమ్మటకు వీలులేదు. ప్రతి మనిషిని అంటే వర్తకము చేసేవాళ్లే సుమండి. ఆ మధ్య ఒక సోదరి, పేపర్లు కొనేవాడు తక్కెడ పట్టుకోటంలోనే తెలుస్తుంది దగా అంతా అని వ్రాశారు. కాని మన కళ్ళల్లో కారం కొట్టి పేపర్ల మధ్య రాళ్లు, అవీ పెట్టి తూచి దగా చేస్తున్నారు. మొన్న మా యింట్లో ఉన్న పేపర్లు అమ్ముదామని పేపర్లు కొనుక్కునేవాడిని పిలిచాము. వాళ్లు ముగ్గురు ఉన్నారు. మా యింట్లో 10 వీశల పేపర్ల వరకు ఉంటాయి. ఒకడు తక్కెడ తీసుకుని వచ్చి ఒక ప్రక్క తక్కెడలో అరవీశ రాయి, ఒక ప్రక్క తక్కెడలో అరవీశ పేపర్లు పెట్టి తూచాడు. యింకొకడు పేపర్లన్నీ బొత్తుగా పెట్టి తూచేవాడికి అందిస్తున్నాడు. మూడవవాడు వీళ్ళిద్దరి మధ్యన కూర్చుని తక్కెడలో తూచిన అరవీశ పేపర్లు తీసుకుని ఆ పేపర్ల మధ్య ఒక వీశరాయి పెట్టి (మాకు కనపడకుండా) ఆ పేపర్లను తక్కెడలో అరవీశరాయి వేసిన దానిలో వీశరాయి పెట్టిన అరవీశ పేపర్లు పెట్టాడు. అప్పుడు మన లెక్క ప్రకారము మనము ఒక వీశ అనుకుంటాము. కాని ఆవీశ రాయి మధ్య పెట్టినందువల్ల వాళ్ళకు రెండు వీశల పేపర్లు ఒక్కొక్కసారి వస్తున్నాయి. మనకు ఒకసారి వాళ్లు తూచేసరికి వీశ పేపర్లు నష్టము వస్తున్నాయి. వాడు ఆ రాయి పెట్టేటప్పుడు మేము అక్కడ ఉంటే చూస్తామని మమ్మల్లను లోపలికెళ్ళి ఇంకా పేపర్లు తీసుకురండి వెళ్ళండి అంటున్నాడు. కాని అందర్నీ ఎందుకు లోపలకు పొమ్మంటున్నాడోనని నాకనుమానముగానే ఉండి మిగిలిన వాళ్లను లోపలికెళ్లి పేపర్లు తెమ్మని చెప్పి నేనక్కడే ఉండి చూస్తుంటే ఇంతలో వాడు పేపర్ల మధ్యన రాయి పెట్టటం నాకంటపడింది. నేను ఎందుకయ్యా! ఆ రాయి పేపర్ల మధ్యన పెడ్తున్నావ్ అన్నాను. కాని వాడు తిరిగి మాట్లాడితేనా! ఆ! ఏం లేదు, ఏం లేదు అంటూ వాళ్లు ముఖంఅన్నా తిరిగిచూపకుండా, నేను ఎన్ని తిట్లు తిట్టినా నోరెత్తకుండా గబగబా మెట్లుదిగి ముగ్గురూ పారిపోయారు. యిది జరిగి యిప్పటికి యిరవై రోజులైనది. యిప్పటివరకు ఆ ముగ్గురిలో ఒక్కడుకూడా ఈ వీధికి రాలేదు. యిదీ పేపర్లు కొనుక్కునేవాడిదగ్గర దగా! ఇంకొక మోసం ఏమిటంటే ఒక చీపుళ్లుఅమ్మే మనిషి అన్ని చీపుళ్ళు అమ్మేసుకున్నాక 20 చీపుళ్ళు ఉన్నప్పుడు మా యింటికివచ్చి చీపుళ్ళుకావాలా అని అడిగింది. 20 చీపుళ్ళకు ఒక రూపాయి యిమ్మన్నది. మా అమ్మగారు మూడు పావలాలు యిస్తానన్నారు. అది యివ్వనని వెళిపోయింది. 5 నిముషములలో తిరిగివచ్చి తీసుకోండి మీరు చెప్పిన ధరకేనని చీపుళ్లకట్ట అక్కడపడేసి డబ్బు తొందరగా యివ్వండి అంటున్నది. మా అమ్మ డబ్బుతెచ్చేలోపుగా లెక్క పెట్టి చూద్దామని లెక్క పెట్టిస్తే 15 చీపుళ్లే ఉన్నాయి. యిందాక 20 ఉన్నాయి, యిప్పుడు 15 ఉన్నాయి అని అంటే యిందాక తప్పు లెక్క పెట్టారు, ఈ అయిదు నిమిషాలలో నేనెక్కడ అమ్ముకున్నాను అని మామీద దెబ్బలాడుతూ తిరిగి చీపుళ్ళన్నీ కట్టకట్టుకుని వెళ్లిపోయింది. కొంచెము దూరము వెళ్ళి ప్రక్క మలుపులో పెట్టిన మిగిలిన అయిదు చీపుళ్లు పెట్టి కట్టకట్టుకుంటున్నది. నేను గేటుదగ్గరకువెళ్లి చూస్తే అది చేసేపని కనపడింది. ఇల్లాగఉంది ఈ కాలం దగా-మోసమూను! ఏ వస్తువైనాసరే మన యిళ్లదగ్గరకు అమ్మొచ్చేది చాలా జాగ్రత్తగా చూసికోవాలి. పేపర్లు కొనేవాళ్ళు, చీపుళ్లు, సూదులు అమ్మేవాళ్లందరి దగ్గరా దగా-మోసమే!

—కిడాంబి సత్యవతీదేవి, ఏలూరు.]

నేటికథల్లో నిరుద్యోగి!

పనీపాటా లేక నిరుద్యోగి బిరుదు తీసుకున్న ఒక యువకుడు ఉద్యోగం కోసం ఆఫీసులచుట్టూ తిరుగుతుంటాడు. ఇది మనం పుస్తకం విప్పి కథ మొదలుపెట్టగానే చదివే వాక్యం. ఎక్కడికి వెళ్ళినా అతడికి 'నో వేకెన్సీ' బోర్డ్ ఎదురవుతుంది. అతగాడు కాస్త పెంకిఘటం అయితే లోపలిదాకా వెళ్ళి తన క్వాలిఫికేషన్లన్నీ ఏకరువుపెట్టి, అధికారిచేత నాలుగు చీవాట్లుతిని, రచయిత అనుగ్రహమయితే ప్యూన్ చేతుల మృదుత్వాన్నికూడా చవిచూచి, చక్కా వస్తాడు. ఇంటికి రాగానే ఇల్లాలు కాళ్ళకు నీళ్ళు దాహం వగైరాయిచ్చి వెళ్ళిన పనేమయిందని ప్రశ్నిస్తుంది. అతడు చదువుతున్న కథల్ని గుర్తుకు తెచ్చుకుంటూ వేదాంత ధోరణిలో జవాబిస్తాడు. భార్య అతన్ని బుజ్జగిస్తూ భోజనానికి తీసుకుపోవటంతో వుక్కిరి బిక్కిరవుతున్న పాఠకులు మరో వాక్యం మొదలుపెట్టే దాకా వూపిరి పీల్చుకుంటారు.

రచయిత ఆజ్ఞానుసారం అతడికి విధిగా 'కాదు రమ్మంటున్న' రిటైరయిన తండ్రీ తాళికోసం కాచుకూర్చున్న చెల్లాయీ ఉంటారు. దారాలు వేలాడే మాసిపోయిన పాంటు, తైల సంస్కారంలేని జుట్టు, మాసిన గడ్డం వుంగటాలు తెగి మడమలు అరిగిపోయిన చెప్పులువగైరా రూపురేఖాదులతో అతని వేషభాషలే అతను నిరుద్యోగి అని చాటాలి. ఏ కాఫీహోటలు ముందునుంచో పోతుంటే సమయానికి అతనికి ఆకలి వెయ్యాలి. కానీ ఖాళీజేబు, 'నిరుద్యోగి' డిగ్రీ అతని ఆకల్ని అణచివేస్తాయి. పార్కులోకి వెళతాడు. కమ్మని సంగీతం రేడియోలో ప్రసారమవుతుంది. ఆ మాధుర్యం అతని చెవికి సోకదు. విసిగిన అతడి ప్రాణానికి ఆత్మహత్య చేసుకుందామా అనిపిస్తుంది. కానీ రచయిత వర్ణనతో కూడిన అంతర్వాణి ప్రబోధం. ఆ ప్రయత్నాన్ని మాన్పిస్తుంది. రచయిత ఆదేశం ప్రకారం పక్షులు గూళ్లకి చేరుకునే వేళ, పశువులు శాలలకి చేరుకునే వేళ, భాస్కరుడు అసమించే వేళ, ఆ నిరుద్యోగి నిట్టూర్పులు విడుస్తూ, శూన్యంలోకి చూస్తూ కొంపకి తిరిగివెళ్లాడు. ఇలా సాగుతాయి మన కథలు. ఏకథ చదువుదామని మొదలుపెట్టినా జరిగే సంఘటనలూ వచ్చే పాత్రలూ అవే. మన రచనలు నవపంథా తొక్కాలి. కొత్త వర్ణనలే అయినా చదివిన విషయమే చదివీ చదివీ ఎన్నాళ్ళు?

—కుమారి కొల్లి మాధురి, ఖమ్మంమెట్టు.]

★

ఎక్కడివక్కడే గప్ చిప్!

ఈ నోరు వున్నదే మహా చెడ్డది. అదుపు వుంచకుండా దాని ఇష్టంగా వదిలితే, ఎంత పనేనా చేస్తుంది! గుఱ్ఱంకు కళ్ళెంలా మనం దాన్ని తగినవిధంగా వుంచి, సమయానుకూలంగా చెబితేనే సరి.

ఆ మధ్య మా మేనవదిన అకస్మాత్తుగా అత్తారింటినుంచి వచ్చింది: ఎవరూ పిలవకుండా చెప్పా పెట్టకుండా వచ్చిందేమో చూడగానే అందరికీ అదుర్దా వేసింది. ఇహ ఆవిడ బండిదిగినది మొదలు తనభర్త, అత్తా ఆడబడుచులమీద ఒకటే సాధింపు! వారి దురలవాట్లు, భర్తగారి మెతకతనము చెబుతూనే వుంది. ఏదో చిన్న మాట అత్త అంటే, భర్త సమర్థించాడని ఈవిడగారికోపం! ఈమె దృష్టిలో అతను వటి నోరులేనివాడు. ఆ కసికొద్దీ అందరితో తన భర్తగుణాలు వర్ణించినది. ఆ మాటలు తాత్కాలికమే: భార్యాభర్తలమధ్య పోట్లాట ఎంత కాలం వుంటుంది? మళ్లీ వారంరోజులకు భర్త వస్తే నవ్వుతూ వెళ్లిపోయింది! కాని ఆ చెప్పినమాటలు అట్లాగే నిలిచిపోతాయి. ఇప్పటికి మా అత్తయ్య మామయ్యకు అల్లుడు మెతకవాడు, కూతురు ఎంత కష్టపడుతుందో నన్న బెంగే! నిజానికి అతను అలాటివాడువాడు. ఏదో ఒక సారి తల్లిని సమర్థించినంత మాత్రాన, మా వదినెగారి ఆర్భాటము చూడండి!

చాలామంది ఇదే విధంగా నోరు జారుతారు. తర్వాత అంతా బాగానే వుంటుంది, కాని మాటలుమాత్రం నిలిచిపోతాయి.

అన్నా వదినలతో చిన్న పేచీవచ్చి వారి గుట్టుమట్టులన్నీ కొందరు అత్తారింట చెబుతారు. అప్పటివరకు కడుపులోని కసి తీరినా తర్వాత అత్తారు ఆ మాట పట్టుకు దెప్పినప్పుడు చూడాలి ఈవిడగారి ముఖం! ఎక్కడి విషయం అక్కడవదిలేసి, మంచిచెడ్డలు మనసులో దాచుకొనే ఓర్పు ఎంతైనా అవసరం. అప్పటి కోపాన అంతా ఏకరువు పెట్టి తరవాత బాధపడేవారు ఎంతమంది లేరు? భార్యాభర్తలలోనే దాచవలసిన కొన్నిరహస్యాలు వుంటాయి. పుట్టింట తమ అన్నా వదినలు ఊరికే కీచులాడుకుంటారనీ, అమ్మ నాన్న ఎప్పుడూ చెల్లికే బట్టలు పెడతారని కసికొద్దీ చెబుతుంటారు. ఒకసమయంలో ఆ భర్తగారే ఆవిషయంపట్టుకు మాటలనకపోడు. దీనితో మళ్లీ పేచీ:

పుట్టింటి విషయాలు అత్తింట, అత్తగారివిషయాలు తల్లి దగ్గర చెప్పడం చాలా చెడ్డపని. స్త్రీకి ఆ రెండిళ్ళు రెండు కన్నులలాంటివి. కాబట్టి ఏ కంటికి బాధకల్గినా ఒకటే, ఓర్చుకో లేదు గూడాను.

మొన్న మా చిన్నాన్నగారి కూతురు భర్తతో ఎన్నో విషయాలు చెబుతూ, రాత్రి వంటిగంటదాకా తమనాన్న రాడని తల్లి ఏమిఅనదని చెప్పింది. ఒకనాడు ఆఫీసులో పనివల్ల అతనూ రెండు గంటలదాకా రాలేదు. ఈవిడగారు సాధించటం ప్రారంభించింది. దానికి అంతకూ అతను మెల్లిగా సమాధానం చెబితే వింటుందా? దాంతో చికాకెత్తి, మీ నాన్నవస్తే మీ అమ్మ ముక్కినపెనులా పడివుండటము లేదా, నీవుమాత్రం ఏవిధంగా అధికం కనుక? నీవు పడివుండాల్సిందే అన్నాడు. పుట్టింట తల్లిని తండ్రినీ అన్నాడని వారంరోజులు కోపంతో పడుకుంది! దానికి బాధ్యులెవరు? ఇంతకీ చేసుకున్న వారికి చేసుకున్నంత మహాదేవా! ★

—ఎం. రాధాదేవి]

బహుదూరపు బాటసారి...

కుమారి పుష్ప

సుమారు రెండు సంవత్సరాల క్రిందట. (సరిగ్గా చెప్పాలంటే, 1955 డిసెంబరు నెల) అవినేను స్కూలుఫైనలు చదివే రోజులు. హయ్యర్ ఫారమ్ గర్ల్స్ అందరం ఎక్స్కర్షనుకి వెళ్లాలనుకున్నాము. ఎలానూ స్కూలువాళ్లు మనిషికి రూపాయిచొప్పున ఎక్స్కర్షను నిమిత్తమె ఇస్తారు. అందరం నిర్ణయించుకొని ఒక మాష్టరుగారిని సహాయం తీసుకుని సాలూరుకి 12 మైళ్ళదూరంలో వున్న బొబ్బిలికి వెళ్దామనుకున్నాము. నిజానికి బొబ్బిలికంటే సాలూరే పెద్దది. కాని బొబ్బిలిలో సుగరుఫాక్టరీ, బొబ్బిలి కోట, మరికొన్ని చూడదగిన స్థలాలున్నాయి.

ఒక ఆదివారం రోజున టీచరుతో కలిపి పదిమందిమి సాలూరులో ఉదయం ఆరున్నర రైలులో బయలుదేరి 7 గంటలకు బొబ్బిలి చేరుకున్నాము. ఉదయం 12 గంటలవరకు సుగర్ ఫాక్టరీ బొబ్బిలి హైస్కూలు, చేపల చెరువు మరికొన్ని స్థలాలు చూసి 12గంటలయే సరికి ఒకహోటల్లో భోజనం చేశాము. గంట విశ్రాంతి తీసుకున్నాక మళ్ళాబయలుదేరి మాకు తెలిసిన వాళ్ళింటికి వెళ్లి రాజాగారి "గెస్టుహౌసు" చూడ్డానికి వెళ్ళాము. అక్కడికి వెళ్ళేసరికి 4 గంటలయింది. గెస్టుహౌసు అంతాచూసి 5 వరకు అక్కడ గడిపేశాము. మళ్లా 6 గంటలకి సాలూరికి రైలువచ్చింది. వూళ్లోకి వెళ్ళక తిన్నగా స్టేషనుకి వచ్చేసరికి పావుతక్కువ ఆరు అయింది. అప్పటికే బండి స్టేషనులోవుంది. అందరం వెళ్ళి ఒక పెట్టెలో కూర్చున్నాం.

సాలూరునుండి బొబ్బిలి రైలు సరియైన టైములో నడవదు. అప్పటికి ఆరుంపావు అయిందిగాని రైలు బయలుదేరలేదు. బండిలో కూర్చున్నమాకు ఏమీతోచకుండా వున్నది. మళ్లా వూళ్ళోకివెళ్తే రైలువెళ్లిపోతుందేమో ననిభయం. అందుచేత ఎలాగో ఆ పెట్టెలోనే కాలం గడిపేద్దామనుకున్నాము. మాలో కొంతమందిమి బాగాపాడే వాళ్లమున్నాము. కాలక్షేపానికి వచ్చిన వాళ్లము పాడుతున్నాము. మిగతావాళ్లు కూడ హుషారుగావుంది కాబట్టి అందరూ కూని రాగాలు తీస్తున్నారు.

పనిలేకపోయినా రైలు పెట్టెల దగ్గర ముఖ్యంగా ఆడవాళ్ళ పెట్టెల దగ్గర తిరిగే మహానుభావుల్ని మనం చూస్తూనే వుంటాం. అట్లాగే మా పెట్టె ముందర కొంచెం దూరంలో ఒక "జట్టు" తయారయింది. మా పాటల్ని వింటూ తిన్నగా కూర్చోక మా స్నేహితురాలు పాడుతుంటే "అబ్బ! ఎంతబాగుందిరా! గాడిదలువచ్చేస్తున్నాయి!" అన్నాడు.

సిగ్గా - సింగారమా

(36-వ పేజీ తరువాయి)

విషయాల దగ్గరా సిగ్గుపడి ఏడిస్తే, అందం చందం ఏమయినా వుందా? లోకో భిన్న రుచిః. ఒకరికి నచ్చిన మోడల్ మరొకరికి నచ్చదు. అందరకూ నచ్చిన మోడల్ అసలు ప్రపంచంలో ఉండనే వుండదు. ఈలాంటి విషయాలలో మనకు నచ్చితే చాలు—అందరకూ నచ్చినట్లే అనుకొని సంతృప్తి పడాలి. ఈలాగే అనవసరంగా సిగ్గుపడిపోయి ఎమ్మే ఫస్ట్ క్లాసులో పాసయిన అన్నయ్య ఫ్రెండొకరు మంచి ఉద్యోగం ఛాన్సు పోగొట్టుకున్నాడుట.

ఎమ్మే ఫస్టున పాసైన అన్నయ్య ఫ్రెండు బాధ్యతాయుతమైన ఓ పెద్ద ఉద్యోగానికి దరఖాస్తు పెట్టాడుట. ఇంటర్వ్యూ రాగా బాగా జబర్దస్తీగా టై—యిత్యాదులు కట్టుకొని యింటర్వ్యూకి వెళ్ళాడట. ఇంటర్వ్యూ ఆఫీసరు అతగాడిని చూడగానే—"అబ్బాయ్! నీవు టై అంత వికారముగా కట్టుకున్నావేమిటి?" అనడిగాడట. అన్నయ్య ఫ్రెండు మరీ సిగ్గుపడిపోయి టై విప్పుకొని తిరిగీ కట్టుకున్నాడట. "అబ్బే! అసలు టై నీకు అందంగా లేదు," అన్నాడుట ఆ ఆఫీసరు. ఆ అబ్బాయి మరింత సిగ్గుపడిపోయి పొంతం టై వూడలాగి పారేసి ఫాంటు జేబులో పెట్టుకున్నాడుట. "బాగుంది గానీ, మిస్టర్! ఒకరు చెప్పినట్లు చేసేవాడికి బాధ్యతాయుతమైన ఈ ఉద్యోగాన్ని ఎలా ఇవ్వమంటావ్?" అన్నాడుట ఆ ఆఫీసరు. ఎమ్మే ఫస్టు క్లాసులో ప్యాసైన ఆ అబ్బాయి తల వంచుకొని బయటకు చక్కా వచ్చేశాడట. తర్వాత బి. ఏ. చదివిన అబ్బాయి కెవరికో ఆ ఉద్యోగం ఖాయం అయినట్లు అన్నయ్య చెప్పాడు.

కొన్ని కొన్ని విషయాలలో అందం కన్నా—అలంకారం కన్నా సిగ్గు స్త్రీకి స్వచ్ఛమైన సింగారాన్ని ప్రసాదించే మాట నిజమే. కానీ సందర్భాను సారంగా సిగ్గుపడితేనే అందం చందం! తెలవారి లేచింది మొదలు తిరిగీ నిద్రపోయేదాకా అస్తమానం సిగ్గుపడటం ఏమీ బాగుండదు.


బావ అన్న మాటలకు సిగ్గుపడి మరదలు బుంగమూతి పెట్టి నవ్వుకొందంటే అందులో అందం వుంది. బుగ్గని చుక్క పెడుతున్నప్పుడు వధువు సిగ్గుపడి వరుణ్ని ఓరగంట చూచిందంటే అందులో అందం ఆనందం ఉన్నాయి. తననిగురించి ఎవరయినా పొగడుతూ ఉంటే "ఆ! ఏం గొప్ప ఉందండి నాలో! పెద్దలు మీరు చెప్పుకుంటానికి," అని సిగ్గుపడుతూ అన్నామంటే అందులో వినయం వివేకం ఉన్నాయి.

సరైనచోట్ల ఉపయోగిస్తే సిగ్గు సింగారమే అవుతుంది. లేకుంటే వెలికి చేష్ట అవుతుంది. ★

బహదూరాపు బాటసారీ...

అందులో ఒక గాయకుడు మాకు పోటీగా పాట ఎత్తుకున్నాడు "బహదూరపు బాటసారీ..." అని ఆగిపోయాడు. తనపాట తనకే నచ్చలేదు కాబోలు. అందరికినవ్వువచ్చేస్తుంది.

అయినా మేము ఆపుకున్నాము. బాటసారీతో విరమించేశాడు. వాళ్ళుమీకు పోటీగా పాడేటప్పుడు మీరు ఎందు కూరుకోవాలి? ఓపాటపాడమ్మా అని మా మాష్టరుగారన్నారు. అప్పట్లో క్రొత్త పిక్చరయి "నాగిన్" లో, "మెరదిల్ యెపుకారె అజా" అన్నపాటను నేను ఎత్తుకున్నాను. మేమేంతీసిపోయామా అని వాళ్ళలోవాళ్ళు గుసగుసలాడుకుని పాడనంటున్నా ఒక మహానుభావుణ్ణి ముందుకు తోసి, "ఈ సారి పద్యం చదవరా!" అన్నారు. అచ్చంగా ఘంటసాలలా పాడేద్దామని కాబోలు, "నేనొక పూలమొక్కకడ నిల్చి..." అంత వరకు వచ్చింది. అక్కడ నుంచి ముందుకి సాగలేదు, ఆ ఘంటసాలకి. దానితో వాళ్ళూ, మేమూ కూడ నవ్వేశాం. కనుచీకట్లో మాకు కనిపించలేదుగాని ఒక్కొక్కరి ముఖం మాడిపోయిన పెసరట్టులా అయిందనుకుంటాను! "జయంమీదే" నన్నట్లు రైలు బండి ఒక్క కూత కూసి బయలుదేరింది. అప్పట్నుంచి "బహదూరపు బాటసారీ" అని ఎవరైనా పాడితే, ఆనాటి సంఘటనే నాకు జ్ఞాపకం వచ్చి నవ్వువస్తుంది. ★



రాధ ప్రేమ

శ్రీకృష్ణు డొకనాడు
సింహాసనముపైన
చేరి రుక్మిణితోడ
చిరునవ్వుతోనుండె.

ఇంతలో రాధమ్మ
ఎంతో ప్రేమమ్ముతో
కంతుబోలిన కృష్ణు
గాంతునంచునువచ్చె.

రాధ కోరికదీర
రమ్మనుచు పిల్వగా
రాధకృష్ణుని చెంత
రాణివలె కూర్చుండె.

అది చూచి రుక్మిణికి
అంతరంగములోన
అంకురించె నసూయ,
ఆవరించిన దలుక,

ఇది యెల్ల గుర్తించి
ఎటులైన రుక్మిణికి
మంచి నీతిని గఱప
నెంచి కృష్ణుండనియె.

"ప్రేయసీ! రుక్మిణీ!
ప్రియమార నొకపాత్రి
వెచ్చ వెచ్చని పాలు
వేగిరము గొనిరమ్ము."

అని పల్కుటే తడవు
ఆ రుక్మిణీదేవి
బిర బిరా ఒకపాత్ర
మరుగుపాలను తెచ్చె.

పాలందుకొని చేయి
కాలి శ్రీ కృష్ణుండు
పాలు త్రాగు మటంచు
పలికి రాధకు నిచ్చె.

సంశయింపక రాధ
సలసలామనుపాలు,
చట్టున్న గొంతులో
అట్టె పోసుకు త్రాగె.

బొబ్బలెక్కుచు కాళ్లు
ఉబ్బె శ్రీ కృష్ణునకు;
మబ్బు లేని చంద
మామ రాధ ముఖమ్ము.

రుక్మిణి భయమ్ముతో
రోదించుచుండగా
ఆమెతో కృష్ణుండు
అనియె శ్రీ కళనిండ.

"ఏడువకు రుక్మిణీ!
నేడు కద సుదినమ్ము!
చేజేతులా నీవె
చేసి తపచారమ్ము.

ఏమందువా? నీకు
తామసము శ్రుతి మించె.
క్షేమమ్ము గూర్చునది
ప్రేమయొకటే సుమ్ము.

ఆమె హృదయము నీకు
అర్థమ్ము కాలేదు
ఆమె మదిలో జేరి
అరయుమా ఒకసారి.

కనెదు నా పదయుగళి,
వినెదు గజ్జెల రవళి,
కనెదు రాధిక సరళి,
వినెదు నా మధుమురళి."


అన్నంతనే ఆమె
వెన్నుని పదాబ్జమ్ము
లున్నరాధ యెడంద
కన్నులారా గాంచె.

తన తప్పు క్షమియింపు
మని యంజలి ఘటించి,
వినుతించె రాధమ్మ
ఘనత నారుక్మిణియు.

[ఆకెళ్ల సుబ్రహ్మణ్యం]

జ్ఞానోదయం

అద్వైతమతస్థాపకులైన శ్రీ శంకరాచార్యులవారి మహిమ దిగ్దిక్కులా వ్యాపించి ప్రజలను ఆశ్చర్యంలో ముంచివేసేరోజు లవి. శంకరాచార్యులవారు తమ శిష్య బృందంతో పల్లె పల్లె, వాడ వాడ, తిరుగుతూ తమ వాద పటిమతో చిల్లరమతాలను ఖండించి వేసే రోజులు. ఎక్కడవిన్నా శంకరుని స్తుతులే. ఇలావుండగా ఆచార్యుల వారి శిష్యులలో కొందరికి అహం భావము పెరిగి తాము కూడా శంకరు డంతటివారమని గర్వించ సాగారు. శంకరు డది కనిపెట్టి, అహంకార పూరితులైన శిష్యులకు జ్ఞానోదయ మయ్యేట్లు చేయాలని, సమయంకొరకు ఎదురు చూడ సాగాడు.



శ్రీ కాళహస్తీశ్వరాలయ ప్రధాన ప్రాకారం

పి. అనసూయ

ఒకనాడు శిష్యులందరూచూస్తుండగానే శంకరుడు కల్లుతెప్పించుకొని త్రాగాడు. ఆచార్యుడే సురాపానం చేయడం చూచి శిష్యులు కూడా తనివిదీరా కల్లుత్రాగి ఆనందించడం మొదలుపెట్టారు. ఆచార్యుడు వారిని పిలిచి "నాయనా, సురాపానం తప్పుకాదా?" అని అడిగారు. అజ్ఞానులైన శిష్యులు "స్వామీ, తమరు సేవించగా లేని తప్పు మేము త్రాగితే ఎలా వస్తుంది" అని బదులు చెప్పారు.

అందు కాచార్యు డేమీ జవాబు చెప్పలేదు. మరునటి రోజు కూడా అదేవేళకు శంకరునితోపాటు తాము కూడా కల్లు త్రాగవచ్చని శిష్యులందరూ ఎదురు చూడడం మొదలు

మేష్టరు: ఎందుకురా బడికివచ్చి? మక్కా లిరగ దన్నేవాడు లేక. పో! పోయి గొడ్లు కాచుకోక? (కాస్సేపు ఆగి) ఎక్కడికిరా వెధవా పోతున్నావ్?

కుఱ్ర: గొడ్లు కాయమన్నారు కదండి.


* * *

మే: ప్రపంచంలో విద్యను మించినది లేదు.

కు: మరేండి...మాష్టారూ... మానాన్న మా అమ్మతో డబ్బును మించింది లేదన్నాడండి.

—కె. గోకుల్ చంద్-విజయవాడ.

పెట్టారు. కానీ ఆనాడు ఆచార్యుడు స్వయంగా పాదచారియై కల్లు దుకాణంవైపు పోవడం చూచి శిష్యు లందరూ వెంబడించారు. వారనుకున్నట్లుగా శంకరుడు కల్లు దుకాణంలోనికి కాకుండా ఇనుప కొలిమిలోనికి పోవడం చూచి అర్థం కాక ఆయనతో పాటే కొలిమిలోనికి



శ్రీశైలంలో మహాశివరాత్రినాడు జరిగే భ్రమరాంబామల్లికార్జునుల కళ్యాణోత్సవం:

వెళ్ళారు.

శిష్యు లందరూ చూస్తుండగానే, కరిగి నలనల మరుగుతున్న ఇనుమును శంకరుడు గడగడ త్రాగివేశాడు. ఈ దృశ్యం చూడగానే శిష్యబృందం తెల్లముఖాలు వేశారు. శంకరుడు మాత్రం చిఱునవ్వుతో "నాయనలారా, కానీయండి, మీరూ త్రాగండి" అని అన్నారు. శిష్యులు తమ తప్పు తెలుసుకొని కాళ్ళమీదపడి "మీ మహిమను అర్థంచేసుకోలేని మూర్ఖులము. క్షమించ"మని ప్రార్థించారు. కనువిప్పు అయిన శిష్యులను చూచి శంకరుడు చిఱునవ్వుతో లేవనెత్తి "నేను చేసినట్లు చేయడానికి ప్రయత్నించవద్దు. నేను చెప్పినట్లు చేయడానికి పాటుపడండి. ఒకరిని అనుకరించడం మూర్ఖత్వం" అని బోధించారు.

ఆత్మజ్ఞానంకల శంకరుడు చేసిన ప్రతి పనిని తాము అనుకరించడంలో గల అజ్ఞానాన్ని శిష్యులంతా అప్పుడు గ్రహించారు. ★

బాహుదా నది

కె. ఆర్. కె. ప్రసాద్

చిత్తూరు జిల్లాలోని మదనపల్లె తాలూకాలో నిమ్మనపల్లె అనే కుగ్రామం ఉంది. నిమ్మనపల్లెలో చలమయ్య, వెంకయ్య అంటూ ఇద్దరు అన్నదమ్ములుండేవారు. కులంలో తక్కువవారైనా గుణంలో దొడ్డవారనిపించుకున్నారు. పుట్టుకతోనే దరిద్రులైనందువలన ధనవంతుల ఇండ్లలో పాలేళ్లుగా పనిచేస్తూ పొట్టపోసుకుంటూండేవారు. ఆ అన్నదమ్ములిద్దరికీ పెళ్లిళ్లయినా ఒకరితో నొకరు కలహించుకోకుండా ఎంతో గుట్టుగా కాలం గడుపుకొస్తూండేవారు. అన్నమీద అపారమైన గౌరవ భక్తులు వెంకయ్యకు. తమ్ముడంటే ఎడతగని ఆదరాభిమానాలు చలమయ్యకు. ఎన్నడూ అసత్యము పలుకక పూర్వజన్మలో చేసిన పాపానికి ఈ జన్మలో ఇలా గర్భదరిద్రులై పుట్టారేమో ననిపించేది చూచేవారికి.

వారి కా గ్రామంలో వున్న ఆస్తంతా ఒక పూరి గుడిసె, గుడిసె కెదురుగావున్న ఒక పెద్ద అంటు మామిడి చెట్టు. పెళ్ళి కాకముందు ఒకటిగావున్నా భార్యలవలన తాము అనవసరంగా కలహించుకోవలసి వస్తుందేమోనని వారిద్దరూ భాగాలు పంచుకున్నారు. మామిడి చెట్టులో కుడివేపు కాచిన కాయలన్నీ చలమయ్యవనీ, ఎడమవైపు కాచేవి వెంకయ్యవనీ అనుకుని ఒకరి భాగంలో ఒకరు చేయి చేసుకోక సుఖంగా జీవిస్తూండేవారు.

ఇలావుండగా ఒకసారి చలమయ్య పొరుగూరికి వెళ్ళాడు. వెంకయ్య మాత్రమే ఇంట్లో వున్నాడు. ఇంట్లో ఆడవారుకూడా లేనందున ఒంటరిగావున్న వెంకయ్యకు ఏదైనా తిందామా అనిపించింది. అలా అనిపించి మామిడిచెట్టు పరీక్షించి చూశాడు. అతని దురదృష్టంకొద్దీ ఎడమవైపు ఒక్కటికూడా పండు లేకపోయింది. దాంతో అతనికి విసుగేసి పోనీ చలమయ్య భాగంలో వున్నదేమో చూద్దామని వెళ్ళిచూశాడు. చాలాసేపు వెదికిన తర్వాత అతని రెమ్మల మధ్యలో బాగా పక్వమయిన ఒక మామిడిపండు కనబడింది. అసలే ఆకలిగావున్న అతనికి అంత పెద్ద పండును చూసేసరికి నోరూరింది. వెనక ముందులు చూడక పండుకోసి తిందామని చెట్టెక్కాడు. అసలే కాలంగాని కాలం; అందులోను దోరగా మాగిన మామిడిపండు; ఒంటరిగా వున్న వెంకయ్య అది

అన్నగారి వంటే అది కూడా తలచకుండా తినేశాడు.

తియ్యని ఆ అంటు మామిడి పండును పూర్తిగా తిని, టెంక పార వేయబోతూన్నపుడు, తను చేసిన పనిని గురించిన ఆలోచన అతనికి కల్గింది. తన సోదరుని అనతిలేక అతని భాగంలోని మామిడిపండు తినటం దొంగతనం కాక మరేమౌతుంది? అనే సందేహం కల్గింది. తను దొంగతనం చేశానన్న ఊహ కలగ్గానే అతని గుండెలు ఝల్లుమన్నాయి. దొంగతనము మహాపరాధమైన కార్యము. అలాంటిది తను దొంగగా తల యెత్తుకుని ఎలా తిరగ్గలడు? అందులోనూ ఏ పాపం ఎరుగని తన అన్నకు ఇకమీదట "దొంగ అన్న" అనే పేరు వస్తుందేమోనని ఆలోచనలతో అతనికి కంపర మెత్తింది. ఎలాగైనా ఇందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నాడు. అన్నిటికీ ఆ పరమాత్ముని పై భారంవేసి తన అన్నను క్షమాపణ వేడుకోవడమే సబబైందని తలపోశాడు.

పొరుగూరు వెళ్లిన చలమయ్య తిరిగి వచ్చాడు. అతనికి ఉల్లాసంగా వుండే వెంకయ్య దీనంగా వుండడం చూసేసరికి దిక్కుతోచక కారణమేమిటని అడిగాడు. ఎలా చెప్పాలో తెలియక తికమకపడి చివరకు తను పండుతిన్న వైనం అంతా చెప్పాడు.

అసలు తన భాగంలో ఒక మామిడిపండు వున్నట్టే తెలియని చలమయ్యకు ఏంచేయాలో తోచక

"తమ్ముడూ! మామిడిపండు రీత్యా చూస్తే ఇది దొంగతనం కాకపోవచ్చునేమో కాని, ఒకరి సొత్తును ఇంకొకరు అనుమతిలేకుండా వాడుకుంటే అది దొంగతనమే అవుతుంది. ఏమైనా, న్యాయం నమకూర్చేది రాజు. నీవు ప్రభువులతో జరిగిన సంగతి తెలియబఱచి శిక్ష విధించమని కోరుకో!" అని చెప్పాడు.

వెంకయ్య కూడా అన్నయ్య చెప్పిందే సరైందని తలుస్తూ వెంటనే కుప్పం సంస్థానాధిపతివద్దకు బయలుదేరాడు.

మరునాడే సంస్థానాధీశునివద్దకు వెళ్లి న్యాయభిక్ష పెట్టమని కోరాడు. పేరోలగంలో నున్న ఆ సంస్థానాధీశుడు నీకు కలిగిన జరిగిన నేరం తెలపమని అడిగాడు.

ప్రభువులవారు చిత్తగించాలి. ఇతరుల అనతిలేక, కేవలం తన అవసరాన్ని తీర్చుకునేందుకని, వారి సొమ్మును అపహరించినవారికే విధమైన శిక్ష నివ్వాలో దయచేసి శెలవివ్వండి" అని కోరాడు వెంకయ్య.

"అలా అపహరించినవాని కుడిచేతిని నరికివేయడమే వానికి తగిన శిక్ష" అని చెప్పారు మహారాజు.

"అలాగయితే ప్రభువులు మన్నించి ఈ దీనునికి ఆ శిక్ష విధించండి." అని వెంకయ్య కోరాడు.

సభాసదులు ఆశ్చర్యపోయారు. "ఇంకా ఎవరి విషయమో అడుగుతున్నాడనుకుంటూంటే తనే నేరం చేశానంటూ తనచేతిని నరకమంటాడేమిటి చెప్మా! ఇతనికి పిచ్చిపట్ట లేదుకదా" అనుకున్నారు వారు.

"అసలు నీ కెందు కలాంటిశిక్ష విధించాలి?" అని అడిగారు మహారాజు.

జరిగినదంతా విన్నవించాడు వెంకయ్య.

"ఇంతమాత్రానికే ఇంత కఠినమైన శిక్షా!" అనివాపోయారు సభాసదులు. అతన్ని వెళ్ళిపొమ్మంటూ బతిమాలారు. కాని ససేమిరా! 'నాకాశిక్ష విధించాల్సిందే'నని పట్టుపట్టాడు వెంకయ్య.

అతని పట్టుదలకు విస్తుపోతూ రాజుగారు విధిలేక అతని కుడిచేతిని తెగగొట్టించారు.

గ్రామానికి తిరిగి వచ్చిన వెంకయ్యను చూచి కన్నీరు మున్నీరుగా దుఃఖించారు ప్రజలు. కొందరు చలమయ్య కఠినాత్ముడని వాపోయారు.

మొండివాడుగా తిరిగి వచ్చిన తమ్ముని చూసి పెల్లుబికి వస్తూన్న దుఃఖాన్ని దిగమ్రింగుతూ చలమయ్య.

"తమ్ముడూ! నీవు చేసిన నేరానికి శిక్ష అనుభవించావు. ఇక నీవు వెళ్ళి నదిలో స్నానంచేసిరా!" అని చెప్పాడు.

వెంకయ్యకూడా నదిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. ఆశ్చర్యం! నదిలో మూడుసార్లు మునిగి లేవగానే, మునపటి లా అతనికి చేయి వచ్చేసింది. ఈ శుభవార్త విని ప్రజలందరూ ఆ అన్నదమ్ముల నీతిని వేనోళ్ళ కొనియాడారు.

చూశారా! ఆ అన్నదమ్ములు ఎంత గొప్పవారో! బాహువును దానం చేసినందువల్లే ఆ నదికి అప్పటినుంచి "బాహుదానది" అన్న పేరు వచ్చింది. ఇప్పటికీ చిత్తూరుజిల్లాలో ఈ నది పారుతూనే వున్నది. పెన్నానదికి ఉపనదిగావున్న ఈ బాహుదానదిని గురించి అక్కడివారు చలమయ్య, వెంకయ్యల కథను నేటికీ చెప్పుతుంటూనే వుంటారు. ★


న్యూఢిల్లీ లేఖ

(7 వ పేజీ తరువాయి)

దేశంలో ఏడాదికి నూటకోట్ల రూ. ల (7½ కోట్ల పౌనులు) పన్నులు అంటే చాలా చిన్న మొత్తంగానే కనిపిస్తుంది. కాని 500 కోట్ల రూ.ల చిన్న బడ్జెట్ (85½ కోట్ల పౌ॥) తో పోలిస్తే మరొక 100 కోట్ల రూ. ల రాబడి వస్తే లాభమేనని చెప్పాలి. గార్విన్ చెప్పినట్లు ఇప్పటికీ దేశంలో రాబడిమీద వచ్చే ప్రత్యక్షపన్నులు బాగా ఎక్కువగా ఉన్నాయి. మనదేశంలో ఉన్నట్లుగా భారతదేశంలో ప్రత్యక్షపన్నులకు సంబంధించిన సాధారణ సదుపాయాలు చాలామటుకు లేవు. అందుచేత వాటి భారం విపరీతంగా ఉంటున్నది. ఇక పరోక్షపన్నుల విషయంలో ఏ చిన్న పన్ను కొత్తగా వేసినా జీవనస్థాయి అంతకంతా తగ్గిపోతుంది. అసంఖ్యాకులైన నిరుపేదలను దెబ్బకొట్టినట్టవుతుంది. మన పరిపాలన రోజుల్లో వేసిన ఉప్పు పన్ను చాలా స్వల్పమైనది. ఆ పన్ను తీసివేస్తే పేదవాడికి కలిసి వచ్చేది ఏడాదికి మూడణాలో నాలుగణాలో ఉంటుంది. అయినా ఈ ఉప్పు పన్నును పురస్కరించుకుని భారతదేశంలో పెద్ద రాజకీయ సంఘర్షణ చెలరేగింది. అయితే ఆ ఉప్పు పన్నును కేవలం పరదేశ ప్రభుత్వానికి చిహ్నంగా భావించారనుకోండి. భారతదేశంవంటి దేశాల్లో పరోక్షపన్నులు విధించటం ఎంతకష్టమో దీనివల్ల వ్యక్తమవుతుంది.

నా రెండో అనుమానం భారత ప్రభుత్వానికి సంబంధించినది. గార్విన్ చెప్పినట్లు భారత ప్రభుత్వ విధానాలు కేవలం మూఢ సిద్ధాంతాలను అనుసరించి నిర్ణయించినవి కావు. కాని ఒకటి మాత్రం నిజం. అనుభవం లేక పోవటంవల్ల కొంత, దేశంలోని సిద్ధాంతాల ప్రభావంవల్ల కొంత, లోక్‌సభ పెట్టుబడిదారులకు వ్యతిరేకమైన విధానాన్ని అనుసరిస్తోంది. ప్రైవేటు పారిశ్రామికుల పట్ల అంత సుహృద్భావము కనబరచడం లేదు. ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించే ధోరణిలో లేదు. పెట్టుబడిదారీ, సామ్యవాద విధానాలలో ఏది మంచిది, ఏది చెడ్డది అనే ప్రశ్న అలా ఉంచి మనం అనుకున్న ఆర్థిక లక్ష్యాలు జయప్రదంగా నెరవేరాలంటే ప్రైవేటు పారిశ్రామికుల సహకారాన్ని స్వీకరించటం, వారిలాభాలను అనుమతించటం తప్పనిసరి అని నా నమ్మకం. అలా చెయ్యకపోతే, మిగిలిన మార్గము ల్లా రష్యాలో మాదిరిగా ప్రభుత్వ నియంతృత్వ విధానమే. కాని భారతప్రభుత్వానికి ప్రైవేటు యాజమాన్యాన్ని కాదని వ్యవహరించ గలిగినంత పరిపాలనా సామర్థ్యం లేదని నే ననుకుంటున్నాను. మనదేశంలో ప్రైవేటు వ్యాపారస్థుల యాజమాన్యకౌశలం ఎంతో ముఖ్యపాత్ర వహిస్తోంది. వైట్‌హాల్‌లో కూర్చుని పనిచేసే పెద్దమనిషి సర్వజ్ఞుడు కాడనీ, ఒకవేళ తను సర్వజ్ఞుడని అతడనుకున్నా, అతనికి వున్నవి రెండు చేతులేననీ, ప్రైవేటు పారిశ్రామికులు చెయ్యగలిగినంత పని అతడు చెయ్యలేడని మనకు తెలుసు. లేబర్ పార్టీ నిర్వహించిన సోషలిస్టు పరిపాలన కాలంలో కూడా యీ దేశంలో నూటికి 80 వంతుల వ్యాపార కలాపాలు ప్రైవేటు పారిశ్రామికుల యాజమాన్యంలోనే ఉండకతప్పలేదు. అందుచేత, ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించవలసిన ఆవశ్యకతను గూర్చి ప్రపంచబ్యాంకి అధ్యక్షుడు యూజిన్ బ్లాక్ భారత ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తితో నేను ఏకీభవిస్తున్నాను. ప్రైవేటురంగాన్ని ప్రోత్సహించటంవలన విదేశీ పెట్టుబడులకు తగిన వాతావరణ మేర్పడుతుంది. కాని యీ విషయంలో భారతప్రభుత్వం అంతగా వివేకం చూపించటం లేదు. ఇప్పుడిప్పుడే కొన్ని పద్ధతులను గూర్చి, ముఖ్యంగా విదేశీ పెట్టుబడులపై పన్నులవిధానాలను గూర్చి భారతప్రభుత్వం పునర్విమర్శ చేస్తున్నట్లు కనిపిస్తోంది. పంచవర్ష ప్రణాళికను నిర్వహించటానికి అత్యవసరమైన విదేశీద్రవ్యాన్ని సంపాదించుకోవాలంటే భారతప్రభుత్వం తన విధానాలను మార్చుకోవటం తప్పదని నా అభిప్రాయం."

★



రాక్ ఎండ్ రోల్ సంగీతం

భారతీయ చిత్రాలలోకి జొరబడిన "రాక్ ఎండ్ రోల్" సంగీతాన్ని విమర్శిస్తూ ప్రముఖ హిందీ సంగీత దర్శకుడు మదన్ మోహన్ "ఫిల్మ్‌ఫేర్" పత్రికలో ఒక వ్యాసం వ్రాశారు.

భారతీయ ప్రేక్షకులకి శాస్త్రీయ సంగీతము వినబడగానే చెప్పులు విసిరి గోలగా గగ్గోలు చేస్తారనీ, 'రాక్ ఎండ్ రోల్' పాట వినబడగానే చప్పట్లు కొట్టి సంతోషిస్తారనీ అనుకోవడమంత పొరబాటు మరొకటి లేదని ఆయన అన్నారు.

'భారతీయ ప్రేక్షకులు రాక్ ఎండ్ రోల్ (ఊగ్ ఎండ్ దొర్ల్) సంగీతమే మాకు కావాలని ఎప్పుడూ అడగలేదు. సంగీత దర్శకులే పని గట్టుకుని ఈ సంగీతం వినిపింపజేశారు. ఇలా వినిపించకపోతే, అసలిలాంటి సంగీతం ఒకటుందని కూడా చాలామంది ప్రేక్షకులకి తెలియకపోను. ఈ రోజున ఈ సంగీతాన్ని ఇవ్వడం మానేస్తే మాకిదే కావాలని వాళ్ళు గోలచేస్తారనుకోను. కనక ఈ సంగీతానికి బాధ్యత ప్రేక్షకులది కాదు; స్టూడియోలో మనుషులదే,' అని మదన్ మోహన్ తన అభిప్రాయం వెల్లడించారు.

పోనీ ఏదోవిధంగా ఎవరో ఒకరు సినిమాలలో ప్రవేశపెట్టిన ఈ సంగీతాన్ని నిజంగా శ్రోతలు ఆదరిస్తున్నారా అంటే అదీ లేదు. బాగా ఎక్కువ అమ్ముడుపోయిన రికార్డులను చూస్తే అవన్నీ భారతీయ సంప్రదాయాన్ని అనుసరించిన పాటలేననీ, విదేశీ సంప్రదాయపు పాటలు కానే కావనీ, ఆయన అన్నారు. దీనికి ఉదాహరణగా తాను "సముందర్" చిత్రంలో పెట్టిన రాక్ ఎండ్ రోల్ పాటలకంటే "భాయ్ భాయ్" లో పెట్టిన దేశీయమైన పాటలే ఎక్కువగా అమ్ముడు పోయాయని ఆయన పేర్కొన్నారు.

అయితే ఇలాంటి విజాతీయ సంగీతాన్ని అనుకరించి భారతీయ చిత్రాల్లో ప్రవేశపెట్టినందుకు సంగీత దర్శకులను నిందించరాదని మదన్ మోహన్ అభిప్రాయం. డైరక్టరు

(53-వ పేజీ చూడండి)



ఒక ఇష్టంలేని పెళ్లికొడుకు, పిల్లల్ని చూసివచ్చి నచ్చలేదని చెబుదామనుకున్నాడు - కాని 'తస్సాదియా' చూస్తే ఇద్దరూనచ్చారు - రిపబ్లిక్ వారి హాస్య ప్రధాన చిత్రం "పెళ్లినందడి"లో సరోజాదేవి, అంజలీదేవి.

డిస్నీలాండ్ ఇంద్రజాలం

వాల్ట్ డిస్నీ అనగానే మికీమౌస్, డొనాల్డ్ డక్ మొదలైన అనేక చలనచిత్ర పాత్రలను సృష్టించి, దాదాపు మూడు దశాబ్దాలుగా అబాలగోపాలాన్ని ఉర్రూతలూగించిన మహత్తర కళాకారుడు జ్ఞాపకం వస్తాడు. డిస్నీ నిర్మించిన 'స్నోవైట్' చిత్రం చూడని, చూసి తన్మయుడు కాని చలనచిత్ర కళాభిమాని ఉండడంటే అతిశయోక్తి కాదు. ఈయన్ని అనుకరిస్తూ, ఈయనలాగ కార్టూన్ చిత్రాలు తీసేవారు ఎందరో బయలుదేరినా, నిర్జీవచిత్రాల్లోంచి సజీవ కవిత్వాన్ని, అపూర్వ వర్ణసమ్మేళనంలోంచి అద్భుత సంగీతాన్ని పలికించడం ఈయనకొక్కడికే చేతనైంది. పాస్టరల్ గీతాల మాధుర్యాన్ని, సింఫనీ సంగీత గాంభీర్యాన్ని ఈయన తెరమీద మరపురానివిధంగా చిత్రించాడు. సిండరెలా, అలిస్, పీటర్ పాన్, లేడీ ఎండ్ ది ట్రాంప్ వంటి ఈయన చిత్రాలు కళాఖండాలుగా కలకాలం నిలిచిపోతాయి.

కార్టూన్ చిత్ర నిర్మాత వాల్ట్ డిస్నీ ఇటీవల ప్రపంచ కళారంగానికి మరొక విధంగా ఒక అమూల్యాలంకారం సంతరించాడు. ఇది కాలిఫోర్నియాలో అనహీంవద్ద ఉన్నది. దీనికి డిస్నీలాండ్ పార్క్ అని పేరుపెట్టారు.

ఈ పార్కు వైశాల్యం 160 ఎకరాలు. 8 కోట 7 లక్షల 50 వేల రూ.లు ఖర్చుపెట్టి డిస్నీ ఈ స్థలాన్ని క్రీడారంగంగా, ప్రదర్శనశాలగా, ఇంద్రజాల ప్రపంచంగా మార్చివేశాడు.


"ఈ ప్రదర్శనశాల మంత్రకవాటాలు తెరుచుకుని లోపలికి పోతేచాలు, నేటి ప్రపంచాన్ని వదిలిపెట్టి నిన్నటి ప్రపంచంలోకి, రేపటి ప్రపంచంలోకి, స్వప్న ప్రపంచంలోకి అడుగు పెట్టినట్లవుతుంది," అని డిస్నీ ఒకసారి అన్నాడు.

డిస్నీలాండ్‌లో 12 వేల కార్లను ఒక్కసారిగా నిలుపుకోటానికి జాగా ఉన్నది. కార్లు నిలుపుకుని యాత్రికులు ఒక మోటారు రైలులో ఎక్కుతారు. అది తీసికెళ్ళి వారిని ఒక చిన్నసైజు రైలుస్టేషనుముందు ఆపుతుంది. అక్కడినించి ఒక పాతకాలపు రైలుబండి బయలుదేరుతుంది. అయితే ఇది నిజం రైలుబండి అంత పెద్దదిగా ఉండదు. దీంట్లో కిందటి శతాబ్దంలో రైళ్ళలో ఉపయోగించినమాదిరి కిరసనాయిలు దీపాలూ, ఇతర పాతకాలపు ఏర్పాట్లు ఉంటాయి. ఈ రైలు పార్కును చుట్టుచుట్టి వస్తుంది.

సింహద్వారంలోంచి లోపలికి పోగానే ముందు కనిపించేది మెయిన్ స్ట్రీట్. 1890 ప్రాంతాల్లో అమెరికన్ పట్టణాలు ఎలా ఉండేవో సరిగ్గా అదే నమూనాలో ఈ వీధిని కటారు. ఇవన్నీకూడా ఒక్క రవ్వ చిన్నవిగా ఉన్నా అసలు ఇళ్ళలాగానే ఉంటాయి. ప్రత్యేకంగా తర్ఫీదుచేసిన చిన్న గుర్రాలు లాగే ట్రాముకార్లు, ఫైర్ ఇంజన్లు ఆ వీధిలో కనిపిస్తాయి. ట్రాముల్లో ఎక్కి టౌనుహాలుకి, పోస్టాఫీసుకి, ఇంకా హోటళ్ళకి, దుకాణాలకి పోవచ్చు. సారా అంగళ్లలో వాడే గాజుపాత్రల నించి ప్రతి చిన్న వస్తువు దాకా అన్నీ ఆ కాలంలో ఎలా ఉండేవో సరిగ్గా అలాగే ఉంటాయి.

ఈ వీధి దాటిపోతే నాలుగురోడ్లు కలిసే ప్లాజా ఒకటివస్తుంది. ఇక్కడినించి రేపటి ప్రపంచానికి, స్వప్నప్రపంచానికి, సాహస దేశానికి, సరిహద్దు దేశానికి పోవచ్చు.

రేపటి ప్రపంచాన్ని సమీపించగానే ఒక పెద్ద, పొడుగాటి ఆకాశవాహనం (రాకెట్) కనిపిస్తుంది. దగ్గర్లో కొత్త కొత్త రకాలుగా కట్టిన భవనాలుంటాయి. వీటిలో అమెరికాలోని పెద్ద పెద్ద పారిశ్రామిక సంస్థలు పంపించిన వస్తువులు ప్రదర్శింపబడతాయి. ఈ వస్తువులన్నీ రేపటితరం వారు వాడబోయేవే. ఇక్కడ చిన్న సైజు రేసింగ్ కార్లుంటాయి. ఆటోపియా అనే రోడ్డుమీద ఈ కారను నడపవచ్చు. ఒకచోట ఆకాశపు స్టేషను ఉంది. అక్కడున్న రాకెట్లలోకి ఎక్కి కూర్చుని, సరిగ్గా, చంద్రలోకానికి నిజంగా ప్రయాణం చేస్తే ఎలాఉంటుందో, అలాటి ఉత్తుత్తిప్రయాణం చేయవచ్చు.




ఇది డిస్నీలాండ్ రైలుస్టేషను. 1890 ప్రాంతాల్లోని స్టేషన్ల పద్ధతిలో దీన్ని కట్టారు. ఆ కాలపు రైళ్లలాంటి ఒక రైలెక్కి మొత్తం డిస్నీలాండ్ అంతటినీ చుట్టిరావచ్చు. డిస్నీలాండ్ లోపలికి పోవాలంటే ఈ స్టేషను లోంచే పోవాలి.


తరవాత స్వప్న ప్రపంచం వస్తుంది. 70 అడుగుల ఎత్తున్న ఒక కోటలోంచి లోపలికి పోవాలి. ఈ కోటకి గోపురాలు, బురుజులు కందకం, దాన్ని దాటడానికి ఎత్తి దించే ఒకవంతెన అన్నీ ఉన్నాయి. మధ్యయుగాల నాటి అద్భుత వైభవంతో కళ్ళుచెదిరేలు మనిపించే ఒకగదిలో 'నిద్రిత సుందరి' (స్లీపింగ్ బ్యూటీ) ని చూడచ్చు. ఇంకో చోట వాల్ట్ డిస్నీ సృష్టించిన రకరకాల చలనచిత్ర పాత్రల్ని చూడచ్చు. పీటర్ పాన్ విభాగం ఒకటి ఉంది. సముద్రపు దొంగలఓడలో ఎక్కి పీటర్ పాన్ తో కలిసి ఆకాశంలో లండన్ మీదుగా ఊహాలోకం (నెవర్ నెవర్ లాండ్) లోకి పోవచ్చు. ఇంకో చోట భూగర్భ శకటం ఉంది. అందులో ఎక్కి స్నోవైట్ కథ లోని ఏడుగురు మరుగుజ్జుల తొల్లాకు రత్నాలగనికి పోవచ్చు. అక్కడ కథలోని మాంత్రికురాలు, స్నోవైట్ కనిపిస్తారు. ఇంకోచోటకుందేలు కన్నం లోంచిపోయి, ఆలిస్ చూసిన అద్భుతలోకానికి (వండర్ లాండ్) పోవచ్చు.

ఇంకా ఇతరచోట్ల మాన్ స్ట్రో తిమింగలం, మిస్టర్ టోడ్, ఎగిరే ఏనుగు డంబో, డొనాల్డ్ డక్ కనిపిస్తారు.


సరిహద్దు దేశం అనే విభాగంలోకి కర్రలగేటులోంచి పోవాలి. ఇక్కడే పాతకాలపు రక్షణదుర్గం ఒకటి ఉంటుంది. లోపలికి పోతే డేవి క్రాకెట్ మ్యూజియం



ఇది మెయిన్‌రోడ్డు దృశ్యం. 1890 ప్రాంతాల్లో అమెరికన్ పట్టణాల పద్ధతిలో దీన్ని కట్టారు. గుఱ్ఱాలు లాగే ట్రాముల్లో కూర్చుని బజారులో అన్నీ చూసుకుంటూ పోవచ్చు.



'రేపటి ప్రపంచం'లోని ఒక వింత: ఇది ప్రపంచ గడియారం. ఈ గడియారంచూసి ఆ క్షణంలో ప్రపంచంలో ఎక్కడెక్కడ ఎంతెంత టైమయిందీ తెలుసుకోవచ్చు.



'సరిహద్దుదేశం'లోకిపోయే దోవ. దీంట్లోనించి పోతే రెడ్-ఇండియన్లు, కౌబోయిస్, సరిహద్దు ప్రాంతపుజనులు కనిపిస్తారు.

డిస్నీలాండ్ ఇంద్రజాలం

కనిపిస్తుంది. దుప్పి చర్మపు దుస్తులు, కూన్ చర్మపు టోపీలు ధరించిన అమెరికన్ సరిహద్దు ప్రాంతాల మనుషులు అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు.

రెడ్ ఇండియన్లు, పశువుల కాపర్లు (కౌబోయిస్) నివసించే భాగంలోంచి గుర్రపుబోగీలు యాత్రికులను తీసుకు వెడతాయి. ఇక్కడ పశువులు, గుర్రాలు మందలు మందలుగా కనిపిస్తాయి. అచ్చు అమెరికన్ నది అనిపించే ఒక నదిలాంటి దాంట్లో ప్రయాణంచేసే 105 అడుగుల పొడుగు పాతకాలపు పడవ ఒకటి ఉంటుంది. దాంట్లో కూర్చుని న్యూఆర్లియన్స్, నాచీజ్, మెంఫిస్ అను జ్ఞాపకంచేసే రేవు పట్టణాలమీదుగా పడవప్రయాణం చేయవచ్చు. ఈ పడవపేరు 'మార్క్ ట్వేన్'.

సాహసదేశం అచ్చు దక్షిణ పసిఫిక్ ప్రాంతాలను జ్ఞాపకంచేస్తుంది. తాడిచెట్లు, గుబురైన పొదలు, తాహితియన్ గ్రామం, అందులో బజార్లు అన్నీ కనిపిస్తాయి. ఉష్ణప్రాంతాల నదులమాదిరి నదులున్న అయిదెకరాల స్థలం వుంది. ఈనదుల్లో పడవ ప్రయాణంచేస్తూ ఒడ్డునుంచి యాత్రికులకేసి కోపంగా చూసే ఏనుగులు, సింహాలు, తదితర వన్యమృగాల ప్రతిమలను చూడచ్చు. నీళ్ళలో ప్లాస్టిక్‌తో, తీగలతో తయారుచేసిన మొసళ్లు, హిప్పొపొటమస్‌లు కళ్ళు, ఒళ్ళు తిప్పుతుంటూ, అరుస్తూ, ఈదుతూ పడవల్ని తరిమి తరిమి యాత్రికుల్ని తమాషాగా భయపెడతాయి.




ఇది 'సాహసదేశం'లో దక్షిణ పసిఫిక్ ప్రాంతపుదృశ్యం. చుట్టూ చెట్లూ, పొదలు. నీళ్ళలో మొసళ్ళబొమ్మలు, హిప్పో బొమ్మలు ఉంటాయి. పడవల్లో కూర్చుని ప్రయాణంచేసేవాళ్ళని అవి తమాషాకి భయపెడతాయి.

ఇలాంటి విచిత్ర ప్రదర్శనం సృష్టించాలని వాల్ట్ డిస్నీ ఇరవై ఏళ్ళనుంచీ కలలు కంటున్నాడు. 1952 లో దీనికి పథకం తయారుచేయ ప్రారంభించాడు. 1954 మే నెలలో స్థలంకొన్నాడు. తరవాత 14 నెలలకే ప్రదర్శనం ప్రారంభమైంది.

దాదాపు రెండేళ్ళ కింద ప్రారంభమైన ఈ ప్రదర్శనాన్ని లక్షలాది ప్రజలు ఇప్పటికి చూసి ఆనందించారు. పిల్లలు, పెద్దలు, ఆడా, మగా, దేశీయులు, విదేశీయులు ఎందరో డిస్నీలాండ్ చూసి అదంతా నిజమా, ఇంద్రజాలమా, అని విభ్రాంతులయ్యారు. చూస్తేగాని దాని అందం తెలియదని చూసినవాళ్ళంతా అన్నారు. మరి చూడాలంటే కాలిఫోర్నియా దాకా పోయి రావలసిందే.

["స్టాన్‌వాక్" పత్రిక సౌజన్యంతో] ★



గత శతాబ్దపు నమూనాలో గుఱ్ఱపు ట్రాము బండి. బండి డ్రైవరు వాల్ట్ డిస్నీ.

రాక్ ఎండ్ రోల్ సంగీతం

(49-వ పేజీ తరువాయి)

చెప్పినట్లు సంగీత దర్శకుడు చేయవలసిందనీ, సెక్సప్పీలు నృత్యాలుగల సన్నివేశాలు వచ్చినప్పుడు సైగల్ పాటలాంటి పాటనో, భజన పాటనో పెట్టటానికి వీలేదు గనుక అలాంటి విజాతీయ సంగీతం ప్రవేశపెట్టవలసి వస్తోందనీ ఆయన అన్నారు.

నిజానికి డైరక్టరును కూడా అని లాభం లేదు. డైరక్టరుమాత్రం ఏమి చేస్తాడు. అతని కిచ్చిన కథలో ఏ సన్నివేశం ఉంటే ఆ సన్నివేశాన్నే చిత్రీకరిస్తాడు. కనుక స్క్రిప్టు రచయితదే బాధ్యత అన్నమాట. కాని స్క్రిప్టు రాసేవాడు మాత్రం ఏం చేస్తాడు? నిర్మాత ఎలాంటి కథ రాయమంటే ఆ కథ రాయవలసిందే. నిర్మాతని అడిగితే తనదేమీ బాధ్యత లేదనీ, ప్రేక్షకుల అభిరుచుల్ని బట్టే తాను నడుచుకుంటున్నాననీ అంటాడు. ప్రేక్షకులని నిలదీసి అడగటానికి వీల్లేదు గనక నిర్మాత చెప్పిందే చెల్లుబాటౌతోంది. అదీకథ. ఈకథ ఎలా ఉందంటే చిన్నప్పుడు అమ్మమ్మలు చెప్పిన కథలాగా ఉంది. "చేపా చేపా ఎందుకు ఎండలేదు" అంటే "నాదేం తప్పులేదు, మబ్బు అడ్డం వచ్చింది అందుకని ఎండలేదు" అన్నదట. మబ్బునడిగితే అదీ తన తప్పులేదన్నదట. ఇలాగ ఎవరికి వాళ్లే తమ బాధ్యత కాదని తప్పించుకో జూస్తారు. మదన్ మోహన్ సంగీత దర్శకుడు గనుక తన తోటివారిని సమర్థించారు. కాని సంగీత దర్శకులంతా కలిసి తమలో తాము పోటీలు పడేబదులు, 'మేము ఈ మాదిరి చెత్త సంగీతాన్ని, పరాయి సంగీతాన్ని అనుకరించము' అని ఎందుకు తీర్మానం చేసుకోగూడదు? అలాగే కథారచయితలు, దర్శకులు, నిర్మాతలు, నటులు అంతా విజాతీయతవెంట పడి పాకులాడమని ఎందుకు తీర్మానం చేసుకోగూడదు?

పాశ్చాత్య సంగీతానుకరణకి రెండో కారణంగా, మదన్ మోహన్ భారతప్రభుత్వ విధానాలను పేర్కొన్నారు.

"మొదట్లో భారతీయ సినిమాసంగీత దర్శకులు శ్రావ్యమైన భారతీయ లలిత సంగీతాన్నే సృష్టించేవారు. న్యూథియేటర్స్, ప్రభాత్, బొంబేటాకీస్ లనుంచి ఇటువంటి చక్కని సంగీతమే వచ్చేది. కాని దేశంలో జాతీయప్రభుత్వం ఏర్పడినతర్వాత రేడియోలోను, ప్రభుత్వాధ్వర్యాన జరిగే సభల్లోను సినిమా సంగీతాన్ని నిషేధించారు. దాంతో సంగీతదర్శకులు వెలివేసినట్లయ్యారు...... వీరు కసిగా విదేశీసంగీతాన్ని దొంగిలించటం దాకా పోయారు," అని మదన్ మోహన్ వ్రాశారు. సినిమాసంగీతాన్ని వెలివేసినట్లు చూడకుండా కొంత సానుభూతితో చూసి ప్రోత్సాహంఇస్తే, సంగీతదర్శకులు అనుకరణలు మానేసి భారతీయమైన సంగీతాన్ని అందివ్వటానికి వీలు కలుగుతుందని కూడా ఆయన సూచన చేశారు.

ఇప్పటి ధోరణేగనక కొనసాగితే, రాక్ ఎండ్ రోల్ మోత భారతీయ సినిమా సంగీతపు మరణవాద్యాల మోతగా తయారవుతుందని ఆయన హెచ్చరిక చేశారు. ★



బి. ఎ. ఎస్. ప్రొడక్షన్స్ "చెంచులక్ష్మి" లో అంజలీదేవి.



విజయవారి చిత్రం "అప్పుచేసి పప్పుకూడు"లో ఒక హాస్యసన్నివేశం: గిరిజ, రేలంగి, సావిత్రి.

సినిమా వార్తలు

ఎ. వి. ఎం. వారి కొత్తగా తీసే హిందీ చిత్రంలో అశోక్‌కుమార్, శ్యామ, జగదీప్, బాబూరావ్ పెండార్కర్, లలితాపవర్ నటిస్తున్నారు. రాజా పరంజ్‌పే డైరక్టుచేసే ఈ చిత్రం "నాల్వార్" అనే తమిళ చిత్రం కథపై ఆధారపడినది. సంభాషణలు, పాటలు రాజేంద్రకిషన్. సంగీత దర్శకుడు మదన్ మోహన్.

* * *

ప్రధాని నెహ్రూ ఇటీవల బొంబాయి వెళ్ళినప్పుడు బొంబాయి గవర్నరు శ్రీప్రకాశ చేసిన విందులో ప్రత్యేకాహ్వానంపై పద్మశ్రీ నర్గీస్ కూడా పాల్గొన్నది.

* * *

నూతన గృహప్రవేశం

సినీరంగంలో 'జూనియర్ సముద్రాల' అని పేరుగాంచిన శ్రీ సముద్రాల వెంకట రామానుజమ్ (సుప్రసిద్ధ సినిమా రచయిత శ్రీ సముద్రాల రాఘవాచారి జ్యేష్ఠ కుమారుడు) కోడంబాకంలోని జకరయ్యా కాలనీలో ఫిబ్రవరి 9వ తేదీ ఉదయం నూతన గృహప్రవేశ మహోత్సవం జరుపుకున్నారు. సినిమా పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, ఇతర మిత్రులూ హాజరై తమ ఆశీర్వచనాలు అందజేశారు.

★



"అపరాధికౌన్?"లో మాలాసిన్హా, అభీభట్టాచార్య.

'షష్టాష్టకం'

(34-వ పేజీ తరువాయి)

ఆ కొత్త ఫలభాండ విసర్జన అయ్యేదాకా యిన్నాటలన్నా ఆడుతారు. తరువాత చిప్పదొప్పచేరితే తెలుస్తుంది?'

'రావాలని కోరికా'

'ఇట్లా చేస్తే రాకమానుతుందా' పండంటి ఆటతోట, పదారాలలూగానీ పాడుచేశారు గదా?

'చేస్తే చేశానేపో. ఇదంతా మా వాళ్ళ స్వార్జితము'

'ఈ ప్రతుకొక్కదానికే గొప్పగా చెప్పకోవాలి. శ్రీ వారి స్వార్జితము సెంటు లేదు. పిత్రార్జితమైతే పాడుచేయమన్నారా?'

'అనటాని కన్నైనా అనవచ్చు. నిజమో అబద్ధమో కొంతైనా విచారించవక్కర్లా.'

'విచారించినట్లేయుంది. నిజమాడితే నిర్ధారము.'

....

'ఇంకెప్పుడు మీరు మంచి బుద్ధొచ్చేది. ఎవరికోపురమన్నా చూడముచ్చటవుతుంది'

'ఎదుట మనిషి కనబడుతుంటే యింకాయా బాగుకు కంతే మంటుంది.

'ఆ! అంటే మృత్యుదేవత, అందరికి ప్రత్యక్షమవుతుంది. ఈ పాపిష్టి వానికి దొరకన్నా రాదు.'

'ఇప్పుడైతే మునుపటి మరణమే. అంతా కావలెనని కోరుకునేది అదే'

'మీకంతా వేళాకోళంగా ఉన్నది'

'ఉండదామరి. నీలివార్తలు నమ్మి నీవు పోరుపెడుతుంటే'

'నిప్పు లేంది పొగరాదు'

'మనము బాగుంటే చూడలేనివాళ్ళు చెప్పే మాటలు వినుటవల్లనే యీ రాద్ధాంతాలు.'

'మనము బాగున్నదెప్పుడు'

'ఆ సంగతి నీకు తెలియాలి'

ఇ

'ఈ ఒక్క నాడు అక్కడేఉండి రాలేకపోయినారా పాపము.'

'ఎంత టైమయిందనుకున్నావేమిటి! నిద్ర ముంచుకొన.'

'నిద్ర ముంచుకొంటారేంటి. ఒంటిగంట కావస్తుంటేను.'

'ఇప్పుడే గదా పన్నెండు కొట్టింది.'

'పన్నెండు గంటలదాకా బజార్లలో యేమి పెలక చేస్తున్నట్లు.'

'ఎవరో స్నేహితులు మాట్లాడుతుంటే ఆలస్యమైంది'

'పుంలింగాలా, స్త్రీలింగాలా'

'అనుమానము పెనుభూతము'

'ప్రత్యక్షంగా కనబడుతుంటే. ముంజేతి కంకణాని కద్దమెందుకు'

'మాటలైతే నేర్చావు'

'ఇంతకు భోజనము చేసేదమన్నా ఉందా కళ్ళుమూసుక పోతున్నవి'

'ఇప్పుడే గదా నీకు నిద్రలేచింది'

'ఎంతసేపని కనిపెట్టుకొనుండేది.'

'అం తాకలిగా లేదు'

'భోజనాలే మివ్వవద్దులెండి'

'పీటక్రింద పెడతాలే'

'మెతుకులు లెక్కపెట్టుకున్నాలే'

'ఆకలిలేదంటి నిగా'

'ఏమి విశేషము'

'ఎవరో స్నేహితులతో కలిసి హోటలు కైవెళ్ళా'

'ఇంట్లో తల్లిపాయల వాసన గిట్టక, అక్కడ మీకెట్లా సయిస్తుంది?'

'ఒక కాఫీ మాత్రమే'

'కాఫీ త్రాగితేనే ఆకలిగా లేదా'

'అదే కాఫీ మహాత్మ్యము'

'ఆరోగ్యము పాడవుతుందండి. ఇట్లా పర్సు గుల్ల చేసుకుంటున్నారు.'

'నాకైవరికోసమున్నారను కొన్నారా'

ఆ

'ఏమండీ! నిద్రా?'

'.........'

'అప్పుడే మంచి గూడ వేసుకున్నట్లున్నారే?'

'.........'

'నే చెప్పిందేమన్నా గ్రహించారా'

'ఊఁ'

'ఎన్నాళ్ళని యిట్లా'

'ఊఁ'

'ఏమిటీ! ఊఁ, ఊఁ!'

'ఊఁ'

'అంగీకారమా, తిరస్కారమా'

'ఇస్! అబ్బ!'

'.........'

'మాట్లాడరేమండీ'

'ఏమిటీ అర్ధరాత్రి గోల. నిద్రపోనీకుండా'

'ఇప్పటివరకు మీకొఱకు కళ్ళలో వత్తులు వేసుకొని కూర్చున్నానే'

'.........'

'ఆమాత్రము సానుభూతన్నా లేదేమండీ. పలుకే బంగారమా'

'.........'

'మీమార్గము నుండిమరలరా'

'అదంత సులభమనుకున్నావా'

'పట్టుదలుంటే సాధ్యము గానిదేముంది'

'అది ఉంటే యిక లేనిదేముంది'

'జీవితమంతా యిట్లా సాగాలిసిందేనా'

'సాగినన్నాళ్ళు!'

'తరువాత'

'దేవుడున్నాడు'

'ఇట్లాంటివాళ్ళకే'

★

ఉద్యోగం దొరికింది

(23-వ పేజీ తరువాయి)

నాకు జరిగిన ప్రమాదానికి వారెంతో జాలిపడి "అయ్యో మరి మాకేం తెలుసు నాయనా; యిందాక టిక్కెట్టు కలెక్టరు డబ్బు కట్టమన్నప్పుడు ఆయన మీ జేబులో తన్నుతీసి డబ్బిచ్చేశాడే" అని వాపోయారు.

నా గుండె ఆగిపోయింది. చేతులు జేబులోనికి పోనిచ్చి మనీపర్సులో చూద్దునుగదా దాదాపు వన్నెండు రూపాయలు తగ్గి ఉన్నాయి. 'నా ఖర్మలెం డిదంతా, మీరు మాత్రం ఏం చేస్తారు. ఆయన నన్నింత మోసం చేస్తాడని నేను మాత్రం అనుకున్నానా,' అనేవాక్యాన్ని దుఃఖరసంలో ఒప్పించాను.

కళ్ళంబడి నీళ్ళు తప్ప వేగాని,ఒకమూల ఏడుపొస్తోంది. అతగాణ్ణి నమిలి మింగేయాలన్నంత కోపమొచ్చింది. నా తెలివి తక్కువతనానికి ఒకమూల నన్ను నేనే తిట్టుకుంటున్నాను.

ఇంతలో ఒక బొట్టుమీసాలాయన, నాకు ధైర్యం చెప్పాల్సిందిపోయి, నాలో ఏదో తప్పున్నట్లు, "ఇంత లోకజ్ఞానం లేకపోతే నీవు మేష్టరు పనేంచేస్తావయ్యా" అని ఎత్తి పొడిచాడు. నేనేం మాట్లాడలేదు.

ఆ తాతయ్య తిరిగి అందుకుని 'నీవు చెప్పిన వెంకటేశ్వర్లుగార్ని రిజర్వుడు లిస్ట్‌లో వేసి ఉంటారు. ఒకవేళ మీరు ఉద్యోగానికి చేరమన్న టైముకి హాజరు కాకపోతే ఆయన్ను వేస్తారన్నమాట. రిజర్వుడు ఏదో ఉద్యోగమనుకున్నావేమో. నీవు టైముకి చేరకుండా చేసేందుకు ఆయన నిన్నిక్కడదాకా తెచ్చాడు.' అని జరిగిన మోసాన్ని వ్యాఖ్యానం చేశాడు.

నే తెల్లబోయి, ముఖమంతా కోపంగా మూర్ఖంలో నింపి, ఇదంతా నా ఖర్మలేండి అని రైలు దిగి ప్లాట్‌ఫారం మీద ఉన్న బెంచీమీద కూలబడ్డాను. అప్పుడు లోకమంటే ఏమిటో అర్థమై, తరువాత కర్తవ్యం నిర్వహించే పథకం వేసుకున్నాను.

నానా అవస్థాపడి ఆవేళ సాయంత్రం మూడు గంటలకి గమ్యస్థానం చేరుకున్నాను. నేను స్కూల్లోకి వెళ్ళేటప్పటికి, నా కంటె ఎంత ముందొచ్చాడో మరి, ఆ బయట వరండాలో నుంచుని ఉన్నాడా రాక్షసుడు.

పది గంటలకే వన్నూ రమ్మన్నారు గదా ఇప్పుడేమో మూడయిం దాయెను. బహుశా నా ఉద్యోగం ఆయనకే యిచ్చేసి ఉంటారనుకున్నాను. అయినా యింతదాకా వచ్చి సందేహంతో వెనక్కు తిరగటమేమిటని, హెడ్మాష్టరు దగ్గరకి నేరుగా వెళ్ళిపోయాను నమస్కారము మొదలుగాగల ప్రక్రియలు జరిగిన తరువాత నా ప్రయాణంలో జరిగిన ప్రణయాన్ని ఆయనకి వివరించాను.

'ఇంకా నయం ఒక అర గంట ఆలస్యం గాకస్తే మీ ఉద్యోగం పోయేదా'ని ఆయన నిసుక్కున్నారు. ఆ మాటలు విన్న నాకు గుండెల్లో ఉన్న బాధ సగం తగ్గింది.

నేను సంతకంపెట్టి బ్రతుకు జీవుడా అని గాలి పీల్చుకోనేందుకు బయటికి వచ్చానుగదా అక్కడ ఎవ్వరూ లేరు.

ఉత్తరీయంతో నిను దుడుం టూ 'పాకం కమించుగాక' అన్న కోటేషన్ మెల్లగా అనుకున్నాను! ★

(26-వ పేజీ తరువాయి)

లకు శ్రద్ధ తక్కువైనా కొత్త విషయాలు నేర్చుకుంటారు. 19 తేదీని ఆగా ధంగను. 20, 21, 22 తేదీలలో మాట నేర్పరితనము వల్ల కార్యలాభము. 23 న ఇంట్లోవారికి అస్వస్థత. 24, 25 తేదీలలో శుభ్య కావ్య శ్రవణము, ఈశ్వర చింత.

* శతభిషం [గో, సా, సీ, సూ] *

ఈ వారము కార్యభారము యెక్కువ. డబ్బును గురించి ఎక్కువ కష్టము కలుగుతుంది. అవసరాలకు చాలక సర్దుబాటు చేసుకోలేక ఇంచామించ పడతారు. ఇతరుల పనులు నెరవేర్చిందికి పూనుకొని వివాదాలకు లోనౌతారు. భార్య ఆరోగ్యము సరిలేనందున వ్యథపొందుతారు. ఉద్యోగస్తులకూ ఒత్తిడి ఎక్కువగా వున్నను తోటివారి సహకారము లభిస్తుంది. వర్తకులకు ప్రయాణములవల్ల శ్రమ కలిగిననూ లాభముంటుంది. 19 న తేదిని త్రిప్పట, ఆర్థికముగా ఒత్తిడి, 20, 21, 22 తేదీలలో ప్రయాణము, కొంత లాభము. 23 న ఆరోగ్య చింతచే మనో వ్యథ. 24, 25 తేదీలలో శ్రమతో కూడిన కార్యక్రమము. స్వల్పలాభము.

* పూర్వాభాద్ర [సే, సో, దా, దీ] *

ఈ వారము చాలా పనులు నెరవేర్చిందికి మీ సామర్థ్యము సంతటినీ ఉపయోగించవలెను. ప్రతి ప్రయత్నానికి ఆటంకము కలుగుతుంది. వృధాగా ఖర్చులు అవుతవి. అయిననూ చలించకుండా ప్రయత్నించి కార్య సాధన పొందుతారు. డబ్బుకు ఇబ్బంది కలిగినప్పటికీ సోదర సహాయమువల్ల చాలా మట్టుకు సర్దుబాటు అవుతుంది. ప్రమాదములు జరిగే సూచనలున్నవి జాగ్రత్తవల్ల తప్పవచ్చును. యంత్రములు నడిపే నిపుణులకూ, ఇనపసామానుల వ్యాపారస్తులకూ, భూస్వాములకూ మేలుకాలము. 19 న తేదీని త్రిప్పట, ఆటంకములు, 20, 21, 22 తేదీలలో ఆదాయాభివృద్ధి, బంధు సహాయము. 23 న ప్రమాద సూచన. 24, 25 లలో కార్యలాభము.

* ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థా] *

ఈ వారము మీకు యోగప్రదము. అధికారములో వున్న వారి సహాయమువల్లనూ మీ బుద్ధిబలమువల్లను ప్రయత్నించి కార్యసాధన పొందుతారు. కొత్తవారితో పరిచయము కలుగుట, శుభవార్త వినుట మొదలగు మంచి ఫలితాలు కలుగుతాయి. ఇంట్లో వారి ఆరోగ్యము బాగుపడుతుంది. గణిత శాస్త్రజ్ఞులకు, కవులకు, కళాకారులకు యోగకాలము. డాక్టర్లకు మందుల వర్తకులకు లాభము. 19 న తేదీ కార్యావసరముచే తీరికలేని త్రిప్పట. 20, 21, 22 తేదీలలో ప్రయాణము, అధికారుల సహాయము, కార్యలాభము. 23 న అలసట. 24, 25 లలో మిత్రదర్శనము, లాభము. ఖర్చులు ఎక్కువ.

* రేవతి [దే, దో, చా, చీ] *

ఈ వారము మీ ఆశయాల ప్రకారము కార్యనిర్ణయము జరిపి ఫలమును పొందుతారు. ఆర్థిక, మానసిక, ఆరోగ్య విషయాలలో ఉత్సాహముగా వుంటారు. లాభకరమైన ప్రయాణమువల్ల వర్తకులకు యోగకరముగా వుంటుంది. ఉద్యోగస్తులకు మంచికాలము. హోదా పెరగవచ్చును. పిల్లల యొక్క అభివృద్ధిచే సంతోషము పొందుతారు. మత గ్రంథము చదివి జ్ఞానాభివృద్ధి చేసుకుంటారు. ఉపాధ్యాయులకూ, పండితులకూ, న్యాయవాదులకూ, నటీనటులకూ, మేలుకాలము. 19 న కార్యలోందరలచే శ్రమ. 20, 21, 22 తేదీలలో ప్రయాణము, ధనలాభము, పండితగోష్ఠి, 23 అలసట. 24, 25 తేదీలలో బంధు దర్శనము, శుభకార్య చింత. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad



బుద్ధుని నిర్వాణము

[సారనాథ్ విహార్‌లోని చిత్రము]

—ఫోటో: డా॥ సి. జి. కె. రామానుజం, గుంటూరు.

